సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 201

బుధవారం 12-10-2022




'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



**భారత్ 'ఫినిషింగ్ టచ్'**


చివరి వన్డేలో దక్షిణాఫ్రికాపై నెగ్గి సిరీస్‌ను 2-1తో దక్కించుకున్న భారత్ - 12లో



**టయోటా ఫ్లెక్స్ ఫ్యూయల్ ఈవీ**

బ్యాటరీ, 100% ఇథనాల్‌తో నడిచే కారును ప్రారంభించిన గడ్కరీ - 13లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

**ఉజ్జయిని నిండా ఆధ్యాత్మికతే**

ప్రధాని మోదీ ఉజ్జయినిలో మహాకాల్ కారిడార్ మొదటి దశను ప్రారంభించారు. మహాకాళేశ్వరాలయంలో పూజలు చేశారు.

వివరాలు 6లో



**ములాయంకు కన్నీటి వీడ్కోలు**

సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అంత్యక్రియలు యూపీలోని సైఫైలో అధికార లాంఛనాలతో జరిగాయి.

వివరాలు 6లో



**కేరళలో నరబలి**

ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయనే మూఢ విశ్వాసంతో కేరళలో ఇద్దరు మహిళలను దంపతులు నరబలి ఇచ్చారు.

వివరాలు 6లో



**ఉక్రెయిన్‌పై క్షిపణుల మోత**

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం భీకర రూపం దాల్చింది. సుదూర ప్రాంతాలను ఛేదించే క్షిపణులతో రష్యా విధ్వంసం సృష్టిస్తోంది.

వివరాలు 6లో

# గింజగింజకూ 'మద్దతు'

## పంటల కొనుగోలులో రైతన్నలకు అండగా నిలవాలి: సీఎం వైఎస్ జగన్

- ఎక్కడైనా ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరలుంటే తక్షణమే జోక్యం
- సీఎం యాప్ ద్వారా ఫిర్యాదు అందగానే స్పందించేలా ఎస్‌ఎల్‌ఏ
- ఈ–క్రాపింగ్‌తో ధాన్యం కొనుగోళ్లలో పూర్తి స్థాయిలో పారదర్శకత
- 15 కల్లా రైతుల అథంటికేషన్ పూర్తి చేసి రశీదులు
- ఆర్బీకే మిత్రలు, రైతు సహాయకులుగా వలంటీర్లు
- ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- గన్నీ బ్యాగులు, హమాలీలతో సహా అన్నీ సిద్ధం చేసుకోవాలి
- బియ్యం ఎగుమతులపైనా దృష్టి సారించాలి
- ఇథనాల్ తయారీకి రంగు మారిన ధాన్యం, బ్రోకెన్ రైస్ వినియోగం
- ఏటా ఖరీఫ్‌కు ముందే భూసార పరీక్షలు.. ఆర్బీకేల్లో టెస్టింగ్ డివైజ్‌లు
- భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం
- వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, ధాన్యం సేకరణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష



"అన్నదాతలు పండించే ప్రతీ పంటకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) దక్కేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎమ్మెస్పీ కన్నా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఏ ఒక్క రైతన్న కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం లేకుండా పంటల కొనుగోళ్ల సమయంలో వారికి అన్ని విధాలా అండగా నిలవాలి.

- అధికార యంత్రాంగానికి సీఎం జగన్ ఆదేశం"

**సాక్షి, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పంటనూ ఈ–క్రాపింగ్ చేయడం వల్ల ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంట వేశారు? ఎంత దిగుబడి వస్తుందనే విషయంలో స్పష్టత వచ్చిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లలో పూర్తి స్థాయిలో పారదర్శకత వచ్చిందన్నారు. పంటల నమోదు నూరు శాతం పూర్తి కాగా, వీఏఏ, వీఆర్‌వోల ద్వారా ఈ – కేవైసీ 99 శాతం పూర్తైనందున ఈనెల 15వ తేదీలోగా రైతుల ఈ – కేవైసీ (వేలిముద్రలు) పూర్తిచేసి ప్రతి రైతుకు డిజిటల్, ఫిజికల్ రశీదులివ్వాలని సూచించారు. పంటల కొనుగోళ్ల సందర్భంగా ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం సోషల్ ఆడిట్ పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలతో పాటు ఖరీఫ్ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ మంగళవారం సమీక్షించి అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

**ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం**

ఖరీఫ్ సీజన్ దాదాపుగా పూర్తైంది. కోతలు మొదలయ్యేలోగా కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి. కొనుగోళ్ల సందర్భంగా ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదు. గన్నీ బ్యాగులు, కూలీలు, రవాణా సదుపాయాలను అవసరమైన మేరకు సమకూర్చుకోవాలి. ధాన్యం కొనుగోళ్లపై ఆర్బీకేల ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో

మిగతా 2వ పేజీలో ▶

# 50వ సీజేఐగా జస్టిస్ డీవై చంద్రచూడ్



జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో సీజేఐ జస్టిస్ లలిత్

**సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ సిఫార్సు**

**ప్రధాని, రాష్ట్రపతి ఆమోదం లాంఛనమే.. నవంబర్ 9న బాధ్యతల స్వీకరణ**

భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ నియమితులు కానున్నారు. ఆయన పేరును సిఫార్సు చేస్తూ సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ మంగళవారం ఫుల్ కోర్టు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం కేంద్ర న్యాయ శాఖకు ప్రతిపాదన పంపారు. న్యాయ శాఖ దాన్ని ప్రధాని పరిశీలనకు పంపనుంది. ప్రధాని, ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం అనంతరం జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా నియమితులవుతారు. జస్టిస్ లలిత్ నవంబర్ 8న పదవీ విరమణ చేయనున్నారు. 9న జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా ప్రమాణం చేస్తారు. ఆయన తండ్రి జస్టిస్ వైవీ చంద్రచూడ్ కూడా సీజేఐగా పనిచేశారు. తండ్రీ కొడుకులిద్దరూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కావడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.

6లో

# అవినీతిపరుల గుండెల్లో 14400

## ప్రభుత్వం తీసుకొచ్చిన ఏసీబీ మొబైల్ యాప్ విజయవంతం

- ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తున్న బాధితులు..
- మొబైల్ యాప్‌లో డాక్యుమెంట్లు, క్లిప్పింగ్‌లకూ అవకాశం
- ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందిస్తున్న ఏసీబీ అధికారులు
- 88 శాతం సమస్యలు పరిష్కరించిన యాప్
- కాల్ సెంటర్ ద్వారా 94 శాతం సమస్యలు పరిష్కారం




**సాక్షి, అమరావతి:** గతంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అవినీతిపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనుకాడేవారు. ఎవరైనా ధైర్యం చేసి ఫిర్యాదు చేద్దామన్నా పెద్ద తతంగమే ఉండేది. కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నా సమయం పడుతుంది. దీనికి పరిష్కారంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మొబైల్ యాప్‌ను రూపొందించమని ఏసీబీని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏసీబీ 14400 యాప్‌ను రూపొందించింది. లిఖితపూర్వక ఫిర్యాదు, డాక్యుమెంట్లే కాదు... తక్షణం ఆడియో, వీడియో క్లిప్‌లతోసహా ఫిర్యాదు చేసే అవకాశం ఇందులో కల్పించింది. ఆ ఫిర్యాదులపై

మిగతా 2వ పేజీలో ▶

# ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడతారా?



**అడ్డుకునే యంత్రాంగం లేదని చెలరేగిపోతున్నారు**

- వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్టను దిగజార్చేలా పోస్టులు
- ఇలాంటి పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించాలి
- టీడీపీ నేత చింతకాయల విజయ్‌పై సీఐడీ కేసులో హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు.. తదుపరి చర్యల నిలుపుదలకు నిరాకరణ
- స్టే ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ.. దర్యాప్తు జరిగితేనే ఇలాంటి కేసుల్లో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వెల్లడి

10లో

# విశాఖ భూములపై ఓపెన్ ఛాలెంజ్

- సీబీఐ, ఈడీ, ఎఫ్‌బీఐ.. ఏ విచారణకైనా నేను రెడీ: విజయసాయిరెడ్డి
- అక్రమ సంపాదనపై విచారణకు రామోజీ సిద్ధమేనా?.. అందరూ సిరాతో రాస్తే.. రామోజీ పచ్చకులంతో రాస్తున్నారు
- విశాఖకు రాజధాని రాకూడదనే దసపల్లా అంటూ దుష్ప్రచారం
- విశాఖలో సింహభాగం భూములన్నీ చంద్రబాబు సామాజికవర్గం చేతుల్లోనే
- నా కుమార్తెకు పెళ్లి అయ్యాక.. వాళ్ల ఆస్తులు నావి అవుతాయా?
- రెచ్చగొట్టే తప్పుడు వార్తలు ప్రచురిస్తే నేనూ మీడియాలోకి వస్తా



**సాక్షి, విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర అభివృద్ధి కాకూడదనే దురుద్దేశంతో విశాఖలో భూములను ఆక్రమించారంటూ ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నేత వి.విజయసాయిరెడ్డి మండిపడ్డారు. విశాఖలో తనకు త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ మినహా ఇతర ఆస్తులేవీ లేవని, ఈ విషయంలో ఈనాడు రామోజీ, చంద్రబాబు బృందానికి బహిరంగ సవాల్ విసురుతున్నట్లు ప్రకటించారు. 'సీబీఐ, ఈడీ, ఎఫ్‌బీఐ.. ఏదైనా సరే మీదే ఛాయిస్. నాకు విశాఖలో ఉన్న ఆస్తులపై, రామోజీరావు అక్రమ సంపాదనపై విచారణకు సిద్ధమేనా?' అని

మిగతా 2వ పేజీలో ▶

**పదేళ్లకొకసారైనా ఆధార్ అప్‌డేట్!**

- ప్రభుత్వాలందించే సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- ఆధార్ పోర్టల్‌లో 'అప్‌డేట్ డాక్యుమెంట్' పేరుతో యూఐడీఏఐ కొత్త ఫీచర్
- ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లకు యూఐడీఏఐ లేఖ
- సచివాలయాల ద్వారా ఆధార్ అప్‌డేట్‌కు ప్రభుత్వం చర్యలు

5లో

# ఆరోగ్యశ్రీలో చికిత్సలు పెంపు

- ప్రస్తుతమున్న 2,446 ప్రొసీజర్లు 3,254కు పెంపు
- వచ్చే వారంలో అందుబాటులోకి కొత్త చికిత్సలు
- సర్కారు నిర్ణయంతో ప్రజలకు ఉచితంగా మరింత మెరుగైన, కార్పొరేట్ వైద్యం



**సాక్షి, అమరావతి:** డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. పథకం కింద ఇప్పటికే 2,446 చికిత్స విధానాలు ఉండగా మరో 808 విధానాలను దాని పరిధిలోకి తీసుకొస్తోంది. దీంతో ఆరోగ్యశ్రీలో చికిత్సల సంఖ్య ఏకంగా 3,254కు పెరుగుతోంది. వచ్చే వారంలో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నిర్ణయంతో ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించడానికి మరింత వీలవుతుంది.

**టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే 2,195 చికిత్సలు అదనం**

2019కి ముందు టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం కింద 1,059 చికిత్సలు మాత్రమే అందుతుండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్యను ఏకంగా 2,446కు పెంచింది. ప్రజల ఆరోగ్యానికి మరింత రక్షణ కల్పించేలా సీఎం జగన్ మరో అడుగు ముందుకేస్తూ ఇంకో 808 చికిత్సలను పథకం పరిధిలోకి తెస్తున్నారు. దీంతో టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే 2,195 చికిత్సలు అదనంగా ఆరోగ్యశ్రీలోకి వచ్చినట్లవుతుంది. మరోవైపు.. 2019 అనంతరం రూ.ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తెచ్చారు. ఫలితంగా

మిగతా 2వ పేజీలో ▶

## న్యూస్‌రీల్


**కనులపండువగా పైడితల్లి సిరిమానోత్సవం**



విజయనగరంలో పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. విజయనగరం వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. దాదాపు 4.5 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

వివరాలు 2లో ▸

**గండికోటలో ఒబెరాయ్ హోటల్స్**



వైఎస్సార్ జిల్లాలోని గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సీఈవో అర్జున్‌సింగ్ ఒబెరాయ్ పర్యటించారు. ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం కోసం గండికోట, కొట్టాలపల్లి, కోట లోపలతో పాటు జమ్మలమడుగు రహదారిలోని పలు ప్రభుత్వ స్థలాలను అధికారులు చూపించారు.

వివరాలు 14లో ▸

**వికేంద్రీకరణ కోసం ప్రాణత్యాగాలకు సిద్ధం**



పరిపాలన వికేంద్రీకరణ.. మూడు రాజధానులకు మద్దతుగా విశాఖపట్నంలో మంగళవారం భారీ పాదయాత్ర జరిగింది. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు కదంతొక్కారు.

వివరాలు 3లో ▸

**కొనసాగుతున్న వర్షాలు**



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కూడా వర్షాలు కురిశాయి. ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మరోవైపు.. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద పెరుగుతోంది.

వివరాలు 10లో ▸







## క్లుప్తంగా

### మున్సిపాల్టీలుగా చీమకుర్తి, అద్దంకి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చీమకుర్తి, అద్దంకి నగర పంచాయతీలను రెండో స్థాయి మున్సిపాల్టీలుగా ప్రకటిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రంలో సెకెండ్ గ్రేడ్ మున్సిపాల్టీల సంఖ్య 34కు పెరగగా, నగర పంచాయతీల సంఖ్య 26కు తగ్గింది.

### మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ పథకం గడువును ఈ ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు పొడిగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కూడా సమాంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల అభ్యర్థనలు పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఈహెచ్‌ఎస్ పథకం సులభతరం చేసేందుకు అనువైన విధానాలను అందుబాటులోకి తేవాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోకు సూచించారు.

### నేడు ఇమెరిస్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం

**హాజరు కానున్న ఫ్రెంచ్ దౌత్యవేత్త**

అచ్యుతాపురం (అనకాపల్లి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో గ్లోబల్ స్థాయి కంపెనీ ఇమెరిస్ ఫ్యాక్టరీ బుధవారం ప్రారంభం కానుంది. రూ. 350 కోట్ల పెట్టుబడితో ప్రారంభించే ఈ ఫ్రెంచి సంస్థలో కాల్షియం అమ్మోనియేట్ బైండర్ (ఖనిజ ఆధారిత సొల్యూషన్) అనే సిమెంట్ లాంటి పౌడర్ తయారవుతుంది. కొత్త సాంకేతికతతో తయారయ్యే ఈ పౌడర్‌తో త్వరితంగా గట్టి నిర్మాణాలు చేపట్టవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎలాంటి వేడినైనా తట్టుకునే నిర్మాణాలకు దీనిని ఉపయోగిస్తారు. ఇలాంటి ఫ్యాక్టరీ భారత దేశంలో ఇదే మొదటిదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి భారత్‌లో ఫ్రెంచ్ దౌత్యవేత్త ఇమాన్యుయెల్ లెనిన్, ఎండీ సేగీ హాజరు కానున్నట్లు చెప్పారు.

### విజయసాయిరెడ్డి దోపిడీకి జగన్ ప్రోత్సాహం

**టీడీపీ నేతలు చింతకాయల, నిమ్మకాయల వ్యాఖ్యలు**

సాక్షి, విశాఖపట్నం : విశాఖలో విజయసాయిరెడ్డి చేస్తున్న దోపిడీని సీఎం వైఎస్ జగన్ ప్రోత్సహిస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. విశాఖలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మంత్రులు మతిలేకుండా మాట్లాడుతున్నారన్నారు. ప్రగతి భారత్ ట్రస్టుకి ఎవరెవరు నిధులు ఇచ్చారో బయటపెట్టాలా అని ప్రశ్నించారు. విశాఖలో రూ.5వేల కోట్ల ఆస్తుల్ని విజయసాయిరెడ్డి రక్షించలేదనీ.. వాటన్నింటినీ దోపిడీ చేశారని ఆరోపించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద లక్షల గజాల భూములు సాయిరెడ్డి తన బినామీలతో కొనుగోలు చేయించారని విమర్శించారు.

# ఆరోగ్యశ్రీలో చికిత్సలు పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యసేవలు అందుతున్నాయి.

**ఆసరా రూపంలో అండగా..**

పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని వ్యక్తులు జబ్బుచేసి మంచానికి పరిమితమైతే వారి పోషణ చాలా కష్టంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీనికింద 1,519 రకాల చికిత్సలు చేయించుకున్న వారికి వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి రోజుకు రూ.225లు.. లేదా గరిష్టంగా నెలకు రూ.5వేలు చొప్పున భృతి అందిస్తోంది. 2019లో ఆసరా కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి ఈ ఏడాది మే నెల వరకూ రాష్ట్రవ్యాప్తంగా 9,85,315 మందికి రూ.624.02 కోట్లు ప్రభుత్వం సాయంచేసింది.

**2019 నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు.. (రూ.కోట్లలో)**

| సంవత్సరం | ఖర్చు |
|---|---|
| 2019-20 | 1,409.59 |
| 2020-21 | 1,906.44 |
| 2021-22 | 2640.21 |
| 2022-23 ఇప్పటివరకూ | 1,600 |

**వచ్చే వారంలో అందుబాటులోకి..**



కొత్తగా పెంచుతున్న 808 చికిత్సలను వచ్చే వారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తాం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరోవైపు.. 450 చికిత్సల ప్యాకేజీలను రీవైజ్ చేస్తున్నాం. రీవైజ్డ్ ప్యాకేజీలను వచ్చే వారంలోనే అందుబాటులోకి తెస్తాం.

– హరేంధిరప్రసాద్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈఓ





విజయనగరం మెయిన్ రోడ్డులో సిరిమానోత్సవ సందడి. (ఇన్‌సెట్‌లో) పైడితల్లికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొట్టు

# కనుల పండువగా పైడితల్లి సిరిమానోత్సవం

- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయ శాఖ మంత్రి
- రికార్డు స్థాయిలో 4.5 లక్షల మంది భక్తులు రాక

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్లుగా కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ ఉత్సవం జరిగింది. ఈ ఏడాది ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో భక్తులు పోటెత్తారు. విజయనగరం వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది తరలి వచ్చారు. రికార్డు స్థాయిలో దాదాపు 4.5 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి , దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సంప్రదాయం ప్రకారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు, అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు దంపతులు అమ్మవారికి వస్త్రాలను తీసుకొచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5.22 గంటలకు సిరిమాను కదిలింది. పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుపై ఆసీనులై భక్తులకు దర్శనం ఇచ్చారు. చదురుగుడి నుంచి కోట వరకు మూడు పర్యాయాలు సిరిమానును తిప్పారు. సాయంత్రం 6.42 గంటలకు సిరిమాను జాతర పూర్తయింది. డీసీసీబీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సిరిమాను ఉత్సవాన్ని వీక్షించారు. కోటపై నుంచి ఆలయ అనువంశిక ధర్మకర్తలు పూసపాటి అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజు, సుధా గజపతిరాజు, ఊర్మిళా గజపతిరాజు తదితరులు ఉత్సవాన్ని తిలకించారు.

# గింజగింజకూ 'మద్దతు'



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అవగాహన కల్పించాలి. ధాన్యం కొనుగోళ్ల కోసం చేసిన ఏర్పాట్లు, నిబంధనలు, సూచనలు, సలహాలతో ఆర్బీకేల్లో పోస్టర్లు ప్రదర్శించాలి. ఆర్బీకేలకు అనుసంధానించిన వలంటీర్లు ఆర్బీకే మిత్రలుగా, ధాన్యం కొనుగోళ్లలో సహాయం కోసం తీసుకుంటున్న వలంటీర్లు రైతు సహాయకులుగా వ్యవహరించాలి.

**బియ్యం ఎగుమతులపై దృష్టి**

రాష్ట్రంలో వరి విస్తారంగా సాగు అవుతున్నందున బియ్యం ఎగుమతులపై దృష్టి సారించాలి. దేశీయంగా డిమాండ్ లేని పరిస్థితుల్లో విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను పరిశీలించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఎగుమతుల రంగంలో ఉన్న వారితో కలిసి పని చేయాలి. బియ్యం ఎగుమతిదారులకు, రైతులకు ఉభయ తారకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రంగు మారిన ధాన్యం, బ్రోకెన్ రైస్ (నూకలు)ఇథనాల్ తయారీకి వినియోగించడంపై దృష్టి పెట్టాలి. ఇప్పటికే ఇఫ్కో ద్వారా ఒక ప్లాంటు, మహీంద్రా ద్వారా మరో ప్లాంటు నుంచి ఇథనాల్ తయారు కానుంది.

**సీఎం యాప్‌తో ధరల పర్యవేక్షణ**

ఎక్కడైనా పంటలకు ఎమ్మెస్పీ కంటే తక్కువ ధర ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే జోక్యం చేసుకుని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పంట ఉత్పత్తుల ధరలను ఎప్పటికప్పుడు సీఎం యాప్ ద్వారా సమీక్షిస్తుండాలి. ఎక్కడైనా ధర పతనమైనట్లు సీఎం యాప్ ద్వారా గుర్తిస్తే వెంటనే కొనుగోళ్లకు శ్రీకారం చుట్టాలి. ధర పతనమైన సందర్భాల్లో రైతులను ఎలా ఆదుకుంటామనే విషయంలో సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ఎల్ఏ) పకడ్బందీగా ఉండాలి. కొనుగోలు చేసిన పంట ఉత్పత్తులను నిల్వచేసే ప్రాంతంలో జియో ఫెన్సింగ్, ప్రతి ఉత్పత్తికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ఉండేలా పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేయాలి. రైతులను ఆదుకునేందుకు మార్కెట్లో నిరంతరం జోక్యం చేసుకోవాలి. దీనివల్ల ధరలు పతనం కాకుండా అన్నదాతలకు మేలు జరుగుతుంది. పొగాకు రైతులకు నష్టం జరగకుండా తగిన రీతిలో చర్యలు తీసుకోవాలి.

**ఖరీఫ్‌కు ముందే భూసార పరీక్షలు.. పంటల సంరక్షణకు ప్లాంట్ డాక్టర్**

ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు నిర్వహించి పూర్తి వివరాలను సాయిల్ హెల్త్ కార్డుల్లో నమోదు చేయాలి. ఆ ఫలితాల ఆధారంగా పంటల సాగుకు సంబంధించి సిఫార్సులు చేయాలి. ఏ నేలలో ఎలాంటి పంటలు వేయాలి? ఎంత మోతాదులో ఎరువులు వాడాలనే అంశంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రతి ఆర్బీకేలో సాయిల్ టెస్టింగ్ పరికరాలను అందుబాటులో ఉంచాలి. మధ్యలో ఏవైనా చీడపీడలు, తెగుళ్ల లాంటివి పంటలకు సోకితే ఫొటోలు తీసి శాస్త్రవేత్తల సహకారంతో నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్లాంట్ డాక్టర్ విధానాన్ని తేవాలి. విచ్చలవిడిగా క్రిమి సంహారక మందుల వాడకాన్ని నివారించాలి. ఇలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తూ సిఫార్సుల మేరకు పంటలను సాగు చేస్తే విచక్షణా రహితంగా ఎరువులు, రసాయనాల వాడకం తగ్గుతుంది. తద్వారా రైతన్నలకు పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించేందుకు దోహదం చేస్తుంది.

### ఈ దఫా 1.15 కోట్ల ఎకరాల్లో సాగు

ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ 1.10 కోట్ల ఎకరాల్లో పంటలు సాగైనట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా అక్కడక్కడా వరి నాట్లు కొనసాగుతున్నందున ఈదఫా ఖరీఫ్ సాగు 1.15 కోట్ల ఎకరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు సీఎం దృష్టికి తెచ్చారు. మూడేళ్లలో 3.5 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు పెరిగిందని, సాధారణ పంటల నుంచి రైతులు వీటి వైపు మళ్లినట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 14.10 లక్షల హెక్టార్లలో వరి నాట్లు వేశారని చెప్పారు. నవంబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల కోసం 3,423 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మాయిశ్చరైజర్ మీటర్, అనాలసిస్ కిట్, హస్క్ రిమూవర్, పోకర్స్, ఎనామెల్ ప్లేట్స్, జల్లించే పరికరాలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రానున్న రబీ సీజన్‌లో 57.31 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నట్లు అంచనా వేసి 96 లక్షల టన్నుల విత్తనాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన పరికరాలు, అద్దెల వివరాలతో ఆర్బీకేల్లో పోస్టర్లను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రైతు భరోసా రెండో విడత సాయాన్ని అక్టోబరు 17న అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు బాంబే, కాన్పూర్ ఐఐటీల సాంకేతిక విధానాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల కమిషనర్లు చేవూరు హరికిరణ్, హెచ్.అరుణ్‌కుమార్, పీఎస్ ప్రద్యుమ్న, పౌరసరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండియన్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ భూములపై ఓపెన్ ఛాలెంజ్

▶ మొదటి పేజీ తరువాయి

సవాల్ విసిరారు. రెచ్చగొట్టే తప్పుడు వార్తలు ప్రచురిస్తే తాను కూడా మీడియాలోకి వస్తానన్నారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**రెండు లక్ష్యాలతో దుష్ప్రచారం..**

చంద్రబాబు, పచ్చమీడియా తప్పుడు ప్రచారానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. ఒకటి.. విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిగా అడ్డుకోవడం. రెండోది.. గుంటూరు – విజయవాడకు 30 కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతాన్ని అమరావతి అనే పేరుతో రాజధానిగా చేయడం. రైతుల దగ్గర చౌకగా కొట్టేసిన కొన్ని వేల ఎకరాల ద్వారా రూ.లక్షల కోట్లు గడించాలనేదే వారి ఉద్దేశం.

**కోర్టులో తేల్చుకుందామా?**

ఆస్తులపై సీబీఐ, ఈడీ, అమెరికాలో ఉన్న ఎఫ్‌బీఐగానీ.. ఏ విచారణకైనా నేను సిద్ధం. మరి రామోజీ, చంద్రబాబు సిద్ధమేనా? ఈనాడు సంస్థల పెట్టుబడులన్నీ నిజాయితీగానే వచ్చాయా? కోర్టుకి లేఖ రాసి అక్కడే తేల్చుకుందాం. విచారణ జరిగితే ఎవరు జైలుకు వెళ్తారో సీబీఐ, ఈడీ, ఎఫ్‌బీఐ తేలుస్తాయి. ఉత్తరాంధ్రకు కార్యనిర్వాహక రాజధాని రానివ్వకూడదనేదే రామోజీ దురుద్దేశం. ఈ దుశ్చర్యలను ఖండిస్తూ అందరం ముందుకు వెళ్లాలి. పార్టీలు వేరైనా, ప్రజలంతా ఒకే తాటిమీద ఉండాలి.

**కులపిచ్చితో నీతిమాలిన పనులు..**

సాధారణంగా మీడియాలో ఆర్టికల్స్‌ని ఇంక్‌తో రాస్తారు. రాష్ట్రంలో కొన్ని పత్రికలు మాత్రం పచ్చ కులాన్ని ఇంక్‌గా ఉపయోగించి వార్తలు రాస్తున్నాయి. పేరులో 'జీ' అని పెట్టుకొని తనకు తానే రామోజీ గౌరవం ఇచ్చుకుంటున్నారు. ఇలాంటి రాతలు చూసిన తర్వాత ఆయన్ని రాముా అని పిలవాలి. కులరొచ్చులో టీడీపీ కుల పత్రికలు, టీవీ చానళ్లు దిగజారి వ్యవహరిస్తున్నాయి.

**సుప్రీం తీర్పు అమలు ఘనత వైఎస్సార్‌సీపీదే**

దసపల్లా భూముల విషయంలో ప్రభుత్వానికి గానీ, రాజకీయనేతలకు గానీ ఎలాంటి సంబంధం లేదని భూ యజమానులు, బిల్డర్లు ఇప్పటికే వివరణ ఇచ్చారు. దసపల్లా భూములు రాణి కమలాదేవికి చెందినవని సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చినా గత సర్కారు అమలు చేయలేదు. దాన్ని అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రభుత్వ నిర్ణయంతో దసపల్లా భూములకు సంబంధించి దాదాపు 400 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. వారంతా ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. వాటిని ఇప్పుడు కూలగొట్టగలమా? ఇది పూర్తిగా ప్రైవేట్ భూమి. అందుకే 22 ఏ నుంచి తొలగించడంలో తప్పేముంది?

**80 శాతం భూములు ఆ సామాజికవర్గానివే..**

ప్రస్తుతం వివాదం నడుస్తున్న 64 ప్లాట్లకు సంబంధించిన వారిలో 55 మంది చంద్రబాబు సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఎక్కువగా లబ్ధి పొందింది చంద్రబాబు, ఆయన అనుచరులే. విశాఖలో ఇంచుమించుగా 75 నుంచి 80 శాతం భూములు ఆ ఒక్క సామాజిక వర్గానికి చెందినవారివే. వాస్తవానికి ఉత్తరాంధ్రలో, విశాఖలో కాపులు, యాదవులు, వెలమలు, కళింగులు, వెనకబడిన వర్గాలవారే ఎక్కువమంది ఉన్నా ఆస్తులు మాత్రం చంద్రబాబు సామాజిక వర్గానికే ఎక్కువగా ఉన్నాయి.

**రూ.5 వేల కోట్ల భూములను కాపాడాం..**

విశాఖలో అవినీతి, ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదు. టీడీపీ హయాంలో అక్రమార్కుల పాలైన సుమారు 400 ఎకరాల భూముల్ని రెండేళ్ల కాలంలో ప్రభుత్వానికి అప్పగించాం. వీటి రిజిస్ట్రేషన్ విలువ రూ.5 వేల కోట్లకు పైగా ఉంటుంది. దీన్ని ఎవరు తప్పుబట్టినా వారికి నైతిక విలువలు లేనట్టే.

### గుమస్తాగా చేరి ఘోరమైన మోసాలు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్, ఉషోదయ పబ్లికేషన్స్ రామోజీకి ఎలా వచ్చాయో అందరికీ తెలుసు. రామోజీ మొదట ఓ కంపెనీలో గుమస్తాగా చేరారు. ఈయన తెలివితేటలు చూసి జీజే రెడ్డి అనే వ్యక్తి పెట్టుబడులు పెట్టారు. ఆయన వ్యవస్థాపక ప్రమోటర్‌గా కంపెనీలు ప్రారంభిస్తే.. జీజే రెడ్డిని ఘోరంగా మోసం చేసి ఆయన కుటుంబ సభ్యుల పేర్లని కూడా తొలగించి నామమాత్రం షేర్లు కట్టబెట్టి దోచుకున్న దుర్మార్గుడు రామోజీ. నా కుమార్తె నేహారెడ్డిని 40 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉన్న అరబిందో సంస్థల యజమాని కుమారుడికిచ్చి వివాహం చేశాం. ఇప్పుడు ఆమె ఇంటి పేరు వేణుంబాక కాదు... పెనక నేహారెడ్డి. రామోజీలా భాగస్వాముల్ని మోసం చేసి వారు ఆస్తులు సంపాదించలేదు. మా అమ్మాయిని వాళ్లింటికి కోడలుగా పంపిస్తే వాళ్ల ఆస్తులన్నీ నావి అయిపోతాయా?

బ్రహ్మణి పేరుతో చంద్రబాబు ఆదాయం ఆర్జిస్తే అవి బాలకృష్ణ ఆస్తులు అవుతాయా? బాలకృష్ణ ఆస్తులు బ్రహ్మణివి అవుతాయా? రామోజీ కుమారుడు కిరణ్‌తో శైలజా కిరణ్‌కు వివాహం అయ్యాక ఆస్తులు కొంటే అవి ఆమె తండ్రి ఉప్పలపాటి ఆస్తులు అవుతాయా? శైలజా కిరణ్ తండ్రికి చెందిన బాలాజీ హేచరీస్ రామోజీ రసగుల్లా అవుతుందా? రామోజీ మనవరాలు భారత్ బయోటెక్ సంస్థ అధిపతి తనయుడి భార్య అయినంత మాత్రాన అది రామోజీ కంపెనీ అవుతుందా?

# అవినీతిపరుల గుండెల్లో 14400

▶ మొదటి పేజీ తరువాయి

తక్షణం స్పందించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, కాల్‌సెంటర్‌ను పటిష్టపరిచింది. దాంతో అవినీతిపై బాధితులు తక్షణమే ఫిర్యాదు చేస్తున్నారు. ఏసీబీ అధికారులు కూడా వెంటనే స్పందిస్తూ వివిధ రీతుల్లో పరిష్కరిస్తున్నారు. చాలావరకు ఫిర్యాదుదారులు కేసులు పెట్టకుండా సమస్య పరిష్కారాన్ని కోరుతున్నారు. దాంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదు చేసిన తరువాత వెనక్కి తగ్గడం, తప్పుడు ఫిర్యాదులు కూడా నమోదవుతున్నాయి. వీటన్నింటినీ పరిశీలించి ఏసీబీ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అవినీతి అధికారులను ట్రాప్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం, ఆకస్మిక తనిఖీలు, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులు మొదలైనవి నమోదు చేస్తున్నారు.

- ఈ ఏడాది జూన్ 1 నుంచి ప్రారంభించిన ఈ మొబైల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 2,402 ఫిర్యాదులు అందాయి. వాటిలో 2,127.. అంటే 88 శాతం ఫిర్యాదులను ఏసీబీ పరిష్కరించింది. మరో 275 ఫిర్యాదులపై చర్యలు పరిశీలనలో ఉన్నాయి. యాప్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ ముగ్గురు అధికారులను అరెస్టు చేసింది. 8 సాధారణ తనిఖీలు, రెండు ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.
- 14400 కాల్‌సెంటర్‌కు ఈ ఏడాది మార్చి 1 నుంచి ఇప్పటివరకు 4,363 ఫిర్యాదులు రాగా వాటిలో 4,132 సమస్యలను పరిష్కరించడం విశేషం. మరో 231 ఫిర్యాదులపై చర్యలు పరిశీలనలో ఉన్నాయి. అంటే ఏకంగా 94 శాతం సమస్యలను పరిష్కరించింది. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ 13 మంది అధికారులను ట్రాప్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఒకటి నమోదు చేసింది. 14 సాధారణ విచారణలు చేపట్టగా 20 ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.

- ఓ వ్యాపార సంస్థకు విద్యుత్ సర్వీస్ లైన్ వేసి మీటర్ పెట్టేందుకు అనకాపల్లి జిల్లాలో తూర్పు డిస్కం ఏఈ ఎం.వెంకటరమణ రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. దాంతో బాధితుడు తమ మొబైల్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్న 14400 యాప్ ద్వారా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఏసీబీ అధికారులు బాధితునితో మాట్లాడి రంగంలోకి దిగారు. ఆ ఏఈ ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక్క రోజులోనే అవినీతి అధికారి ఆటకట్టించడంలో ఏసీబీ మొబైల్ యాప్ కీలక పాత్ర పోషించింది.
- 14400.. ఈ నంబర్ వింటేనే రాష్ట్రంలో అవినీతి అధికారుల గుండెల్లో దడ మొదలవుతుంది. ఈ యాప్‌లో ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు రంగంలోకి దిగి, అవినీతి అధికారుల ఆట కట్టిస్తున్నారు. ఇందుకు పై సంఘటనే తాజా ఉదాహరణ.

- 14400 మొబైల్ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఏసీబీ ఇటీవల నమోదు చేసిన కొన్ని కేసులు
- తిరుపతిలో ఓ మందుల దుకాణం యజమాని నుంచి లంచం తీసుకుంటుండగా డ్రగ్ కంట్రోల్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డి.బాలమురళీ కల్యాణ్ చక్రవర్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన నివాసాల్లో తనిఖీలు చేసి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసులు కూడా నమోదు చేశారు.
- కాకినాడలో ఓ డెయిరీ ఫాం యజమాని నుంచి లంచం తీసుకుంటున్న తూర్పు డిస్కం ఏఈ మడికి చంటి బాబు, లైన్‌మేన్ ఎం.సిద్ధార్థ కుమార్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- కర్నూలు జిల్లాలో లంచం తీసుకుంటున్న ఏఎస్సై షేక్ ఖాదర్ వలీని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్ఆర్ పురం తహసీల్దార్ కె.సతీశ్ ఓ రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

**ఈ ఏడాది మార్చి 1 నుంచి ఏసీబీ నమోదు చేసిన కేసులు**

| రేంజ్ | నమోదు చేసిన కేసులు |
|---|---|
| శ్రీకాకుళం | 9 |
| విజయనగరం | 4 |
| విశాఖపట్నం | 10 |
| రాజమహేంద్రవరం | 11 |
| ఏలూరు | 11 |
| కృష్ణా | 9 |
| గుంటూరు | 8 |
| ప్రకాశం | 7 |
| నెల్లూరు | 6 |
| చిత్తూరు | 10 |
| కడప | 6 |
| కర్నూలు | 13 |
| అనంతపురం | 5 |
| సీఐయూ (సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్) | 2 |
| మొత్తం | 111 |

**ఈ ఏడాది మార్చి 1 నుంచి 14400 కాల్ సెంటర్, యాప్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పెట్టిన కేసులు**

| రేంజ్ | నమోదు చేసిన కేసులు |
|---|---|
| శ్రీకాకుళం | 4 |
| విజయనగరం | 1 |
| విశాఖపట్నం | 5 |
| రాజమహేంద్రవరం | 4 |
| ఏలూరు | 4 |
| కృష్ణా | 4 |
| గుంటూరు | 5 |
| ప్రకాశం | 3 |
| నెల్లూరు | 6 |
| కడప | 8 |
| చిత్తూరు | 6 |
| కర్నూలు | 9 |
| అనంతపురం | - |
| సీఐయూ | - |
| మొత్తం | 59 |

**అవినీతి అంతమే లక్ష్యం**

అవినీతిపై సులభంగా ఫిర్యాదు చేసేందుకు రూపొందించిన 14400 మొబైల్ యాప్ విజయవంతమైంది. మొబైల్ యాప్, కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరిస్తున్నారు. ఫిర్యాదుదారుల వివరాలు కూడా గోప్యంగా ఉంచుతున్నాం. 100 శాతం కేసులు పరిష్కరించి బాధితులకు అండగా నిలవడమే ధ్యేయంగా ఏసీబీ పనిచేస్తోంది.

– డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి

# ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

**రూ.లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుబడిన వైనం**

యలమంచిలి (అనకాపల్లి జిల్లా): రూ.లక్ష లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖ ఏఈను ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఏసీబీ ఏఎస్పీ శ్రావణి , డీఎస్పీ రమణమూర్తి చెప్పిన వివరాల ప్రకారం..అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం కొరుప్రోలు సమీపంలోని లే అవుట్ సర్వీస్ కనెక్షన్ కోసం వి.తాతారావు.. కొరుప్రోలు ఇన్‌చార్జి ఏఈ ఎంవీ రమణని కలిశాడు. విద్యుత్ కనెక్షన్ కావాలంటే తనకు రూ.1.5 లక్షలు లంచం ఇవ్వాలని ఏఈ రమణ డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని బాధితుడు తాతారావు చెప్పడంతో చివరకు రూ.లక్షకు ఒప్పందం కుదిరింది. వీరిద్దరి మధ్య మధ్యవర్తిగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా ఉన్న ఎస్.దొరబాబు వ్యవహరించాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు తాతారావు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 14400 తోపాటు ఏసీబీ యాప్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో మంగళవారం యలమంచిలి ఏఈ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. తాతారావు నుంచి ఏఈ రమణ రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రమణతోపాటు దొరబాబును అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు కిషోర్, ప్రేమ్‌కుమార్, ఎస్సైలు శ్రీనివాస్, రామకృష్ణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రైతుల పాదయాత్రపై దండయాత్ర: కళా వెంకట్రావు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర వాసుల్ని, అమరావతి రైతులపైకి ఉసిగొల్పుతున్నదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకట్రావు ఆరోపించారు. హైకోర్టు అనుమతితో సాగుతున్న యాత్రను అడ్డుకోవడం కోర్టు ధిక్కారమవుతుందని తెలిసి కూడా మంత్రులు ధర్మాన, బొత్స, అమర్‌నాథ్, మరికొంతమంది దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమరావతి రైతుల పాదయాత్రపై దండయాత్ర చేస్తున్నారని, ఇది దుర్మార్గమన్నారు. పెయిడ్ ఆర్టిస్టులతో గర్జనలు, ఉద్యమాలు చేసి, రాష్ట్రాన్ని వల్లకాడు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ భూములు, ఆస్తుల్ని అప్పుల కోసం తనఖా పెట్టారని ఆరోపించారు. 22 మంది ఎంపీల ద్వారా కేంద్రంతో దోస్తీ చేస్తున్న సీఎం జగన్ రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు ఏం సాధించారని ప్రశ్నించారు. ఆరు గిరిజన నియోజకవర్గాలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారని విమర్శించారు. మంత్రుల అనాలోచిత వ్యాఖ్యలపై ఉత్తరాంధ్ర ప్రజలంతా సంయమనంతో ఉండాలన్నారు.

### పవన్ కళ్యాణ్ ఓ పెద్ద జోకర్

మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: రాష్ట్రం, జిల్లాల గురించి తెలుసుకోకుండా ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ట్వీట్ చేయడం చూస్తే ఆయన ఓ పెద్ద జోకర్ అని అర్థమవుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసిన పవన్‌ను ఓడించిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో కూడా ఆయనకు గుండు సున్నా గీయడం ఖాయమని పేర్కొన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడిగా కాకుండా ఓ పార్టీ అధినేతగా ప్రజల ముందుకు రావాలని హితవు పలికారు. ప్యాకేజీ తీసుకుని ట్వీట్లు, ప్రకటనలు విడుదల చేసే పవన్ వీకెండ్ నాయకుడని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని జోగి రమేష్ తెలిపారు.

### 18న కృష్ణాజలాల కేసు విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదీ జలాల వివాద పరిష్కారానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన కేసును ఈ నెల 18న తగిన ధర్మాసనం విచారిస్తుందని సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణ తేదీ నిర్ణయించాలని కర్ణాటక తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ మంగళవారం సీజేఐ ధర్మాసనం ముందు ప్రస్తావించారు.

### ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం ఉద్యమం

**సీపీఎం రౌండ్ టేబుల్‌లో వక్తల ఉద్ఘాటన**

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు త్వరలో క్షేత్రస్థాయిలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే)లో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ సీనియర్ నేత పి.మధు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉద్యమ కార్యాచరణకు సంబంధించి తొలుత గవర్నర్‌కు వినతి పత్రం ఇవ్వాలని, అనంతరం చర్చించి కార్యాచరణ ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రానికి చట్ట ప్రకారం రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రైల్వేజోన్, స్టీల్ ఫ్యాక్టరీ, పోర్టును సాధించేందుకు కేంద్రంపై మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, హరినాథ్(సీపీఐఎంఎల్), ఎ.హరి(ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం), కె.పొలారి(న్యూడెమోక్రసీ), తూమాటి శివయ్య (ఎంసీపీఐయూ), సుధీర్(ఎస్‌యూసీఐ) మాట్లాడారు.

# అత్యంత ప్రాధాన్యతాంశంగా ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు

- గత ప్రభుత్వంలో ప్రణాళికా రహితంగా పనులు
- కాంట్రాక్టుల రూపంలో అనుయాయులకు లబ్ధి
- గత ప్రభుత్వ తప్పిదాలను దాచిపెట్టిన 'ఈనాడు'
- ప్రస్తుత ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం
- జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రతి పైసా ప్రజా ప్రయోజనాల కోసం ఖర్చు
- వంశధార రెండో దశ 90% పూర్తి
- హిర మండలం రిజర్వాయర్‌కు నీటిని అందించేందుకు రూ.176 కోట్లు
- వంశధార–నాగావళి అనుసంధానంతో 18,527 ఎకరాల స్థిరీకరణ
- కొత్తగా 5వేల ఎకరాలకు నీరు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం
- రాష్ట్ర జల వనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి వెల్లడి

**వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తోంది**



సాక్షి, అమరావతి: వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో సాగు నీటి రంగం అభివృద్ధిని వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతాంశంగా చేపట్టిందని, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తోందని జలవనరుల శాఖ ఇంజనీర్ – ఇన్ చీఫ్ సి.నారాయణ రెడ్డి చెప్పారు. ఉత్తరాంధ్రలోని నీటి ప్రాజెక్టులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ ఈనాడు ప్రచురించిన కథనాన్ని ఆయన ఖండించారు. గత ప్రభుత్వ తప్పిదాలను దాచిపెట్టి ప్రస్తుత ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం 'ఈనాడు' చేస్తోందని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం కింద ఉత్తరాంధ్రలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ ప్రాజెక్టుల నిధులను గత టీడీపీ ప్రభుత్వం ప్రణాళికా రహితంగా ఖర్చు చేసి, కాంట్రాక్టుల రూపంలో అనుయాయులకు లబ్ధి చేకూర్చిందని చెప్పారు. వందల కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేశారని, పనులు మాత్రం జరగలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి పైసా ప్రజా ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తోందన్నారు.

**వంశధార నిర్వాసితులకు అదనపు ప్రయోజనం**

వంశధార ప్రాజెక్టు రెండో భాగం రెండో దశలో ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని నారాయణ రెడ్డి తెలిపారు. దీని ద్వారా 27,800 ఎకరాలకు ఇప్పటికే నీటి వసతి లభించిందన్నారు. శ్రీకాకుళం జిల్లాల్లోని 9 మండలాల్లో 225 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి కలుగుతోందని తెలిపారు. అదేవిధంగా 1.2 టీఎంసీల నీటిని హీరమండలం రిజర్వాయర్ ద్వారా కిడ్నీ వ్యాధి పీడిత ఉద్దానం ప్రాంతానికి సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వంశధార నిర్వాసితుల ప్రయోజనాలను గాలికి వదిలేశారన్నారు. ఈ నిర్వాసితులకు అదనపు ప్రయోజనం కల్పించేందుకు సీఎం జగన్ రూ. 217 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వంశధార నదిపై గొట్టా బ్యారేజి నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా హీర మండలం రిజర్వాయర్‌కు 12 టీఎంసీల నీటిని అందించేందుకు రూ. 176 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

**అనుసంధానంతో 18,527 ఎకరాల స్థిరీకరణ**

వంశధార–నాగావళి అనుసంధానం ద్వారా 18,527 ఎకరాల స్థిరీకరణకు, 4 మండలాల్లోని 38 గ్రామాల పరిధిలో 5 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.145 కోట్ల నిధులకు అనుమతిచ్చిందని, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. మిగతా పనులు 2023 జూన్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువను పొడిగించి విజయనగరం జిల్లాలోని ఆరు మండలాల్లో 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు గజపతినగరం బ్రాంచి కాలువ పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో 43% పనులు పూర్తయ్యాయని, భూ సేకరణలో కొన్ని ఇబ్బందుల వల్ల మిగిలిన పనులు ఆగాయని చెప్పారు. మిగతా పనులకు రూ.137 కోట్లతో తయారు చేసిన ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిందన్నారు. ఈ పనులను కూడా 2024 జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు.

**తారకరామతీర్థ సాగరం ద్వారా 16 వేల ఎకరాలకు నీరు**

విజయనగరం జిల్లా గుర్ల మండలంలో చంపావతి నదికి అడ్డంగా తారకరామతీర్థ సాగరం బ్యారేజి నిర్మించి 2.75 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని, మూడు మండలాల్లోని 49 గ్రామాల్లో 16,538 ఎకరాలకు నీరు ఇవ్వచ్చని చెప్పారు. ఈ పనులు 59 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులకు రూ.198 కోట్లతో చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. త్వరలో కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి పనులు అప్పగిస్తామన్నారు. పునరావాస కార్యక్రమాలను ముందుగానే పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

**తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీరు**

ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు, తాగు, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.7,214 కోట్లతో బీఆర్ అంబేడ్కర్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని నారాయణ రెడ్డి గుర్తు చేశారు. దీనిద్వారా 8లక్షల ఎకరాలకు సాగునీరు, విశాఖతోపాటు ఇతర ప్రాంతాల తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు 23.44 టీఎంసీలు తరలించాలనేది లక్ష్యమన్నారు. తొలి దశలో రెండు ప్యాకేజీల్లో గత ప్రభుత్వం 2017–18లో రూ.2,022కోట్ల విలువైన పనులను కాంట్రాక్టర్లకు అప్పగించినా పురోగతి లేదన్నారు. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి, అంచనాలను రూ.17,411కోట్లకు పెంచిందన్నారు. ఫేజ్–2 కింద రెండు ప్యాకేజీలను చేపట్టిందన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ 63వ కిలోమీటరు నుంచి 102వ కిలోమీటరు పొడవున శ్రీకా కుళం జిల్లా నడిగెడ్డ వరకు నీటిని తీసుకు వెళ్లేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 7,500 ఎకరాల భూసేకరణ త్వరగా జరుగుతోందని, 60 శాతం మేర డిజైన్లకు అనుమతి లభించిందన్నారు.

**మడ్డువలస రెండో దశ పనులు 79% పూర్తి**

మడ్డువలస రిజర్వాయర్ నుంచి కుడి ప్రధాన కాలువను విస్తరించి 12,500 ఎకరాల అదనపు ఆయకట్టుకు 1.5టీఎంసీల నీరిచ్చే లక్ష్యంతో రెండో దశ పనులను చేపట్టామని ఈఎన్‌సీ చెప్పారు. దీని వల్ల జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లోని 21 గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటికే 79 శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను పాత కాంట్రాక్టరు చేయలేకపోవడంతో రూ.26.9కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. వచ్చే ఖరీఫ్‌కు ఈ పనులు పూర్తవుతాయన్నారు.

**తోటపల్లి బ్యారేజి 83% పూర్తి**

విజయనగరం జిల్లా తోటపల్లి వద్ద నాగావళి నదిపై బ్యారేజి నిర్మించి 64 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా 1,31,000 ఎకరాల ఆయకట్టుకు 15.89 టీఎంసీల నీరిచ్చేందుకు తోటపల్లి బ్యారేజ్ పనులను ప్రభుత్వం చేపట్టిందని నారాయణరెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టును రూ.1127.58 కోట్లతో చేపట్టగా, 83 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. రూ.123.21 కోట్లతో మిగిలిన పనులను రెండు ప్యాకేజీలుగా చేపట్టామన్నారు. ఈ పనులు 2023 జూన్‌కి పూర్తవుతాయన్నారు.

**రూ.854 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్ షోర్ రిజర్వాయర్**

మహేంద్రతనయ నది మీద చాప్రా గ్రామం వద్ద హెడ్ రెగ్యులేటర్ నిర్మించి 1,200 క్యూసెక్కుల నీటిని రేగులపాడు రిజర్వాయర్‌కు తరలించే ప్రధాన ఉద్దేశంతో ఆఫ్ షోర్ రిజర్వాయర్ నిర్మిస్తున్నట్టు నారాయణరెడ్డి తెలిపారు. 2.1 టీఎంసీల నీటిని నిల్వచేసే ఈ రిజర్వాయర్ ద్వారా 24,600 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. భూసేకరణ, పునరావాస ప్రక్రియల్లో ఇబ్బందుల వల్ల ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదని పేర్కొన్నారు. అయితే వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించి, రూ.854.25 కోట్లతో మిగిలిన పనులు చేపట్టేందుకు అనుమతినిచ్చిందని చెప్పారు. త్వరలోనే రివర్స్ టెండరింగ్ ద్వారా పనులను చేపట్టి 2024 ఖరీఫ్ నాటికి ఆయకట్టుకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# రాజధాని కోసం ప్రాణత్యాగాలకు సిద్ధం

**విశాఖలో భారీ పాదయాత్ర**



ఆనందపురంలో జాతీయ రహదారిపై ధర్నాలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అఖిలపక్ష నాయకులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ)/ఆనందపురం (విశాఖపట్నం)/నక్కపల్లి/ఇరగవరం: రాష్ట్రంలో పరిపాలన వికేంద్రీకరణ.. మూడు రాజధానులకు మద్దతుగా విశాఖపట్నంలో మంగళవారం భారీ పాదయాత్ర జరిగింది. విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకు ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రజలు కదంతొక్కారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విశాఖ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, మత్స్యకారుల వేషధారణలో పలువురు నాయకులు, ప్రజలు ఉత్సాహంగా కదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ విశాఖపట్నం రాజధాని కోసం ప్రాణత్యాగాలకైనా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అమరావతితో పాటు విశాఖపట్నం, కర్నూలు రాజధానులకే తమ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, మూడు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయమని పేర్కొన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేయాలని కోరుతూ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, జేఏసీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆనందపురం జంక్షన్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించి విశాఖ రాజధాని మా హక్కు అంటూ నినదించారు. అనకాపల్లి జిల్లా అడ్డురోడ్డులో వెంకటేశ్వర కల్యాణమండపంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో మూడు రాజధానులకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు డాక్టర్లు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొన్నారు.

**3 రాజధానుల కోసం తీర్మానం చేస్తాం: మేయర్**

విశాఖపట్నాన్ని రాజధానిగా ప్రకటించాలని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. నవంబర్ 4న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మూడు రాజధానులకు మద్దతుగా తీర్మానం ఆమోదిస్తామని చెప్పారు. వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్రలో ఆమె మాట్లాడారు. వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ ప్రాంతంలో సమాధి అవుతాయని ఆమె చెప్పారు.



**'తణుకు'లో ప్రజల నిరసన**

రైతుల పేరుతో ఫేక్ యాత్రికుల్లారా.. గో బ్యాక్.. అంటూ పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం అయితంపూడి ప్రజలు నినదించారు. మంగళవారం నియోజకవర్గంలోకి అమరావతి రైతుల పాదయాత్ర ప్రవేశించడంతో ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అని నినాదాలు చేశారు. ప్లకార్డులు, నల్లబెలూన్లు, నల్లకండువాలతో రోడ్డుకిరువైపులా కిలోమీటరు మేర నిలబడి శాంతియుతంగా నిరసన తెలిపారు. వీరిని రెచ్చగొట్టేలా ఉండి ఎమ్మెల్యే రామరాజు, టీడీపీ నేతలు చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, అంగర రామ్మోహన్, ఆరిమిల్లి రాధాకృష్ణ తొడలు కొడుతూ నినాదాలు చేశారు. - ఇరగవరం

# చంద్రబాబు పేకలో పవన్‌కల్యాణ్ జోకర్

- ఎప్పుడు అవసరమైతే అప్పుడు బయటకు తీస్తారు
- పవన్.. జనవాణి కాదు.. ఉత్తరాంధ్రపై మీ వాణి ఏంటో చెప్పండి
- జనవాణిలో ప్రజలే నిలదీస్తారు
- 'గర్జన' దృష్టిని మరల్చేందుకే పర్యటన: మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు పేకలో జోకర్‌లా పవన్‌కల్యాణ్ వ్యవహరిస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన విశాఖ.. మన రాజధాని పేరుతో నాన్ పొలిటికల్ జేఏసీ ఇచ్చిన విశాఖ గర్జన పిలుపు మేరకు తామంతా మద్దతు పలుకుతున్నామన్నారు. ఈ నెల 15న గర్జన పిలుపుతో ఉలిక్కిపడిన చంద్రబాబు.. దాన్ని తప్పుదోవ పట్టించేందుకు తన జోకర్ పవన్‌కల్యాణ్‌ను బరిలోకి దింపుతున్నాడని విమర్శించారు. గాజువాకలో చిత్తుచిత్తుగా ఓడించినందుకే పవన్ కల్యాణ్ ఈ ప్రాంతంపై ద్వేషం పెంచుకున్నారన్నారు. పవన్‌ను చంద్రబాబు ఎక్కడపడితే అక్కడ వాడుకుంటారని, బాబు డైరెక్షన్‌లో పనిచేస్తున్న పవన్‌కు ఈ ప్రాంతంపై ప్రేమ ఉంటుందని తాము భావించడం లేదని అభిప్రాయపడ్డారు. జనవాణి సాకుతో విశాఖ వస్తున్న పవన్ కల్యాణ్, ముందు.. వికేంద్రీకరణపై తన వాణి ఏమిటో స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. 16న నిర్వహించే జనవాణికి వచ్చే పవన్‌ను వికేంద్రీకరణపై ఉత్తరాంధ్ర ప్రజలే నిలదీస్తారన్నారు. ఈ ప్రాంత ఆలోచనల్ని ప్రపంచానికి తెలియజెప్పేందుకు చేపడుతున్న విశాఖ గర్జన విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తామంతా వికేంద్రీకరణ కోసం గర్జిస్తుంటే.. పవన్ మాత్రం.. బాబు వెనక పిల్లిలా మ్యావ్ మ్యావ్ అని భజన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. సినిమాలో వచ్చే రెమ్యూనరేషన్ కంటే చంద్రబాబు ఇస్తున్న రెమ్యూనరేషన్ ఎక్కువగా ఉందని, అందుకే పవన్ సినిమా కాల్‌షీట్ల కంటే బాబు పొలిటికల్ కాల్‌షీట్లకే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 25 జిల్లాలను ఒక్కో రాజధానిగా చేయండని సలహా ఇచ్చిన పవన్‌కు.. రాష్ట్రంలో 26 జిల్లాలున్నాయన్న జ్ఞానం కూడా లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు మంచి జరగాలన్న నినాదం, విధానంతో ప్రభుత్వం ముందుకువెళ్తుంటే.. పవన్ కల్యాణ్ విశాఖ వచ్చి ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. దండయాత్రకు వస్తున్న అమరావతి రైతులకు పైలట్‌గా ముందుగా పవన్ వస్తున్నారనీ.. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను గుర్తించి ఇప్పటికైనా తన పర్యటనను వాయిదా వేసుకోవడం మంచిదని మంత్రి అమర్‌నాథ్ హితవు పలికారు. ఆయనకు రాజధానులు కంటే రాణిధానుల గురించే ఎక్కువ ఆసక్తి ఉంటుందనీ.. ఇప్పటికే పవన్‌కు అంతర్జాతీయ రాజధానిగా మాస్కో, జాతీయ రాజధానిగా ముంబై, పక్కనే హైదరాబాద్ ఉన్నాయని చురకలంటించారు. ఫెడరల్ సిస్టమ్ గురించి తెలీని పవన్ లక్షా 80 వేల పుస్తకాలు చదివారా.? లేదా అందులోని బొమ్మలు మాత్రమే చూశారా అనే అనుమానం వస్తోందని అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు.

# టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

- చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ సవాల్
- బాబు నుంచి ప్యాకేజీ అందగానే దత్తపుత్రుడి ట్వీట్లు



సాక్షి, అమరావతి: అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు భావిస్తే.. 'ఉత్తరాంధ్రకు అభివృద్ధి వద్దు .. విశాఖకు రాజధాని వద్దు..' అని స్పష్టంగా చెప్పాలని లోక్ సభలో వైఎస్సార్ సీపీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని, తన అనుచరుల భూములు కాపాడుకోవాలని ఉంటే చంద్రబాబు టీడీపీ నుంచి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాలని సవాలు విసిరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దమ్ము, ధైర్యంతో కాంగ్రెస్ పార్టీని విభేదించి బయటకు వచ్చి తనతో పాటు వచ్చిన 18 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించారని, వారంతా తిరిగి ఎన్నికల్లో పోటీచేసి గెలిచారని గుర్తుచేశారు. చంద్రబాబుకు కూడా దమ్ము, ధైర్యం ఉంటే రాజీనామాలు చేసి ఎన్నికలకు వెళ్తే, ఎవరిసత్తా ఏమిటో తెలుస్తుందన్నారు. అసెంబ్లీని రద్దుచేయమని చెబుతున్న అచ్చెన్నాయుడు.. ఐదేళ్లపాటు టీడీపీ చేసిన అవినీతి, ఆ ప్రభుత్వ విధానాలు నచ్చకే ప్రజలు 2019లో తమపార్టీకి పట్టం కట్టారని గుర్తుంచుకోవాలని సూచించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. 'అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రైతుల ముసుగులో అమరావతి టు అరసవల్లి పాదయాత్ర చంద్రబాబునాయుడు డైరెక్షన్‌లో జరుగుతోంది. రాష్ట్రం మొత్తాన్ని అంధకారంలోకి నెట్టేసి, రాష్ట్ర సంపదనంతా అమరావతిలోని 29 గ్రామాల్లో కుమ్మరించాలనే కుట్రతో పాదయాత్ర జరుగుతోంది. అది తెలుగుదేశం పార్టీ ముసుగులో కొంతమంది చంద్రబాబు బినామీలు, బడాబాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. రైతుల పేరుతో చేస్తున్న యాత్ర. ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు తమ వైఖరి మార్చుకోవాలి. ఉత్తరాంధ్రలో మీరు అడుగుపెడితే, ప్రజలు మిమ్మల్ని తరిమి కొడతారు. అభివృద్ధి వికేంద్రీకరణకు వ్యతిరేకంగా ట్వీట్లు, మీడియా మీట్లు పెడుతున్న చంద్రబాబు, లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఎక్కడ నివాసం ఉంటున్నారు. అమరావతి మాత్రమే క్యాపిటల్ కావాలని కోరుకుంటున్న ఈ ముగ్గురు ఎందుకు ఆ ప్రాంతంలో నివాసం ఉండకుండా హైదరాబాద్‌లో ఉంటున్నారు? చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ పూర్తిగా అజ్ఞానవాది. 2018లో గుంటూరు సభలో ఈ దత్తపుత్రుడు.. రాజధాని పేరుతో కేవలం అమరావతి చుట్టుపక్కలే అభివృద్ధి కావాలా, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ఏమవ్వాలి అని అన్నారు. ఇప్పుడు అమరావతే రాజధాని కావాలని ట్వీట్లు పెడుతున్నారు. బాబు నుంచి ప్యాకేజీ అందగానే దత్తపుత్రుడి ట్వీట్లు బయటకు వస్తాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ లక్ష్యం. అమరావతి రాజధాని కాదని మేము ఎప్పుడూ, ఎక్కడా చెప్పలేదు. అమరావతితో పాటు విశాఖ, కర్నూలు కూడా రాజధానులుగా ఉంటే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనేది సీఎం ఆలోచన. మూడేళ్లుగా సీఎం జగన్ ఒక్క రూపాయి అవినీతి లేకుండా, కులమత ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.' అని అన్నారు.

# దేశవాళీ గోవుల అభివృద్ధికి కృషి

**శిక్షణా తరగతుల్లో ఎస్వీవీ వర్సిటీ వీసీ పద్మనాభరెడ్డి**



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పద్మనాభరెడ్డి

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాల్లో మన దేశవాళీ ఆవులకు ప్రత్యేక గుర్తింపు ఉందని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వి.పద్మనాభరెడ్డి తెలిపారు. అందుకే దేశవాళీ ఆవులు, దూడల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు నగర శివారులోని లాం నందున్న లైవ్ స్టాక్ కేంద్రంలో జూనియర్ శాస్త్రవేత్తలకు లైవ్‌స్టాక్ నిల్వ, నిర్వహణ, పిండోత్పత్తి తదితర అంశాలపై పది రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఒంగోలు జాతి పశువుల అభివృద్ధి కేంద్రంలో ఐవీఎఫ్ ద్వారా ఆరోగ్యకరమైన కోడెల నుంచి వీర్యాన్ని సేకరించి మేలు జాతి, దేశవాళీ ఆవులు, దూడల ఉత్పత్తికి కృషి చేస్తున్నామన్నారు. మామూలుగా పశువుల్లో నేరుగా ఏడాదికి ఒక దూడను ఉత్పత్తి చేయగలమని, కానీ ఐవీఎఫ్, ఈటీటీ పద్ధతి ద్వారా ఏడాదికి 10 దూడలను ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగామని తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో బ్రెజిల్‌కు చెందిన లైవ్‌స్టాక్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎడా శిక్షణ ఇస్తారని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో త్వరలో లైవ్ స్టాక్, వెటర్నరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లైవ్‌స్టాక్ రీసెర్చ్ సెంటర్ ప్రొఫెసర్ ఒఐసీ డాక్టర్ ముత్తారావు, ఐవీఎఫ్ నేషనల్ మెంటర్ డాక్టర్ శ్యాంజావెర్, ఏపీఎల్‌డీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రీసెర్చ్ కేంద్రం డైరెక్టర్, డీన్ డాక్టర్ కె.సర్జనరావు, డాక్టర్ ఎస్ఆర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని ప్రాంతాల అభివృద్ధి కోరుకోవడం తప్పా?

- రాయలసీమలో హైకోర్టును అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు
- శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త శ్రీకాంత్‌రెడ్డి



కడప కార్పొరేషన్: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి కోరుకోవడం తప్పెలా అవుతుందని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. కడపలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న వికేంద్రీకరణ విధానంపై కొన్ని నెలలుగా ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని ధ్వజమెత్తారు. రాజధానిని ఎప్పుడు ప్రకటించారు, వీరంతా భూములు ఎప్పుడెప్పుడు కొన్నారనే విషయాలను సాక్ష్యాధారాలతో సహా అసెంబ్లీలో తాము బయటపెట్టామని ఆయన గుర్తుచేశారు. బౌన్సర్లను పెట్టుకుని యాత్రలో అసభ్యకరంగా నృత్యాలు చేయడం విచారకరమన్నారు. పద్నాలుగేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు రాయలసీమకు చేసిందేమీ లేదన్నారు. రాయలసీమ ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయంటే అది వైఎస్సార్, ఆయన తనయుడు సీఎం జగన్ ఘనతేనన్నారు.

**కర్నూలులో హైకోర్టును ద్వేషించడం దారుణం**

ఇక కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామంటుంటే చంద్రబాబు ద్వేషించడం దారుణమని.. దానిని అడ్డుకుంటే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కర్నూలులో హైకోర్టు పెట్టాలని తీర్మానించిన బీజేపీ నాయకులు ఇప్పుడు నోరెందుకు మెదపడంలేదని నిలదీశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయం, సోమశిల ప్రాజెక్టుల వల్ల లక్షల ఎకరాల భూములు, ఊర్లను కోల్పోయిన రైతులే త్యాగధనులని, ఆకుపచ్చ కండువా వేసుకున్నంత మాత్రాన రైతులు అయిపోరని ఎద్దేవా చేశారు. వికేంద్రీకరణవల్ల ఏ ఆఫీసు ఎక్కడికి తరలిపోకుండా కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ నారాయణ, రామకృష్ణలాంటి వారు 30లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన వైఎస్ జగన్‌ను ప్రశంసించకుండా, అమరావతి రైతుల కోసం పోరాటం చేయడం విచిత్రంగా ఉందన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఎన్నిసార్లు తన వైఖరి మార్చుకున్నారో లెక్కేలేదన్నారు.

**త్వరలో రాయలసీమ జేఏసీ ఏర్పాటు**

రాయలసీమలోని ప్రజా ప్రతినిధులు, మేధావులు, అన్ని పార్టీల నాయకులతో కలిసి రాయలసీమ జేఏసీ ఏర్పాటుచేయనున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. చంద్రబాబు, టీజీ వెంకటేష్ లాంటివారు రాయలసీమ ద్రోహులన్నారు. రాజీనామాలు తమకు కొత్త కాదని, తమ నాయకుడు ఆదేశిస్తే రాయలసీమ కోసం రాజీనామా చేయడానికి సిద్ధమన్నారు.



'నాకు సంతోషం కావాలి'లో 'నాకు' అనే అహాన్నీ 'కావాలి' అనే కోరికనూ తొలగిస్తే మిగిలేదంతా సంతోషమే.
– బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, అక్టోబర్, 12

# పెచ్చరిల్లిన యుద్ధకాండ

రాజధాని కీవ్ సహా ఉక్రెయిన్ మళ్ళీ క్షిపణిదాడులతో దద్దరిల్లుతోంది. విద్యుత్ సరఫరా ఆగింది. జనం ప్రాణాలు అరచేత పట్టుకొని బంకర్లలో తలదాచుకుంటున్నారు. వరుసగా రెండురోజులుగా రష్యా క్షిపణిదాడులు. పిల్లల ఆటస్థలాలపైనా దాడులతో పదుల మంది ప్రాణాలు కోల్పోతే, వంద మందికి పైగా గాయాల పాలయ్యారు. ఒక్కసారిగా ఉద్రిక్తత పెంచిన ఈ దాడులతో యుద్ధం ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వప్రతినిధిసభలో చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్‌లోని నాలుగు కీలక ఆక్రమిత ప్రాంతాలను రెఫరెండమ్‌ల మాటున తమ దేశంలో కలిపేసుకున్నట్టు ఇటీవలే రష్యా అక్రమంగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ముందుకొచ్చింది. ఒకట్రెండు రోజుల్లో దీనిపై ఓటింగ్ జరగనుంది. వెరసి పెచ్చరిల్లిన యుద్ధకాండతో అంతర్జాతీయంగా ఉద్విగ్నత నెలకొంది.

తమ దేశ గగనతల రక్షణకు మరిన్ని ఆయుధాలు కావాలని ఉక్రెయిన్ అభ్యర్థిస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అత్యవసరంగా 'జీ7' దేశాల నేతలతో సమావేశమయ్యారు. రష్యన్ చమురుపై కఠినతరమైన ఆంక్షలు పెట్టాలన్నారు. మరోపక్క 'నాటో' సైతం యుద్ధంలో కడ దాకా ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తామని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ప్రారంభించిన రష్యాయే దీనికి ముగింపు పలకాలంది. ఈ వారంలోనే 'నాటో' రక్షణ మంత్రులూ సమావేశం కానుండడం మరో కీలక పరిణామం. రష్యా మాత్రం పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచి, యుద్ధాన్ని పెంచిపోషిస్తున్నాయని ఆరోపిస్తోంది. ఉక్రెయిన్‌లో ఎదురుదెబ్బల నేపథ్యంలో ఓ నిరంకుశ కొత్త సైనిక కమాండర్‌ను బరిలోకి దింపింది. వరస చూస్తుంటే, యుద్ధం మరింత సంక్లిష్ట దశకు చేరుకొన్నట్టు కనిపిస్తోంది.

తాజా దాడి ఘటనల్ని గమనిస్తే – రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అభిమాన ప్రాజెక్టు క్రిమియా – రష్యా మధ్య రోడ్డు, రైలు వంతెన. ఇటు సైనికపరంగా, అటు ప్రతీకాత్మకంగా అది ముఖ్యమైనది. ఆక్రమిత క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యాకు కలిపే ఆ 'కెర్చ్ వంతెన'ను 370 కోట్ల డాలర్ల ఖర్చుతో నిర్మించారు. నాలుగేళ్ళ క్రితం 2018 మే నెలలో పుతిన్ స్వయంగా దానిపై వాహనం నడుపుతూ ఆర్భాటంగా ప్రారంభించారు. రష్యా ఆక్రమణకు ఓ కీలక ప్రతీక లాంటి ఆ వంతెన పుతిన్ 70వ జన్మదినం మర్నాడే అక్టోబర్ 8 భారీ పేలుడుతో ధ్వంసమైంది. అందుకు ఉక్రెయినే కారణమంటూ పుతిన్ 48 గంటలు గడిచేలోగా భీకర ప్రతీకార దాడులకు దిగారు. తత్ఫలితమే – ఇటీవల ఎన్నడూ లేనంత స్థాయిలో సోమ, మంగళవారాల్లో ఉక్రెయిన్ నగరాలపై రష్యా చేసిన దాడులు.

ఏడునెలల క్రితం ప్రత్యేక సైనిక చర్య అంటూ మొదలుపెట్టిన పుతిన్ ఉక్రెయిన్‌ను రష్యాలో భాగం చేసుకోవాలనే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. అంతర్జాతీయచట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. తక్షణం, బేషరతుగా వెనక్కి రావాలని మార్చిలో సాక్షాత్తూ ఐరాస 141 దేశాల మద్దతుతో తీర్మానించినా, మాస్కో జంకూగొంకూ లేకుండా దాడులు చేస్తూనే ఉంది. రెండున్నరేళ్ళుగా భయపెడుతున్న కోవిడ్ లానే ఈ యుద్ధకాండ ఫలితాలు సైతం ఒక్క ఉక్రెయిన్‌కే కాక మొత్తం ప్రపంచానికి విస్తరిస్తున్నాయి. ఐరాస పట్టు కోల్పోతోంది. ఆహార ధరలు పెరిగిపోయాయి. శరణార్థుల సమస్య, సాంస్కృతిక – క్రీడా రంగాల్లో బహిష్కరణలు సరేసరి. అంతర్జాతీయ సహకారానికి పెద్ద దెబ్బ తగిలింది. అణ్వస్త్ర ప్రయోగంపై పుతిన్ చీటికీమాటికీ చేస్తున్న హెచ్చరికలు ఆయన నిర్లక్ష్య నేరధోరణికీ, అంతకంతకూ పెరుగుతున్న అసహనానికీ ప్రతీకలు. పెరుగుతున్న ఉద్రిక్తతలతో ప్రపంచం అణ్వస్త్ర మహా సంగ్రామానికి అతి దగ్గరగా ఉందంటూ అమెరికా అధ్యక్షుడు గతవారం హెచ్చరించడం గమనార్హం.

ఇవి చాలదన్నట్టు పుతిన్ యుద్ధకాంక్ష ఇప్పటికే ప్రపంచ ఇంధన సరఫరాలపై, విపణిపై మును పెన్నడూ లేని ప్రభావం చూపింది. తాజాగా రష్యా సహా ఒపెక్ ప్లస్ దేశాలు ప్రపంచ చమురు ఉత్పత్తిలో కోత విధించాలని నిర్ణయించడమూ దెబ్బే. చమురు కొరతతో ఈ శీతకాలంలో యూరోపియన్ ప్రపంచానికి కష్టాలు పెరగనున్నాయి. అసలైతే ఒపెక్ సభ్యదేశాల్లో అనేకం పాశ్చాత్యానికి మిత్రపక్షాలే. ఇప్పుడవి తమ వైఖరిని మార్చుకున్నాయా అనిపిస్తోంది. అదే గనక నిజమైతే, రెండు వర్గాలుగా దేశాలు చీలుతాయి. నిరంకుశాధికార ఇరాన్ సహా రష్యాను సమర్థించే దేశాలు ఒకపక్క, అమెరికా – బ్రిటన్ – ఇతర జీ7 దేశాలు – ఐరోపా సమాజం మరోపక్క మోహరిస్తాయి.

ఇక, రష్యాతో పోరుతో పాటు ఉక్రెయిన్‌ను ఆర్థిక కష్టాలూ వెన్నాడుతున్నాయి. అమెరికా నెలకు 150 కోట్ల డాలర్ల సైనికేతర సాయం ఇస్తానని హామీ ఇచ్చింది కానీ, ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా ఉండాలంటేనే నెలకు 500 కోట్ల డాలర్లు అవసరం. మరోపక్క యూరోపియన్ యూనియన్ (ఈయూ) తన వంతు సాయం చేయడంలో విఫలమైంది. 900 కోట్ల యూరోలు ఇస్తామంటూ మేలో చెప్పిన బ్రస్సెల్స్ ఇప్పటికి 100 కోట్ల యూరోలే చెల్లించింది. ఉక్రెయిన్‌కు సైనిక సరఫరాలు, రష్యాపై ఆంక్షలపైనా ఈయూలో అభిప్రాయ భేదాలున్నాయి. ఫ్రాన్స్, జర్మనీ లాంటివి కీలక ఆయుధాలు ఇవ్వనేలేదు. రష్యా అనుకూల హంగరీ ఈయూ ఐక్యతకు తూట్లు పొడుస్తోంది.

పుతిన్ పరిస్థితీ గొప్పగా లేదు. సైనికవైఫల్యాలు, యుద్ధనేరాల ఆరోపణలు, ప్రజల్లో అసంతృప్తి రేపిన సైనిక సమీకరణ ఆలోచనలు ఆయన ప్రతిష్ఠను దెబ్బతీశాయి. వంతెన విధ్వంసంతో తల కొట్టేసినట్టయి తెగబడేసరికి మళ్ళీ కలకలం రేగింది. ఈ ఉద్రిక్తత, దాడులు ఎవరికీ మంచిది కాదనేది భారత్ వాదన. అంతా అది అంగీకరించినా, ఆపే దిశగా ఆచరణ శూన్యం. భయపెడుతున్న అణుయుద్ధంలో ఎవరూ గెలవలేరు. ఆ ఉన్మాదంలో పరాజయం యావత్ మానవ ప్రపంచానిదే!

### గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.తదియ రా.1.53 వరకు
తదుపరి చవితి, **నక్షత్రం:** భరణి సా.6.10 వరకు
తదుపరి కృత్తిక, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.10 వరకు, **అమృతఘడియలు:** ప.1.11 నుండి 2.54 వరకు
అట్లతదియ.

**సూర్యోదయం :** 5.55
**సూర్యాస్తమయం:** 5.38
**రాహుకాలం :** ప. 12.00 నుండి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుండి 9.00 వరకు

# ఎంత గాలి వీచేను?

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

**తెలంగాణ రాష్ట్ర సమితి ఇప్పుడు భారత్ రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుని ప్రజల ముందుకొచ్చింది. సాంకేతికంగా ఎన్నికల సంఘం ఆమోదం రావాల్సి ఉన్నప్పటికీ, అదేమీ సమస్య కాకపోవచ్చు. దీనివల్ల ఎలాంటి రాజకీయ ప్రయోజనం కలుగుతుందన్న చర్చ వస్తుంది. కేసీఆర్ నిజానికి వచ్చే శాసనసభ ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత జాతీయ పార్టీ ప్రతిపాదనపై ముందుకు వెళ్లవచ్చని చాలామంది ఊహించారు. అందుకు భిన్నంగా జాతీయ పార్టీగా టీఆర్ఎస్‌ను మార్చడం వల్ల శాసనసభ ఎన్నికలలో కూడా లబ్ధి చేకూరుతుందన్న అంచనాకు ఆయన వచ్చి ఉండాలి. తన కుమారుడు కేటీఆర్‌ను సీఎంను చేయడం కూడా ఇందులో ఒక లక్ష్యమంటారు. అయితే పార్టీ ప్రభావం ఏపీలో ఎంత ఉంటుందన్నది అనుమానమే!**

కేసీఆర్‌కు సెంటిమెంట్లు, నమ్మకాలు ఎక్కువే. ఎవరో తాంత్రికుడు చెప్పాడని పార్టీ పేరు మార్చారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. వాస్తు దోషం ఉందని సచివాలయాన్ని పడగొట్టి, కొత్త సచివాలయం నిర్మిస్తున్నారు. ఇవన్నీ నమ్మకాల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలా, కాదా? అన్నదానికి జవాబు చెప్పలేం. తెలంగాణ పేరుతో పార్టీ ఉంటే జాతీయ రాజకీయాలలో ఎంత క్రియాశీలకంగా ఉన్నా, కొన్ని పరిమితులు ఉంటాయి. ఒక రాష్ట్రం పేరుతో ఉన్న పార్టీని ఇతర రాష్ట్రాలలో విస్తరించడం సాధ్యపడదు. దానిని అధిగమించాలంటే పాన్ ఇండియా... అంటే దేశ వ్యాప్తంగా అందరూ ఆకర్షితులయ్యే విధంగా పార్టీ పేరు ఉండాలని ఆయన తలపెట్టారు. తదనుగుణంగా టీఆర్ఎస్ కాస్తా బీఆర్ఎస్‌గా మారిపోయింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అఖిల భారత స్థాయిలో పలువురు తెలుగు ప్రముఖులు రాజకీయాలలో తమ ప్రభావాన్ని చూపారు. వారిలో కొద్దిమంది జాతీయ పార్టీలకు అధ్యక్షులు అయ్యారు. నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నరసింహారావు ఏఐసీసీ అధ్యక్షులుగా ఎన్నికకాగా, వెంకయ్య నాయుడు బీజేపీ అధ్యక్ష పదవిని అలంకరించారు. సినీనటుడు, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు కూడా జాతీయ పార్టీని స్థాపించాలని గట్టి ప్రయత్నాలే చేశారు. తెలుగుదేశం పార్టీ అంటే తెలుగు వారికే పరిమితం అవుతుంది కనుక భారతదేశం పేరుతో మరో పార్టీ పెట్టాలనుకున్నారు. ఆచరణలో చేయలేక పోయారు. కానీ జాతీయ స్థాయిలో వివిధ పార్టీలను కలిపి నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు కావడంలో ముఖ్య భూమిక పోషించారు. ఆ ఫ్రంట్‌కు ఆయనే ఛైర్మన్‌గా ఉండే వారు. ఎంత ఛైర్మన్ అయినా, 1989లో ఆయన అధికారం కోల్పోవడంతో ప్రధాని రేసులో నుంచి తప్పుకోవలసి వచ్చింది.

ఎన్టీఆర్ అభిమానిగా తెలుగుదేశంలో చేరి, తదనంతర కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నేతగా, రెండు టరమ్‌లు విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిగా కేసీఆర్ దేశస్థాయిలో ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే టీఆర్ఎస్ పేరు మార్పు వల్ల ఇంతవరకూ ఆ పేరుకు ఉన్న బ్రాండ్ ఇమేజీ దెబ్బతినే అవకాశం ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక్క పదం తప్ప మిగిలినదంతా యథాతథంగా ఉంటుందనీ, పార్టీ రంగు, గుర్తు ఏవీ మారవు కాబట్టి ప్రజలు తేలికగానే అడ్జస్టు అవుతారనీ బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే పార్టీ జెండాలో తెలంగాణ మ్యాప్ బదులు భారతదేశ మ్యాప్ ఉంచాలి.

జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లను ఈ కొత్త జాతీయ పార్టీ ఎదుర్కోగలదా అంటే అప్పుడే సాధ్యం కాదని చెప్పక తప్పదు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ ఒంటరిగానే ప్రయాణం ఆరంభించి, తన పోరాటం, వ్యూహాలతో లక్ష్యాన్ని సాధించారనీ, ఇప్పుడు



కూడా భారత్ రాష్ట్ర సమితిని విజయపథంలో నడిపిస్తారనీ టీఆర్ఎస్ నేతలు అంటున్నారు. వాదన వినడానికి బాగానే ఉన్నా, ఆయా రాష్ట్రాలలో తనకు కలిసి వచ్చే శక్తులు, వ్యక్తులను గుర్తించి ముందుకు వెళ్లడం అంత తేలిక కాదు. కర్ణాటకలో జేడీఎస్‌తో కలిసి బీఆర్ఎస్ పోటీ చేస్తుందనీ, ఈ కూటమి అధికారంలోకి వస్తుందనీ కేసీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. 224 సీట్లు ఉన్న కర్ణాటక అసెంబ్లీలో జేడీఎస్‌కు 35 సీట్లే ఉన్నాయి. వారి బలమే అంతంతమాత్రంగా ఉన్నప్పుడు వారి పొత్తు బీఆర్ఎస్‌కు ఎంత మేర ఉపయోగపడుతుందన్నది ప్రశ్నార్థకం. అందువల్లే కర్ణాటక శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి స్పష్టం చేశారు. ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్ర పరిధి కర్ణాటకలోని కొన్ని జిల్లాలు, మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల్లో కేసీఆర్ ప్రభావం ఉండవచ్చని కొందరు చెబుతున్నారు. ఈ రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉండే కొన్ని గ్రామాలవారు తెలంగాణ ప్రభుత్వ స్కీములకు ఆకర్షితులవుతున్నారని కథనం. కాంగ్రెస్, జేడీఎస్‌లతో పాటు బీఆర్ఎస్ కలిస్తే కేసీఆర్‌కు రాజకీయంగా ప్రయోజనం ఉంటుంది. కానీ కాంగ్రెస్‌తో జత కడతామని ఇప్పటికిప్పుడు చెప్పలేని స్థితిలో కేసీఆర్ ఉన్నారు.

అదే సమయంలో తోటి తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడు రంగంలోకి దిగేది కేసీఆర్ నేరుగా చెప్పలేదు. ఆయన మంత్రివర్గ సహచరులు ఎర్రబెల్లి దయాకరరావు వంటివారు మాత్రం సంక్రాంతికి విజయవాడ, గుంటూరులలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండవచ్చని చెప్పారు. పలువురు ఏపీ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని కూడా వారు అంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఒక ప్రముఖ టీడీపీ నేత, ఆయన సోదరుడి పేరు వినవస్తోంది. కానీ ధ్రువీకరణ కాలేదు. ఇదే సమయంలో బీజేపీ తెలంగాణ, ఏపీ నేతలు గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రావారిని ఉద్దేశించి కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారనీ, ఆంధ్రలో ఏమని ప్రచారం చేస్తారనీ ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రావారి సంస్కృతి, ఆహారపు అలవాట్లు, భాషను ఎద్దేవా చేస్తూ మాట్లాడారని వారు గుర్తు చేస్తున్నారు.

కృష్ణానదీ జలాల వివాదం, ఆస్తుల విభజన మొదలైన సమస్యలు ఉండగా, ఏపీలో కేసీఆర్ ఏం చెబుతారని అడుగుతున్నారు. ఏపీలో అధికార వైసీపీతో గానీ, ముఖ్యమంత్రి జగన్‌తో గానీ ఇంతవరకూ వ్యక్తిగత విభేదాలు లేవు. కానీ ఈ మధ్యకాలంలో విధాన పరమైన విషయాలలో తేడాలు వచ్చాయి. దానికితోడు కొందరు తెలంగాణ మంత్రులు ఆంధ్ర ప్రభుత్వాన్ని విమర్శించడం, దానిపై ఏపీ మంత్రులు రియాక్ట్ కావడం వంటివి జరిగాయి. అయినా కేసీఆర్ ఆంధ్రలో బీఆర్ఎస్ స్థాపించవచ్చు. టీడీపీ వారే ఎక్కువగా చేరే అవకాశం ఉందని అంచనా. గతంలో కేసీఆర్ తెలుగుదేశంలో ప్రముఖుడిగా ఉండి పలువురితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఆ పరిచయాలు పనిచేస్తే హైదరాబాద్ ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న కొంతమంది చేరవచ్చు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో గానీ, టీడీపీ అధినేత చంద్రబాబుతో గానీ కలిసి బీఆర్ఎస్ పనిచేసే అవకాశం ఉందా అన్న దానిపై ఊహాగానాలు ఉన్నా, అవి తేలికగా సాధ్యపడేవి కావు. పైగా సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న రాజకీయాలు అన్న సంగతి మర్చిపోకూడదు. చంద్రబాబు ఎలాంటి వ్యాఖ్య చేయకుండా నవ్వి ఊరుకున్నారంటే అందులో చాలా అర్థాలు ఉండవచ్చు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును ఉద్దేశించి డర్టియస్ట్ పొలిటీషియన్ అంటూ కేసీఆర్ చేసిన విమర్శల వల్ల వీరి మధ్య బంధం ఏర్పడకపోవచ్చు. అయితే వైసీపీ వారు తమకు బీఆర్ఎస్ వల్ల ఎలాంటి సమస్యా ఉండదని స్పష్టం చేశారు.

తమిళనాడుకు చెందిన తిరుమావళవన్ పొత్తు పెట్టుకున్నా, ఆ రాష్ట్రంలో బీఆర్ఎస్ పుంజుకోవడం కష్టసాధ్యం. ఇప్పటికే దేశంలో పలు జాతీయ పార్టీలు ఒకటి, రెండు రాష్ట్రాలకే పరిమితమై ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభజన తర్వాత జాతీయ పార్టీ అని చెప్పుకొన్నప్పటికీ, తన కార్యక్షేత్రం విభజిత ఏపీకే పరిమితం అయింది. ఎస్పీ, బీఎస్పీ, ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్, జేడీయూ, ఆర్జేడీ వంటివి జాతీయ పార్టీలు అని చెప్పుకొంటున్నా, వాస్తవానికి అవి తమకు ప్రాబల్యం ఉన్న రాష్ట్రాలలోనే ప్రభావం చూపగలుగుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రం ఢిల్లీ నుంచి పంజాబ్‌కు విస్తరించి అధికారం సాధించింది. ఇప్పుడు పేరు, స్వరూపం మార్చుకుని ఏర్పడ్డ బీఆర్ఎస్ దేశం అంతటా వ్యాపించగలిగితే గొప్ప విషయమే అవుతుంది. ప్రధాని మోదీ పైనా, భారతీయ జనతా పార్టీ పైనా కేసీఆర్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తమ కుటుంబ అవినీతి బయట పడకుండా, సీబీఐ, ఈడీ కేసులు వస్తాయేమోనన్న భయంతోనే ఈ కొత్త ఆలోచన చేశారని బీజేపీ వ్యాఖ్యానిస్తోంది. ఏది ఏమైనా ఒక తెలుగునేతగా కేసీఆర్ చేస్తున్న సాహసాన్ని అభినందించవచ్చు. కాకపోతే అది దుస్సాహసంగా మారకుండా ఉంటేనే ఆయనకూ, ఆ పార్టీకీ మేలు జరుగుతుంది.

*వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు*

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





## సోషల్ మీడియా

### అప్పే తప్పు



నేను ఇప్పుడు రుణం నుంచి విముక్తుడినయ్యాను. ఈ స్వేచ్ఛను ఆనందిస్తున్నాను. నేను చేసిన అత్యంత ఖరీదైన తప్పు గృహ రుణం తీసుకోవడం!
– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

### సూపర్ బర్త్‌డే



సూపర్ స్టార్ 'హ్యాపీ బర్త్‌డే' ఇవ్వాళ (అక్టోబర్ 11). ఆయనకు కేవలం 80 ఏళ్లు మాత్రమే. ఆయన హీరో, నా హీరో కూడా అయిన సూపర్ సూపర్ సూపర్ స్టార్ 98 ఏళ్లు బతికారు (దిలీప్ కుమార్). మన ప్రియతమ తార అయిన అమితాబ్ బచ్చన్ కూడా వందేళ్లు దాటుతారని ఆశిద్దాం.
– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### వివక్షాపూరితం



పటియాలా(పంజాబ్) కోర్టు ఛాంబర్ కాంప్లెక్స్‌లోని లేడీస్ టాయ్‌లెట్‌కు సాయంత్రం ఆరింటి తర్వాత తాళం వేస్తున్నారు. ఇది ఏం సూచిస్తున్నదంటే: 'ఆడవాళ్లూ మీరు ఇంటికి వెళ్లండి. మగవాళ్లను పని చేసుకోనీ.' ఈ వృత్తిలో ఇప్పటికే లింగవివక్ష చాలా హెచ్చుగా ఉంది. ఇక ఇలాంటి చిన్న విషయాలు దాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి.
– ఆర్య, న్యాయవాది

### జీవిత ప్రయాణం



నా చిన్నతనంలో నేను ఎప్పుడూ నక్సలైట్ అవుతానని అనుకోలేదు. నక్సలైట్‌గా ఉండగా న్యాయవాదిని అవుతానను కోలేదు. న్యాయవాదిగా ఉండగా ఎమ్మెల్యే అవుతానని అనుకోలేదు. ఎమ్మెల్యేగా ఉండగా పీహెచ్‌డీ చేస్తానని అనుకోలేదు. ఇప్పుడు నన్ను మీరు పొలిటికల్ సైన్సులో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ అనసూయ సీతక్క అని పిలవొచ్చు.
– ధనసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యే

### సినిమా గొప్పతనం



పొన్నియన్ సెల్వన్ మహిమ! మా అమ్మాయి చోళులు, శైవం వర్సెస్ వైష్ణవం (సినిమాలో చూపినట్టు), ఇంకా చాలా విషయాల పట్ల ఆసక్తి చూపుతోంది. డైనింగ్ టేబుల్ దగ్గర మాట్లాడుకోవడానికి చాలా విషయాలు దొరికాయి. చరిత్ర, పాఠ్య పుస్తకాలు చేయలేని పనిని ఒక చారిత్రక కాల్పనిక చిత్రం చేయగలిగింది.
– కార్తీక్, కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్

### అనుమానాలున్నాయి



లాల్ బహదూర్ శాస్త్రి, హోమీ భాభా, విక్రమ్ సారాభాయి... వీళ్లను చంపింది ఎవరు? భారతదేశం అణుశక్తి సాధించడం ఇష్టంలేని సీఐఏ (అమెరికా) దీని వెనుక ఉందా?
– ఎస్.కె. సూద్, మాజీ 'రా' అధికారి

### ముందు నీకోసం...



'నీ పాఠకులు ఎవరో తెలుసుకో' అనే సలహా రచయితలకు అత్యంత ప్రమాదకరం. నీకు ఆసక్తికరమైనదీ, వినోదం కలిగించేదీ రాయాలి. నీకోసం నువ్వు రాసుకోవడంలో మజా ఉంటుంది. అది కాగితం మీద కనబడుతుంది. ఇతరుల కోసం రాయడం పని అవుతుంది. అది కూడా కాగితం మీద కనబడుతుంది.
– మోర్గాన్ హౌజెల్, రచయిత

# విద్యారంగంలో దూసుకుపోతున్న ఏపీ

అభిప్రాయం



వి.వి. రమణ

విద్యాభివృద్ధి మీదే సమాజాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాను అధికారం చేపట్టిన వెంటనే ముందు విద్యారంగంపై దృష్టిపెట్టారు. 'నాడు–నేడు'లో భాగంగా ప్రభుత్వ బడులలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టారు. తొలి దశ క్రింద 15,715 స్కూళ్లలో సదుపాయాలను కల్పించగా... ప్రస్తుతం రెండో విడత పనులు జరుగుతున్నాయి. ఈ దశలో స్కూళ్లతో పాటుగా కాలేజీలు, హాస్టళ్లు, భవిత కేంద్రాలు, డైట్‌తో పాటు శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు కూడా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. ప్రాథమిక తరగతి నుండి ఇంటర్ వరకు 'అమ్మ ఒడి' పథకం ద్వారా విద్యార్థులను పాఠశాలకు రప్పించడానికి ప్రతి విద్యార్థి తల్లికి 15 వేల రూపాయలను ఆమె ఖాతాలో జమ చేస్తోంది ప్రభుత్వం. పాఠశాల ప్రారంభంలోనే 'జగనన్న విద్యా కానుక' రూపంలో విద్యార్థులకు బుక్స్, బ్యాగ్, యూనిఫాం, బూట్లు, టై, బెల్టులు, డిక్షనరీలు ప్రతి విద్యార్థికి అందిస్తోంది.

అలాగే ఉన్నత విద్య చదవాలన్న ఆసక్తి కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. 'జగనన్న విద్యాదీవెన', 'వసతి దీవెన' ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సహాయం అందిస్తోంది. అర్హత ఉన్న విద్యార్థులు అన్ని కోర్సులకు చెల్లించే ఫీజును తిరిగి విద్యార్థులకే చెల్లించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. 'జగనన్న విద్యాదీవెన' ద్వారా 24.74 లక్షల మంది విద్యార్థులకు రూ. 8,365 కోట్లు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లింపులు జరిగాయి. 'జగనన్న వసతి దీవెన' కింద 18.77 లక్షల మందికి రూ. 3349.57 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. 'అమ్మ ఒడి' పథకం ద్వారా ఈ మూడేళ్లలో 44.5 లక్షల మంది ఖాతాల్లో రూ. 19617.60 కోట్ల రూపాయలు జమ చేశారు. ఈ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతం మందికి విద్య అందుబాటులోకి వచ్చిందని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో చేస్తున్న అనేక రకాల సంస్కరణల్లో మరొకటి ఇంటర్ విద్యను, పాఠశాల విద్యను కలిపి 'ప్లస్ 2' చేయడం. దీనివలన మూడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్య ఒకే చోట దొరుకుతుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని మూడు నుంచి ఆరేళ్ల వయస్సుగల పిల్లలకు అందించడంలో ఏపీ దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. 'ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్' (ఈసీఈ) అమలులో ఏపీ అగ్రస్థానంలో ఉంది. పేద విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో జ్ఞానాన్ని అందించే క్రమంలో 'విద్యా కానుక'లో భాగంగా ఈ ఏడాది 4.70 లక్షల మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, దాదాపు 50 వేల మంది టీచర్లకు 665 కోట్లతో 5.18 లక్షల ట్యాబ్‌లను ప్రభుత్వం అందించనున్నది. ఇలా ఏపీ విద్యాసంస్కరణలతో ముందుకు దూసుకుపోతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.

*వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు*

# తూర్పు కనుమల అభివృద్ధిపై విభిన్న వైఖరి!

సందర్భం



జాన్‌సన్ చోరగుడి

అప్పటి వరకూ ఎవరూ ప్రవేశించని చోట– 'లోపలికి వెళ్లడం' అనేసరికి, ఒక్కొక్క ప్రభుత్వం తీరు ఒక్కొక్క విధంగా ఉంటుంది. ప్రధానంగా వాటి దృక్పథంపై అది ఆధారపడి ఉంటుంది. ఆ ప్రకారమే, అది తనతో– 'రాజ్యాన్ని' అంటే– 'ఎగ్జిక్యూటివ్' 'జ్యుడీషియరీ' వంటి వ్యవస్థలను, అవి ఇంకా చేరని మారుమూలల ఉన్న మానవ సమూహాల వద్దకు తనతో తీసుకు వెళుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ఒక్క– 'లెజిస్లేటివ్'కు మాత్రమే అటువంటి గమన శక్తి ఉంటుంది. రాష్ట్ర విభజన తర్వాత, తూర్పు కనుమలలోని మన్యం – 'లోపలికి వెళ్లడం' అనే విషయంలో, అక్కడ మొదటి పదేళ్ల కాలంలో ఏమి జరుగుతున్నది అనేది లోతైన సమీక్ష అవసరమైన అంశం.

వామపక్ష తీవ్రవాద సిద్ధాంత కార్యాచరణకు తూర్పు కనుమల మన్య ప్రాంతం నాలుగు దశాబ్దాల పాటుగా క్రియాశీల స్థావరం కావడంపై, ఇప్పుడు ప్రభుత్వ– 'ఫోకస్' తప్పనిసరి అయింది. అయితే అది– ఒక్కొక్క ప్రభుత్వానికి ఒక్కో తీరుగా అర్థమయింది. ఒకరు అంటారు– 'విదేశాల నుంచి పోలీస్ శాఖ కొనాల్సిన 'కమ్యూనికేషన్' ఉపకరణాలు సకాలంలో ప్రభుత్వం కొని ఉంటే, ఒక గిరిజన ఎమ్మెల్యే నక్సల్స్ చేతిలో చనిపోయేవాడు కాదు' అని. మరొక ప్రభుత్వ దృష్టి, అందుకు భిన్నంగా– ఆ ప్రాంతాన్ని... అక్కడ భూమిలోని ఖనిజ నిక్షేపాలను విలువైన ఆదాయ వనరుగా చూడ్డంగా కాకుండా, ఆ ప్రాంత ప్రజా ప్రయోజనాల దృష్టి నుంచి దాన్ని చూడాలి అని అనుకోవచ్చు. వామపక్ష తీవ్రవాద చర్యల్ని కట్టడి చేయడానికి 1989లో ఏపీ పోలీస్‌లో– 'గ్రే హౌండ్స్' విభాగం మొదలయింది. ప్రస్తుతం విశాఖపట్టణం వద్ద తాత్కాలిక 'క్యాంపు'ల్లో ఉండి పనిచేస్తూ ఉంది. అయితే సాయుధ దళాల దన్నుతో కాకుండా... పౌరపాలన దృష్టితో ఈ ప్రాంత అభివృద్ధిని చేపట్టాలి అనే– 'దార్శనికత' ముఖ్యమంత్రికి ఉన్నప్పుడు అది మునుపటికి భిన్నంగా ఉంటుంది. ఇలా భిన్నమైన దృక్పథాల మధ్య 2022 నాటికి ఇప్పటి యువ నాయకత్వానికి ఉన్న కొత్త చూపు నుంచి వచ్చినవే– పాడేరు కేంద్రంగా 'అల్లూరి సీతారామ రాజు' జిల్లా, పార్వతీపురం కేంద్రంగా 'మన్యం' జిల్లాలు. అంటే– 'లోపలికి వెళ్లడం' అనేది చిన్న పరిపాలనా యూనిట్ల ద్వారా... సూక్ష్మ స్థాయికి పరిపాలన తీసుకు వెళ్లడం వల్లనే సాధ్యమని ఈ ప్రభుత్వం నమ్మకం. నిజానికి ఇది– ప్రపంచ దేశాల చరిత్రలో కాలపరీక్షకు నిలిచిన సత్యం. అలా చూసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల్లో– గ్రామ సచివాలయాల ఏర్పాటు, విద్య–వైద్య రంగాల్లో సంస్కరణలు, ఉత్తర్వులు వెలువడిన వెంటనే కొత్త జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఏజెన్సీ ప్రాంతంలో పని మొదలు పెట్టడం, ప్రతి సోమవారం జరిగే– 'స్పందన' ప్రజా ఫిర్యాదులకు రద్దీ పెరగడం, పాడేరులో కొత్తగా మెడికల్ కాలేజీ నిర్మాణం చురుగ్గా జరగడం, రోడ్లు, వంతెనల నిర్మాణం, ఇవన్నీ అమలవుతున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులుగా కనిపిస్తున్నాయి.

గతంలో ప్రాంతమూ–ప్రజల మధ్య పెనవేసుకుపోయి ఉండే బంధాన్ని విస్మరిస్తూ రూపొందించే అభివృద్ధి నమూనాలు, వీరి పక్షాన మావోయిస్టులు – 'రాజ్యాన్ని' వ్యతిరేకించడానికి బలమైన కారణమైంది. కానీ– ఇప్పుడు ప్రభుత్వ దృక్పథం మారింది. అప్పటి వరకు ఉన్న పట్టు జారిపోతున్నప్పుడు, వ్యూహాలు మార్చుకోవడం ఎవరికైనా తప్పదు. విభజన తర్వాత, ఇంత త్వరగా ఇటువంటి కొత్త వాతావరణం ఏజెన్సీ గ్రామాల్లో



ఏర్పడుతుందని వారు కూడా అనుకుని ఉండక పోవచ్చు. దాంతో– ముఖ్యులైన మావోయిస్టుల లొంగుబాట్లు మొదలయ్యాయి. కొత్తగా వచ్చి చేరుతున్నవారు లేరు అంటున్నారు. ఈ జూన్ నెలలో జరిగిన నాయకుల అరెస్టు సందర్భంగా 33 మంది మావోయిస్టులు, 27 మంది మిలీషియా సభ్యులు పోలీసులకు లొంగిపోయారు. రూ. 39 లక్షల నగదు, అత్యంత విలువైన ఆయుధాలు స్వాధీనం అయ్యాయి. మళ్ళీ మరొకసారి ఈ సెప్టెంబర్ 7న పెదబయలు వద్ద మరొక అత్యంత భారీ ఆయుధాలు, కమ్యూనికేషన్ సిస్టం, స్కానర్లు సీఆర్పీఎఫ్ పోలీస్ దళాలు వెలుపలికి తీశాయి. ఈ జిల్లాలో రెండు నెలల వ్యవధిలో రెండవసారి ఛేదించిన ఆయుధాల నిల్వలివి. ఈ మొత్తం వ్యవహారంలో ఆసక్తికరమైన అంశం ఏమంటే– ఇప్పట్లో ఇక్కడ వీటి అవసరం ఉండదని, వారు వీటిని జక్కిని అటవీ ప్రాంతంలో భూమిలో పూడ్చిపెట్టి, ఛతీస్‌గఢ్‌లో భద్రత వున్న రహస్య ప్రాంతాలకు వెళ్లిపోయారు.

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పర్యావరణాన్నీ, జీవవైవిధ్యాన్నీ పరిరక్షిస్తూనే స్థానిక ఆదివాసుల ఆవాసాల మధ్య పర్యాటక రంగం అభివృద్ధి కొరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకు పాడేరులో– 'ఒబెరాయ్ హోటల్స్ గ్రూప్' 7 స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇక మారుమూల ప్రాంత అభివృద్ధి కోసం పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడ్డంతో ఇక్కడి – కురుకుట్టి వద్ద 1200 మెగావాట్లు, కర్రివలస వద్ద 1,000 మెగావాట్లు సామర్థ్యం గల అదానీ గ్రీన్ ఎనర్జీ పవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవి పూర్తి అయ్యాక, ఒకప్పుడు – గ్రే హౌండ్స్ పోలీసులతో 'ఏఓబీ'గా పిలవబడిన ఆంధ్ర–ఒడిస్సా సరిహద్దున, ఒక్కొక్క పవర్ ప్రాజెక్టు వల్ల 3,000 మందికి ఉపాధి లభిస్తుంది. ఏదేమైనా–ఏటిట్యూడ్ ఈజ్ ఎవ్రి థింగ్ (దృక్పథమే సమస్తమూ) అనేది, అన్ని కాలాలకు వర్తించే పాత సూక్తి.

*వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత*

# పదేళ్లకోసారైనా ఆధార్ అప్‌డేట్!

### ప్రభుత్వాలందించే సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

**సాక్షి, అమరావతి:** మీరు ఆధార్ తీసుకొని పదేళ్ల పైనే అయ్యిందా? ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆధార్ కార్డులో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోలేదా? అయితే, వీలైనంత త్వరగా ఆధార్ కార్డులో మీ తాజా ఫొటో, అడ్రస్ తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ కార్డుల జారీ సంస్థ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) సూచిస్తోంది. ఇందుకు గాను ఆధార్ ఆన్‌లైన్ పోర్టల్‌లో 'అప్‌డేట్ డాక్యుమెంట్' పేరుతో కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ప్రభుత్వాలు ఇప్పుడు ఏ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నా.. లబ్ధిదారుల ఎంపికకు ఆధార్‌ను కూడా ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. మరోవైపు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోకపోతే లావాదేవీలను నిలిపివేసే అవకాశముందంటూ వివిధ బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నాటి మన ఫొటోతో పాటు ప్రస్తుత చిరునామా.. ఆధార్‌లోని చిరునామా సరిపోలక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆధార్ ఆధారంగా



కొనసాగుతున్న సేవలకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆధార్ పోర్టల్‌లో 'అప్‌డేట్ డాక్యుమెంట్' ద్వారా ఫొటో, ఇతర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ సూచిస్తోంది. ఈ మేరకు ప్రజలకు అవగాహన కలిగించి.. వివరాలు అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి.సంగీత ఇటీవల ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అండమాన్ నికోబార్ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు.

### రాష్ట్రంలో సచివాలయాల ద్వారా..

రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు దీనిపై అవగాహన కలిగిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఆధార్ సేవల ద్వారా వీలైనంత త్వరగా అందరి ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించేందుకు చర్యలు చేపట్టారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల ద్వారా సచివాలయాల సిబ్బందికి, వలంటీర్లకు దీని గురించి సమాచారమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1,950 సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలకు అవగాహన కల్పించడంతో పాటు ఆధార్ కార్డులలో వారి వివరాలు అప్‌డేట్ చేసేందుకు సహకరించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ కార్యాలయం ఆదేశించింది.

## దుర్గమ్మ దసరా ఆదాయం రూ.3.95 కోట్లు

### మరో రెండు రోజులు కొనసాగనున్న లెక్కింపు



**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగిన దసరా ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు ప్రారంభమైంది. మంగళవారం జరిగిన లెక్కింపులో రూ.3,95,06,500 నగదుతోపాటు 532 గ్రాముల బంగారం, 13.680 కిలోల వెండి లభించిందని ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు. 22 హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన లెక్కింపులో సేవా సిబ్బందితోపాటు ఆలయానికి చెందిన వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. బుధ, గురువారాల్లోనూ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ఆలయాల్లో మూలమూర్తులను సంరక్షించాలి

- విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి
- ఆలయాల్లో పురాతన వైభవం పరిరక్షణపై సదస్సు

**సింహాచలం:** పంచారామాది ఆలయాల్లో మహిమాన్వితమైన మూల మూర్తులు విచ్ఛిన్నమైతే రాష్ట్రానికి అరిష్టమని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి చెప్పారు. అర్చక కుటుంబాలకు కూడా అది మంచిది కాదని తెలిపారు. మూలమూర్తులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. పంచారామాది ఆలయాల్లో పురాతన వైభవం దెబ్బతినకుండా చేపట్టాల్సిన చర్యలపై విశాఖ శ్రీ శారదా పీఠం మంగళవారం విస్తృత స్థాయి చర్చ నిర్వహించింది. పంచారామ, శైవక్షేత్రాల పండితులతో అవగాహన సదస్సు నిర్వహించింది. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరిజవహర్‌లాల్, డిప్యూటీ కమిషనర్లు, కార్యనిర్వహణాధికారులు, పండితులు,



పంచారామాది ఆలయాలపై సూచనలు చేస్తున్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

అర్చకులు, అర్చక అకాడెమీ అర్చక డైరెక్టర్ వేదాంతం చక్రవర్తి పాల్గొన్నారు. పంచారామ క్షేత్రాల నుంచి వచ్చిన ఆలయవర్గాలు ఆయా క్షేత్రాల్లో జరుగుతున్న పూజా విధానాలు, అభిషేకాదుల గురించి వివరించారు. అభిషేకాల వల్ల మూల మూర్తుల విగ్రహాలు విచ్ఛిన్నమవుతున్న తీరుపై అందరూ ఆందోళన వ్యక్తంచేశారు. ముందు జాగ్రత్తగా ఆయా ఆలయాల్లో చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి పలు ప్రతిపాదనలు చేశారు. పంచారామాల్లోని శివలింగాలు శుద్ధ శిలతో కూడినవని తెలిపారు. మూల మూర్తులపై వెండి లేదా బంగారు తొడుగులను పెట్టి కేవలం శుద్ధ జలాలతోనే అభిషేకాలు చేయాలని చెప్పారు.

## కోర్టు కేసుల వల్లే పదోన్నతులు ఆలస్యం

### దేవదాయ శాఖ ఉద్యోగుల పదోన్నతులపై మంత్రి సత్యనారాయణ

**సింహాచలం:** దేవదాయ శాఖలోని ఉద్యోగులు ఒకరిపై ఒకరు కోర్టుల్లో కేసులు వేసుకోవడం వల్లే పదోన్నతులపై నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. అవి తొలిగిపోతే అందరికీ పదోన్నతులు లభిస్తాయని.. రెవెన్యూ నుంచి అధికారులను దేవదాయ శాఖకు డిప్యుటేషన్‌పై తెచ్చే పరిస్థితి ఉండదన్నారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవదాయ శాఖ ఉద్యోగులంతా తన కుటుంబసభ్యులేనని చెప్పారు. వారంతా తమ భేదాభిప్రాయాలను వీడి.. కోర్టు కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు. అప్పుడు పదోన్నతులు లభించి అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. సింహాచలం దేవస్థానానికి త్వరలో పూర్తిస్థాయి ఈవోని నియమిస్తామన్నారు. సింహాచలం, అన్నవరం దేవస్థానాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రసాద్ స్కీమ్ నిధులు త్వరలోనే విడుదలవుతాయని చెప్పారు. ఈ విషయమై ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మరిన్ని రుణాలందించాలి

### ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి బుగ్గన

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కొనియాడారు. రైతులకు పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కౌలు రైతులకు మరిన్ని రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు. సచివాలయంలో మంగళవారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) 220వ సమావేశం మంత్రి బుగ్గన అధ్యక్షతన జరిగింది. ఇందులో ప్రధానంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక అమలులో బ్యాంకులు సాధించిన ప్రగతి, సూచికలవారీ సాధించిన లక్ష్యాలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా రంగాలు (ఎంఎస్‌ఎంఈ)పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన



నేపథ్యంలో ఆ రంగంలో కూడా బ్యాంకులు సహకరించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలన్నారు. అలాగే టిడ్కో గృహాలు, ఇతర గృహనిర్మాణ పథకాల లబ్ధిదారులకు బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరులో పూర్తి తోడ్పాటు అందించాలని బ్యాంకర్లను కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ నవనీత్ కుమార్ జూన్ 30 వరకు బ్యాంకులు సాధించిన ప్రగతిని వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్, కంట్రీ హెడ్ ఫర్ అగ్రికల్చర్ శ్రీనివాసరావు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్. రావత్, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్, ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి అనిల్ మిశ్రా, నాబార్డు జీఎం ఎస్‌ఎస్ మూర్తి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, వివిధ బ్యాంకులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి పరిశీలనతో సమస్యలకు పరిష్కారం

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



**సాక్షి, అమరావతి:** ఎస్సీ వసతి గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారులు(డీడీ)లతో రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ వార్డెన్లు హాస్టళ్లలో నివాసం ఉండకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. రాష్ట్రంలోని 1,015 హాస్టళ్లు ఉంటే 500 హాస్టళ్లను నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాల అమలును సమీక్షించిన మంత్రి అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధితులైన 2,051 మందికి రూ.85 వేల నుంచి రూ.8.25 లక్షల వరకు సాయం అందించినట్లు చెప్పారు. 17 లక్షల ఎస్సీ కుటుంబాలకు ఉచిత విద్యుత్, 53 వేల మంది చర్మకారులు, డప్పు కళాకారులకు నెలకు రూ.3 వేల పింఛన్ అందిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మీ, డైరెక్టర్ కె.హర్షవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనానికి 30 గంటలు

### తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 32 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 83,223 మంది శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోగా.. 36,658 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.4.73 కోట్లు సమర్పించారు. దర్శనానికి 30 గంటలు.. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది.

**తిరుమలేశుని సేవలో ప్రముఖులు**



ధ్వజస్తంభానికి మొక్కుతున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

శ్రీవారిని మంగళవారం పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్, విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాలతో సత్కరించారు.

## గ్రహణం రోజుల్లో శ్రీవారి ఆలయం మూత

**తిరుమల:** ఈ నెల 25న సూర్యగ్రహణం, నవంబర్ 8న చంద్రగ్రహణం కారణంగా ఆయా రోజుల్లో 12 గంటల పాటు తిరుమల శ్రీవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. 25న సాయంత్రం 5.11 నుంచి 6.27 గంటల వరకు సూర్యగ్రహణం ఉంటుంది. ఈ కారణంగా ఉదయం 8.11 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. అలాగే, నవంబర్ 8న మధ్యాహ్నం 2.39 నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉన్న కారణంగా ఉదయం 8.40 నుండి రాత్రి 7.20 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ రెండు రోజులూ ఆలయ తలుపులు తెరిచిన తరువాత సర్వదర్శనం కోసం వేచి ఉన్న భక్తులను మాత్రమే స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ రెండు రోజులూ బ్రేక్ దర్శనం, శ్రీవాణి, రూ.300 దర్శనం, ఇతర ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. గ్రహణం రోజుల్లో తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ఇతర ప్రాంతాల్లో కూడా అన్నప్రసాద వితరణ ఉండదు. హోటళ్లు కూడా గ్రహణం పూర్తయ్యే వరకు మూసి ఉంచుతారు. దీనికనుగుణంగా తిరుమల యాత్రను రూపొందించుకోవాలని భక్తులను టీటీడీ కోరింది.

## రూ.2 కోట్ల విలువ చేసే బంగారం డాలర్ల విక్రయం

**తిరుమల:** తిరుమలలోని శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ బంగారం, వెండి, రాగి డాలర్ల విక్రయ కేంద్రంలో మంగళవారం రికార్డు స్థాయిలో ఒకే రోజు రూ.2 కోట్ల విలువైన బంగారం డాలర్లను భక్తులు కొనుగోలు చేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు ఎంతో ఇష్టంగా అమ్మవారు, శ్రీవారు ఉండే బంగారం డాలర్లు కొనుగోలు చేస్తుంటారు. శ్రీవారి సన్నిధిలో బంగారం కొనుగోలు చేస్తే మహాలక్ష్మి కటాక్షం లభిస్తుందనేది భక్తుల విశ్వాసం. ఇందులో భాగంగానే భక్తులు రోజూ బంగారం, వెండి, రాగి డాలర్లు కొనుగోలు చేస్తుంటారు. మంగళవారం డాలర్ల విక్రయ కేంద్రంలో 10 గ్రాముల బంగారం డాలర్లు దాదాపు 400 కొనుగోలు చేయడం విశేషం.

## ఐబీఎస్ గ్లోబల్‌తో వీఐటీ-ఏపీ ఒప్పందం

**విజయవాడ:** పోలాండ్‌కు చెందిన ఐబీఎస్ గ్లోబల్‌తో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఆంధ్రప్రదేశ్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వీఐటీ-ఏపీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆధునిక సాంకేతికతతో పాటు ఆవిష్కరణలకు అవసరమైన సహకారాన్ని ఐబీఎస్ గ్లోబల్ అందజేస్తుందని వీఐటీ-ఏపీ వైస్ చాన్సలర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసే స్టార్టప్‌లకు ఆర్థిక సహకారం విషయంలో ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐబీఎస్ గ్లోబల్ ప్రతినిధి రామ్‌తేజ వెనిగళ్ల, వర్సిటీ ఐఆఈసీ డైరెక్టర్ అమిత్ చవాన్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### నన్ను తిట్టే పనిని కాంగ్రెస్ ఔట్‌సోర్స్‌కిచ్చింది: మోదీ

**జమ్కాన్‌దోర్నా:** కాంగ్రెస్ పార్టీ తనను తిట్టే బాధ్యతను ఔట్‌సోర్సింగ్‌కు అప్పగించిందంటూ ఆమ్ ఆద్మీ పార్టీనుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. గుజరాత్ గ్రామాల్లో నిశ్శబ్దంగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని బీజేపీ శ్రేణులను హెచ్చరించారు. ప్రధాని మంగళవారం రాజ్‌కోట్ జిల్లా జమ్కాన్‌దోర్నా పట్టణంలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. 'ప్రతిపక్ష పార్టీ నిశ్శబ్ద వ్యూహంపై మిమ్మల్ని హెచ్చరిస్తున్నా. దీని వెనుక ఢిల్లీ నుంచి గుజరాత్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేసేవారు ఉన్నారని నాకు తెలుసు. ఒక గ్రూపు మొత్తం మనకు వ్యతిరేకంగా గోల చేస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

### టీఎంసీ ఎమ్మెల్యే అరెస్ట్

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయుల నియామకం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మాణిక్ భట్టాచార్యను మంగళవారం తెల్లవారుజామున ఈడీ అరెస్ట్ చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రాథమిక విద్య బోర్డు మాజీ చైర్మన్ అయిన భట్టాచార్యను సోమవారం రాత్రంతా ఈడీ అధికారులు ప్రశ్నించారు. విచారణకు సహకరించక పోగా తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించడంతో అదుపులోనికి తీసుకున్నట్టు చెప్పారు.

### తలాక్ వ్యాజ్యాలపై సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** తలాక్-ఎ-హసన్‌తో పాటు అన్ని రకాలైన తలాక్‌లనూ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలంటూ దాఖలైన పలు వ్యాజ్యాలను న్యాయమూర్తి జస్టిస్ ఎస్.కె.కౌల్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణకు స్వీకరించింది. వీటిపై నాలుగు వారాల్లో స్పందించాల్సిందిగా కేంద్రం, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను 2023 జనవరి మూడో వారానికి వాయిదా వేసింది.

### 'చెల్లో షో' నటుని మృతి



**అహ్మదాబాద్:** ఈసారి భారత్ తరఫున ఆస్కార్ అవార్డు రేసులో నిలిచిన గుజరాతీ సినిమా చల్లో షో (చివరి షో)లో హీరో మిత్రునిగా నటించిన 17 ఏళ్ల రాహుల్ కోలీ బ్లడ్ క్యాన్సర్‌తో చనిపోయాడు. నాలుగు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను అక్టోబర్ 2న చనిపోయినట్టు తండ్రి రాము మంగళవారం తెలిపారు. చల్లో షో అక్టోబర్ 14న విడుదల కావాల్సి ఉంది. సినిమాను వెండితెరపై చూడాలని తన కొడుకు ఎంతగానో ఆశపడ్డాడంటూ ఆవేదన వెలిబుచ్చారు. రాము ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వారి స్వస్థలం జామ్‌నగర్ జిల్లాలోని హాపా. స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి ఆడిషన్ ద్వారా రాహుల్‌ను దర్శకుడు నళిన్ ఎంపిక చేసుకున్నాడు. చల్లో షో సినిమాను ప్రాణంగా ప్రేమించే ఓ తొమ్మిదేళ్ల బాలుని కథ.

### పోటీ చేయాలని ఒక్కరోజు ముందు చెప్పారు: ఖర్గే

**పట్నా:** కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో పోటీ చేయాలని తనకు కేవలం నామినేషన్ వేయడానికి 18 గంటల ముందు చెప్పారని పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం చెప్పారు. బహుశా గాంధీ కుటుంబం నుంచి ఎవరూ అధ్యక్ష పగ్గాలు చేపట్టొద్దని రాహుల్ భావించడం వల్లే తనను పోటీ చేయమన్నారని అభిప్రాయపడ్డారు. "కానీ రాహుల్ సారథ్యం పార్టీకి చాలా అవసరమన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ ఆయన సెంటిమెంట్లను గౌరవిస్తా" అని చెప్పుకొచ్చారు. తాను అధ్యక్షుడినైతే పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలే తొలి ప్రాథమ్యంగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికను పార్టీ అంతర్గత వ్యవహారంగా అభివర్ణించారు. ఎంపీ శశిథరూర్ కూడా అధ్యక్ష ఎన్నిక బరిలో దిగడం తెలిసిందే.

### శివసేన షిండే వర్గానికి రెండు కత్తులు, డాలు గుర్తు

**న్యూఢిల్లీ:** శివసేన షిండే వర్గానికి రెండు కత్తులు, డాలు గుర్తు కేటాయించినట్లు ఎన్నికల సంఘం మంగళవారం తెలిపింది. షిండే వర్గం శివసేనను 'బాలాసాహెబంచి శివసేన'గా గుర్తిస్తూ సోమవారం ఈసీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈసీ నిర్ణయంపై సీఎం షిండే హర్షం వ్యక్తం చేశారు. తమదే అసలైన శివసేన అని, విల్లు, బాణం గుర్తును తమకే కేటాయించాలంటూ మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, సీఎం ఏక్‌నాథ్ షిండే ఈసీని ఆశ్రయించారు. అయితే, ప్రస్తుతానికి ఆ గుర్తును రెండు వర్గాలకు ప్రస్తుతానికి కేటాయించలేమంటూ ఈసీ స్పష్టం చేసింది. ఉద్ధవ్ వర్గం శివసేనను శివసేన-ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రేగా ఈసీ గుర్తించడం, ఆ పార్టీకి కాగడా గుర్తును కేటాయించడం తెలిసిందే.

### పెద్ద... గుమ్మడి



అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని హాఫ్ మూన్ బే సిటీలో జరిగిన పోటీల్లో ఏకంగా 2,560 పౌండ్ల బరువైన గుమ్మడి కాయను ప్రదర్శించి జాతీయ రికార్డును బద్దలుకొట్టిన ట్రావిస్ జింజర్ అనే ఉద్యాన వన ఉపాధ్యాయుడు

# సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్

**సీజేఐ జస్టిస్ లలిత్ సిఫార్సు**
- ప్రధాని, రాష్ట్రపతి ఆమోదం లాంఛనమే
- నవంబర్ 9న బాధ్యతల స్వీకరణ
- రెండేళ్లపాటు సీజేఐగా పదవీకాలం
- అత్యధిక కాలం సీజేఐగా రికార్డు ఆయన తండ్రి వైవీ చంద్రచూడ్‌దే
- తండ్రీకొడుకులిద్దరూ సీజేఐ కావడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి

**సాక్షి, న్యూఢిల్లీ:** భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ నియమితులు కానున్నారు. ఆయన పేరును సిఫార్సు చేస్తూ సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ మంగళవారం ఫుల్ కోర్టు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఈ మేరకు కేంద్రానికి లేఖ రాశారు. కేంద్ర న్యాయ శాఖకు ప్రతిపాదన పంపారు. న్యాయ శాఖ దాన్ని ప్రధాని పరిశీలనకు పంపనుంది. ప్రధాని, తర్వాత రాష్ట్రపతి ఆమోదం అనంతరం జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా నియమితులవుతారు. జస్టిస్ లలిత్ నవంబర్ 8న పదవీ విరమణ చేయనున్నారు. 9న జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా ప్రమాణం చేస్తారు. 2024 నవంబర్ 10 దాకా రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగుతారు. ఆయన తండ్రి జస్టిస్ వైవీ చంద్రచూడ్ కూడా సీజేఐగా చేయడం విశేషం! ఆయన 1978 నుంచి 1985 దాకా ఏకంగా ఏడేళ్ల పాటు అత్యధిక కాలం సీజేఐగా పని చేశారు. తండ్రీకొడుకులిద్దరూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కావడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.

ప్రగతిశీల భావాలున్న న్యాయమూర్తిగా పేరొందిన జస్టిస్ చంద్రచూడ్ న్యాయవాదుల కుటుంబం నుంచి వచ్చారు. 1959 నవంబర్ 11న జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్, ప్రభ దంపతులకు మహారాష్ట్రలో జన్మించారు. ముంబైలోని కేథడ్రల్, జాన్‌కానన్‌లో పాఠశాల విద్య. 1979లో ఢిల్లీలో ఆర్థిక, గణిత శాస్త్రాల్లో ఆనర్స్ డిగ్రీ పూర్తి చేశారు. 1982లో ఢిల్లీలో న్యాయ పట్టా పొందారు. 1983లో హార్వర్డ్ లా స్కూల్ నుంచి ఎల్ఎల్ఎం పట్టా పొందారు. 1986లో హార్వర్డ్‌లో డాక్టరేట్ ఆఫ్ జ్యూరిడికల్ సైన్స్ చదివారు. బాంబే హైకోర్టులో, సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1998లో సీనియర్ న్యాయవాదిగా పదోన్నతి పొందడంతోపాటు సుప్రీంకోర్టులో అదనపు సొలిసి



టర్ జనరల్‌గా నియమితులయ్యారు. 2000లో బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013లో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2016లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక చైర్మన్‌గా ఉన్నారు. ఆయన ఇద్దరు కుమారులు అభినవ్, చింతన్ కూడా లాయర్లే.

**భిన్నాభిప్రాయాల వెల్లడికి వెనకాడరు**

విచారణ సమయంలో తన అభిప్రాయాలు వెల్లడించడానికి వెనకాడని న్యాయమూర్తిగా జస్టిస్ చంద్రచూడ్‌కు పేరుంది. మానవహక్కులు, లింగ సమానత్వం, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, క్రిమినల్, రాజ్యాంగ చట్టాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, వికలాంగుల హక్కులు, ఆధార్, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, గోప్యత హక్కు, అయోధ్య భూ వివాదంపై కీలక తీర్పులిచ్చారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి అనుమతిచ్చి సంచలనం సృష్టించారు. రుతుక్రమం కారణంగా ఆలయంలోకి రానివ్వకపోవడం మహిళల ప్రాథమిక హక్కులకు భంగకరమని తీర్పు చెప్పారు. వివాహితులైన ఇద్దరు మేజర్లు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకోవడం చట్ట విరుద్ధం కాదంటూ వివాహేతర సంబంధాలపైనా సంచలన తీర్పు వెలువరించారు. కరోనా సమయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ను గుర్తుచేస్తూ ప్రభుత్వ వైద్య సాయం నిరాకరించకూడదని పేర్కొన్నారు. అవివాహితలకు కూడా 24 వారాల దాకా అబార్షన్ చేయించుకునే హక్కు కల్పిస్తూ తాజాగా తీర్పు ఇచ్చారు.

**తండ్రి తీర్పులనే తిరగరాశారు**

కిస్సా కుర్సీకా అనే సినిమాకు సంబంధించిన కేసులో నాడు జస్టిస్ వైవీ చంద్రచూడ్ కాంగ్రెస్ నేత సంజయ్‌గాంధీని జైలుకు పంపారు! అయితే వ్యభిచారం, గోప్యత హక్కులకు సంబంధించి ఆయన ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ చంద్రచూడ్ తోసిపుచ్చడం విశేషం! 1976లో ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసులో అత్యవసర సమయాల్లో పౌరులకు ప్రాథమిక హక్కులుండవంటూ జస్టిస్ వైవీ చంద్రచూడ్ తీర్పు ఇచ్చారు. దాన్ని 2016లో జస్టిస్ చంద్రచూడ్ కొట్టేశారు.



ములాయం అంత్యక్రియలకు తరలివచ్చిన అశేష జన సందోహం

# అశ్రునయనాల నడుమ ములాయం అంత్యక్రియలు

- స్వగ్రామంలో అధికార లాంఛనాల నడుమ ముగిసిన కార్యక్రమం
- రాజ్‌నాథ్, సీఎంలతో పాటు పలువురు ప్రముఖుల హాజరు

**సైఫై (యూపీ):** సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అంత్యక్రియలు ఉత్తరప్రదేశ్‌లోని ఆయన స్వగ్రామమైన సైఫైలో మంగళవారం అధికార లాంఛనాలతో జరిగాయి. నేతాజీ అమర్ రహే నినాదాల మధ్య ములాయం కుటుంబసభ్యులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ములాయం కుమారుడు, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చితికి నిప్పంటించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దేశ నలు మూలల నుంచి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు, అశోక్ గెహ్లాట్, భూపేశ్ భగేల్, వామపక్ష నేతలు ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరి, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్, నటుడు అభిషేక్ బచ్చన్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక మేలా గ్రౌండ్స్‌లో ఉంచిన ములాయం భౌతికకాయానికి లక్షలాది మంది తరలి వచ్చి నివాళులర్పించారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే.

# ఉజ్జయిని నిండా ఆధ్యాత్మికతే

**మహాకాల్ కారిడార్‌ను ప్రారంభించిన మోదీ**

**ఉజ్జయిని:** ప్రధాని మోదీ మంగళవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో మహాకాల్ కారిడార్ మొదటి దశను ప్రారంభించారు. అనంతరం, ధోతి, గమ్‌చా ధరించి ప్రఖ్యాత మహాకాళేశ్వరాలయం గర్భగుడిలో పూజలు చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. వలసపాలన సంకెళ్లను తొలగించుకుంటున్నామని, సాంస్కృతిక ప్రాముఖ్యత గల ప్రాంతాల సమగ్ర అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. 'ఉజ్జయినిలోని ప్రతి అణువులోనూ ఆధ్యాత్మికత ఉంటుంది. ఉజ్జయిని ప్రతి మూలలో దైవిక శక్తి ప్రసారం అవుతుంది. భారత దేశ శ్రేయస్సు, జ్ఞానం, గౌరవం, సాహిత్యానికి వేలాది సంవత్సరాలుగా ఉజ్జయిని సారథ్యం వహించింది' అని పేర్కొన్నారు. 'పునరుద్ధరణతో నవకల్పన వస్తుంది. వలస పాలనలో కోల్పోయిన వాటిని దేశం పునర్నిర్మిస్తోంది, గత కీర్తిని పునరుద్ధరించుకుంటోంది' అని ప్రధాని చెప్పారు. మహాకాల్ కారిడార్ ప్రాజెక్ట్ ఉజ్జయిని చైతన్యాన్ని పెంచుతుందని అన్నారు. చార్‌ధామ్ యాత్రను ఏడాదంతా జరుపుకునేలా రహదారులను అభివృద్ధి చేశామన్నారు. అంతకుముందు, ఉజ్జయిని చేరుకున్న ప్రధాని మోదీకి కారిడార్ వద్ద సాధువులు, మత పెద్దలు స్వాగతం పలికారు. వారికి నమస్కరించుకుంటూ ఆయన ముందుకు సాగారు. అనంతరం 'శివలింగం' నమూనాను రిమోట్ బటన్ నొక్కి ఆవిష్కరించి, మహాకాల్ లోక్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. బ్యాటరీ కారులో వెళ్తూ ఆయన కారిడార్‌ను పరిశీలించారు. మల్లకంభం విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. కారిడార్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్‌లు ఆ ప్రాంతానికి మరింత శోభనిచ్చాయి. కారిడార్ ప్రారంభంలో కొద్ది దూరంలో నంది ద్వార్, పినాకి ద్వార్ ఏర్పాటు చేశారు. ప్రధాని వెంట గవర్నర్ మంగూ భాయ్ పటేల్, సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి సింధియా ఉన్నారు.



మహాకాళేశ్వరుని సమక్షంలో మోదీ జపం



రిమోట్ నొక్కి శివలింగాకృతిని ఆవిష్కరించడం ద్వారా మహాకాల్ కారిడార్ తొలిదశను జాతికి అంకితంచేస్తున్న మోదీ

**కారిడార్ విశేషాలివీ...**

- ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటి. ఇక్కడి మహా కాళి ఆలయం అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటి. ఇలా జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలగలిసి ఉన్న మహాక్షేత్రాలు ఉజ్జయిని, కాశీ, శ్రీశైలం మాత్రమే.
- మత పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా మహా కాళేశ్వరాలయ అభివృద్ధి కోసం దేశంలోనే పొడవైన మహాకాల్ లోక్ కారిడార్‌కు కేంద్రం శ్రీకారం చుట్టింది.
- కారిడార్ పొడవు 900 మీటర్లు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.856 కోట్లు.
- రూ.351 కోట్లతో తొలి దశ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.
- మొత్తం 108 అందమైన పిల్లర్లతో కారిడార్‌ను నిర్మిస్తున్నారు.
- ఈ పిల్లర్లపై శివుని ఆనంద తాండవంతో పాటు మరెన్నో శివపార్వతుల భంగిమలను చెక్కుతున్నారు.
- ప్రధాన ద్వారం నుంచి ఆలయం దాకా 93 శివుని విగ్రహాలతో శివపురాణాన్ని చిత్రించారు. ప్రతి విగ్రహంపైనా క్యూఆర్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే సంబంధిత సమాచారమంతా వస్తుంది.
- ప్రాజెక్టులో భాగంగా రుద్రసాగర్ వంటి హెరిటేజ్ నిర్మాణాలను కూడా పునరుద్ధరించి సుందరీకరిస్తున్నారు.
- ఆలయాన్ని క్షిప్రా నదితో అనుసంధానించేందుకు 152 భవనాలను సేకరించారు.
- ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కృత్రిమ మేధ సాయంతో మొత్తం ప్రాంతంపై నిరంతర నిఘా ఉంటుంది.
- ఈ క్షేత్రాన్ని ఏటా కోటిన్నరకు పైగా భక్తులు సందర్శిస్తుంటారు. కారిడార్ పూర్తయ్యాక ఈ సంఖ్య రెట్టింపవుతుందని అంచనా.
- కారిడార్ ప్రాజెక్టు స్థానికంగా ఎంతోమందికి ఉపాధి కూడా కల్పించనుంది. దీనివల్ల నగర ఆర్థికానికి కూడా ఊపు లభించనుంది.

# కేరళలో నరబలి

- ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయని దారుణం
- పోలీసుల అదుపులో దంపతులు సహా ముగ్గురు

**కొచ్చి:** కేరళలో దారుణం జరిగింది. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయనే మూఢ నమ్మకంతో దంపతులు ఏకంగా ఇద్దరు మహిళలను బలిచ్చారు. ఈ ఘటన పత్తినంతిట్ట జిల్లాలో వెలుగు చూసింది. కొచిలోని కడవంతర, సమీపంలోని కాలడికి చెందిన ఇద్దరు మహిళలు లాటరీ టికెట్లు అమ్ముకుని పొట్టపోసుకునేవారు. వీరిలో ఒకరు జూన్, మరొకరు సెప్టెంబర్ నుంచి కనిపించకుండా పోయారు. వారి సెల్ నంబర్లు, టవర్ లొకేషన్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. మహిళలిద్దరినీ పత్తనంతిట్ట జిల్లా తిరువల్లలో ఉండే మసాజ్ థెరపిస్ట్ భగావల్ సింగ్, అతడి భార్య లైలా బలి ఇచ్చినట్లు తేలింది. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి, సంపన్నులు కావాలంటే నరబలి తప్పదని వారి మిత్రుడైన పెరుంబవరూర్‌కు చెందిన రషీద్ అలియాస్ ముహమ్మద్ షఫీ సలహా ఇచ్చాడు. ఇతడే బాధిత మహిళలకు డబ్బు ఆశ చూపి భగావల్ సింగ్ ఇంటికి తీసుకువచ్చాడు. ఆ ఇంట్లోనే మంత్రాలు చేసి, ఒకరిని జూన్‌లో మరొకరిని సెప్టెంబర్‌లో గొంతుకోసి చంపారు. అనంతరం షఫీ సాయంతో మృతదేహాలను ముక్కలుగా నరికి సొంతింటి ఆవరణలో, ఇలాంతూర్‌లో పాతిపెట్టారు. సింగ్ దంపతులతోపాటు షఫీని మంగళవారం కస్టడీలోకి తీసుకున్నట్లు కొచి నగర పోలీస్ కమిషనర్ నాగరాజు చకిలం పీటీఐకి చెప్పారు. కాలడికి చెందిన మహిళ ఆచూకీ తెలుసుకునే క్రమంలోనే రెండో ఘటన వెలుగు చూసిందన్నారు. వీటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఐజీ పి.ప్రకాశ్ అన్నారు. స్థానికంగా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే భగావల్ సింగ్ ఈ దారుణానికి పాల్పడ్డానే విషయం నమ్మలేకపోతున్నామని స్థానికులు అంటున్నారు. అధికార సీపీఎంకు చెందిన భగావల్ సింగ్ మహిళలను బలి ఇవ్వడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా మండిపడ్డాయి.



మూఢ నమ్మకానికి బలైన మహిళలు (ఫైల్)

### రోడ్డుపైనే రాహుల్ బస్కీలు

**సాక్షి, బళ్లారి:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కర్ణాటకలో చిత్రదుర్గం జిల్లాలోకి ప్రవేశించింది. యాత్ర 34వ రోజు మంగళవారం ఉదయం వర్షం కారణంగా గంటపాటు ఆలస్యంగా మొదలైంది. హర్తికోటె నుంచి భారీ జన సందోహం మధ్య పాదయాత్ర ప్రారంభించారు. అందరినీ పలకరిస్తూ, చేయి ఊపుతూ పాదయాత్ర కొనసాగించారు. చెళ్లకెరె తాలూకాలో విద్యార్థులు ఆయనతో పాటు నడిచారు. గ్రామాల్లో ఇళ్లపై నుంచి జనం తిలకించారు. మధ్యలో భోజన విరామ సమయంలో రెండు చేతులూ లేని ఓ దివ్యాంగురాలు రాహుల్‌ను కలిశారు. కాగితంపై కాలితో ఆమె రాయడం చూసి ఆయన ఆశ్చర్యపోయారు. మరోచోట రాహుల్ పిల్లలు, స్థానికులతో కలిసి రోడ్డుపైనే బస్కీలు తీశారు. సనికెరె వద్ద రాహుల్‌ను ఆశా, ఉపాధి హామీ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు కలిశారు. 'దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం మన కూతుళ్లకు సమాన అవకాశాలు, భద్రత, గౌరవం తప్పక కల్పించాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ అనంతరం ట్వీట్ చేశారు. యాత్రలో తనతో కలిసిన విద్యార్థినుల ఫొటోను షేర్ చేశారు.



# కర్ణాటకలో దళితులపై అరాచకం

- 16 మందిని నిర్బంధించి 15 రోజుల పాటు చిత్రహింసలు
- ప్లాంటేషన్ యజమాని నిర్వాకం
- నిందితుని కోసం పోలీసుల గాలింపు

**చిక్కమగళూరు:** కర్ణాటకలోని చిక్కమగళూరులో ఓ వ్యక్తి తన ప్లాంటేషన్‌లో దళితులను నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసిన ఘటన సంచలనం రేపుతోంది. జగదీశగౌడకు జెనుగడ్డె గ్రామం వద్ద కాఫీ ప్లాంటేషన్ ఉంది. ఇతడి నుంచి రోజువారీ కూలీలైన బాధితులు రూ.9 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ సొమ్మును తిరిగి చెల్లించలేకపోవడంతో మొత్తం 16 మందిని జగదీశ తన ప్లాంటేషన్‌లో నిర్బంధించాడు. జగదీశ గౌడ దెబ్బలతో ఒక మహిళకు గర్భస్రావం అయింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితులు జగదీశ గౌడ, అతడి కుమారుడు తిలక్ కోసం గాలింపు చేపట్టారు. తమ బంధువులను జగదీశ గౌడ చిత్రహింసలు పెడుతున్నారంటూ కొందరు వ్యక్తులు ఈనెల 8వ తేదీన ఫిర్యాదు చేశారు. మరుసటి రోజే ఆ ఫిర్యాదును వారు వెనక్కి తీసుకున్నారని బలెహొన్నూర్ పోలీసులు చెప్పారు. ఆ మరునాడు బాధితురాలైన గర్భవతిని ఆస్పత్రిలో చేర్పించి, చిక్కమగళూరులో మరోసారి వీరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో తాము వెళ్లి బందీలుగా ఉన్న నాలుగు కుటుంబాలకు చెందిన మొత్తం 16 మందిని విడిపించామన్నారు. వీరిని 15 రోజులుగా నిర్బంధంలోనే ఉంచినట్లు తేలిందన్నారు. వీరిలో రెండు నెలల గర్భవతి అయిన అరిత కూడా ఉంది. జగదీశ గౌడ ఈమె ఫోన్ లాగేసుకుని ఒక రోజు నిర్బంధించాడని, కొట్టడంతో గర్భస్రావం అయిందని ఆమె తల్లి ఆరోపించింది. జగదీశ గౌడ నుంచి అడ్వాన్స్ డబ్బులు తీసుకున్న వారు ఎటో వెళ్లిపోవడంతో అతడు తమను నిర్బంధించినట్లు బాధితులు తెలిపారని చిక్కమగళూరు ఎస్పీ ఉమా ప్రశాంత్ చెప్పారు. కాగా, జగదీశ గౌడబీజేపీ నేత అంటూ వచ్చిన వార్తలను బీజేపీ ఖండించింది. జగదీశ గౌడతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ జిల్లా ప్రతినిధి వరసిద్ధి వేణుగోపాల్ తెలిపారు.



# ఉక్రెయిన్‌పై క్షిపణుల మోత

- ఇంధన కేంద్రాలపై రష్యా దాడులు
- 20 మంది మృతి, వందల్లో క్షతగాత్రులు
- ఉక్రెయిన్ నుంచి యూరప్‌కు కరెంటు కట్

**కీవ్:** రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మరింత భీకర రూపం దాల్చింది. రష్యా, క్రిమియాలను కలిపే కెర్చ్ వంతెనపై బాంబు పేలుళ్లకు ప్రతీకారంగా దాడులను రష్యా మంగళవారం మరింత తీవ్రతరం చేసింది. ఉక్రెయిన్ నగరాలే లక్ష్యంగా సోమవారం ఏకంగా 84 క్షిపణులతో విరుచుకుపడటం తెలిసిందే. మంగళవారం ఉక్రెయిన్‌లోని మిలటరీ కమాండ్ సెంటర్లు, ఇంధన కేంద్రాలే లక్ష్యంగా భారీ దాడులకు దిగింది. దాంతో జెలెన్‌స్కీ ప్రభుత్వం యూరప్ దేశాలకు విద్యుత్ సరఫరాను నిలిపేయాల్సి వచ్చింది. సుదూర ప్రాంతాలను ఛేదించే దీర్ఘ శ్రేణి క్షిపణులతో రష్యా విధ్వంసం సృష్టిస్తోంది. క్షిపణి దాడుల తో లివీవ్ నగరం అల్లాడుతోంది. వేలాది మంది బంకర్లలో తలదాచుకుంటున్నారు. మంగళవారం దాడుల్లో 20 మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. మరోవైపు ఉక్రెయిన్‌కు అండగా గగనతల రక్షణ వ్యవస్థలను తరలించడానికి అమెరికా, జర్మనీ అంగీకరించాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యాధునికమైన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను పంపుతామని హామీ ఇచ్చారు.

**ఫేస్‌బుక్‌పై ఉగ్ర ముద్ర**

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంల మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్ కంపెనీని ఉగ్రవాద సంస్థగా రష్యా ప్రకటించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు అది ఊతమిస్తోందని ఆరోపిస్తోంది.

### రష్యాకు వ్యతిరేకంగా భారత్ ఓటు

**ఐరాస:** ఐక్యరాజ్యసమితిలో భారత్ మరోసారి రష్యాకు వ్యతిరేకంగా ఓటేసింది. ఉక్రెయిన్‌లో నాలుగు ప్రాంతాలను రష్యా దురాక్రమించడాన్ని వ్యతిరేకిస్తూ ఐరాస సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానంపై రహస్య ఓటింగ్ నిర్వహించాలన్న రష్యా డిమాండ్‌ను భారత్ తిరస్కరించింది. దీనిపై జరిగిన ఓటింగ్‌లో మరో 100కు పైగా దేశాలతో కలిసి రష్యాకు వ్యతిరేకంగా ఓటేసింది. ఉక్రెయిన్‌లోని లుహాన్స్క్, డొనెట్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలను రష్యా విలీనం చేసుకోవడాన్ని ఖండిస్తూ అల్బేనియా తీర్మానం ప్రవేశపెట్టింది. దీనిపై రష్యా రహస్య ఓటింగ్ డిమాండ్‌ను భారత్ సహా 107 సభ్య దేశాలు తిరస్కరించాయి. 13 దేశాలు రష్యా డిమాండ్‌కు అనుకూలంగా ఓటేయగా చైనా సహా 39 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.



సిక్కుల నాలుగో గురువు గురు రామ్‌దాస్ జయంతి సందర్భంగా విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్న అమృత్‌సర్ స్వర్ణదేవాలయం



## యోగా పోటీలు ప్రారంభం

ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో కొండపావులూరులో సౌత్, సౌత్ సెంట్రల్ జోన్ యోగా, వన్ మినిట్ డ్రిల్ పోటీలను 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్ ఖాన్ మంగళవారం ప్రారంభించారు. -8లో▸



## వైజాగ్‌కు ఏసీ స్లీపర్ బస్సు

బస్టాండ్: ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ నుంచి విశాఖపట్నానికి వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును మంగళవారం ప్రారంభించింది.



## ప్రభుత్వాస్పత్రే బెస్ట్

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్‌లో కార్పొరేట్‌కు మించిన స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. -8లో▸

## న్యూస్‌రీల్

### దుర్గగుడి ఘాట్‌రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): భారీ వర్షాల నేపథ్యంలో దుర్గగుడి ఘాట్‌రోడ్డును ఆలయ అధికారులు మూసివేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఘాట్‌రోడ్డును మూసివేయడంతో పాటు భక్తులను కనకదుర్గానగర్, మహామండపం మీదగా కొండ పైకి అనుమతించారు. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద చెట్టు విరిగి పడటంతో పాటు చిన్న చిన్న రాళ్లు జారిపడ్డాయి. ఉదయం నుంచి పలు మార్లు భారీ వర్షం కురవడంతో కొండ రాళ్లు జారిపడే ప్రమాదం ఉండటం, మరో వైపున దసరా ఉత్సవాల నిమిత్తం ఏర్పాటు చేసిన క్యూలైన్ల తొలగింపు పనుల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఘాట్‌రోడ్డును మూసి వేసినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం వాతావరణ పరిస్థితులను పరిశీలించి ఘాట్‌రోడ్డుపై రాకపోకలను అనుమతిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

### బాలికలను ప్రోత్సహించాలి



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఇంటికి దీపం, సృష్టికి మూలమైన ఆడపిల్లలను ప్రోత్సహించి అన్ని రంగాలలో ముందుండేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు స్వీట్లు అందజేసి నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా సంరక్షణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా శిశు సంక్షేమ ద్వారా బాల్య దశ నుంచే వారి ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోందన్నారు. ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ఆపదలో ఉన్న బాలికలు చైల్డ్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం బాలల సంరక్షణపై రూపొందించిన 'మన సమయం వచ్చింది.. మన హక్కులు సాధిద్దాం.. భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం' అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు. కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, సీడీపీఓలు జి. మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

### 37,978 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,141 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 37,978 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.27,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చికి రూ.10,000 నుంచి రూ.26,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,500 నుంచి రూ.27,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,901 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

## పారిశుద్ధ్యం భళా



ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు వివిధ రూపాలలో దర్శనమిచ్చిన దుర్గమ్మను దర్శించి తరించారు. అనేక మంది భవానీ మాలధారులు కృష్ణా ఒడ్డున పుణ్య స్నానాలు ఆచరించి, దీక్ష విరమణలు చేశారు. ఆ సందర్భంగా ఘాట్‌లు భవానీ వస్త్రాలతో నిండిపోయింది. వాటిని తొలగించడం.. ఘాట్‌లను శుభ్రం చేయడంలో పారిశుద్ధ్య సిబ్బంది కృషి ఎనలేనిది. దానికి ఈ చిత్రాలే నిదర్శనం. ఇందులో ఒకటి భవానీ ఉత్సవాల చివరి రోజు కృష్ణవేణి ఘాట్ వద్ద తీసినది కాగా.. మరొకటి అదే ఘాట్ వద్ద మంగళవారం తీసినది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



# కీలెంచి.. మేలెంచు

- రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థరైటిస్ రోగులు
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40వేల మంది వరకూ బాధితులు
- నిర్లక్ష్యం చేస్తే కీళ్ల మార్పిడికి దారితీసే అవకాశం
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ డే



మారుతున్న జీవన శైలి.. ఆహారపు అలవాట్లు.. శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం వంటి కారణాలు అనేక రకాల రోగాలకు కారణమవుతున్నాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఆర్థరైటిస్ అంటే కీళ్ల దగ్గర వచ్చే రుగ్మత. ఇందులో చాలా రకాలు ఉంటాయి. ఏదో కీళ్లలో నొప్పి వచ్చింది కదా అని నిర్లక్ష్యం చేసి పెయిన్‌కిల్లర్ వేసుకుంటే సరిపోదు. వీటిని వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో అవసరం. నేడు 'వరల్డ్ ఆర్థరైటిస్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వారంలో వంద మంది వరకూ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న రోగులు వస్తున్నారు. వారిలో వయస్సు రీత్యా వచ్చే ఆస్టియో ఆర్థరైటిస్ రోగులు ఎక్కువగా ఉంటుండగా, రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్ విభాగంలో ఈ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆర్థరైటిస్‌కు ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు రుమటాలజిస్టులు సైతం నగరంలో అందుబాటులో ఉన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఆర్థరైటిస్ రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆర్థరైటిస్ కారణంగా కీళ్ల అరిగిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40 వేల మంది వరకూ రోగులు ఉన్నట్లు అంచనా.

**తొలిదశలో గుర్తిస్తేనే..**

ఆర్థరైటిస్ ఎలా వస్తుందో కచ్చితమైన కారణం తెలియని ఆటో ఇమ్యూన్ వ్యాధి. తొలిదశలో గుర్తిస్తే కీళ్ల అరుగుదలకు దారితీయకుండా అదుపులో ఉంచవచ్చు. 45 ఏళ్లు దాటిన వారిలో ఆస్టియో ఆర్థరైటిస్ వస్తుండగా, రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఏ వయస్సు వారికైనా వచ్చే అవకాశం ఉంది. వీటితో పాటు, గౌట్, సోరియాసిస్ ఆర్థరైటిస్ స్పాండెలో ఆర్థరైటిస్, లూపస్ వంటి 12 రకాలుగా ఈ వ్యాధి ఉంటుంది. ఇది సోకినట్లు తొలిదశలో గుర్తించి మందులు వాడితే దాని ద్వారా వచ్చే దుష్ఫలితాలను నివారించవచ్చు. లేకుంటే లూపస్ వంటివి గుండె, కిడ్నీలపై ప్రభావం చూపి ప్రాణాంతకంగా మారతాయి.

### ఈ లక్షణాలుంటే జాగ్రత్త..




- థైరాయిడ్ ఉన్న వారికి, అబార్షన్స్ అయిన మహిళలకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. 16–45 ఏళ్ల మహిళలకు రావచ్చు.
- కీళ్లనొప్పులు, వాపులు ఉండటం, ఉదయాన్నే వేళ్లు, కీళ్లు పట్టేసినట్లు ఉండటం వంటి లక్షణాలను గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- ముఖ్యంగా తొలిదశలోనే ఏ రకమైన ఆర్థరైటిస్ సోకిందో తెలుసుకోవాలి.
- వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వాడటం, వ్యాయామం, ఆహార నియమాలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా అదుపులో ఉంచవచ్చు.

### వారానికి వంద మంది..



ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం ఓపీకి వారానికి వంద మంది వరకూ ఆర్థరైటిస్ రోగులు వస్తుంటారు. వారిలో ఎక్కువగా వయస్సు రీత్యా వ్యాధి వచ్చిన రోగులు ఉంటారు. వారిలో కీళ్లు అరిగిన వారు కూడా ఉంటున్నారు. ఏ వయస్సు వారికైనా రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావచ్చు. కీళ్లు అరిగిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. సకాలంలో గుర్తించి మందులు వాడాలి. - డాక్టర్ పి.పవన్‌కుమార్, ప్రొఫెసర్, ఆర్థో విభాగం, జీజీహెచ్

### ఏ రకమో గుర్తించడం ముఖ్యం..



ఆర్థరైటిస్ 12 రకాలు ఉన్నాయి. వాటిలో రోగికి ఏ రకమైన ఆర్థరైటిస్ సోకిందో తెలుసుకుని మందులు వాడాల్సి ఉంటుంది. కొందరికి ఆరునెలలు, ఏడాది పాటు మందులు వాడితే తగ్గిపోతుంది. మరికొందరు దీర్ఘకాలికంగా మందులు వాడాల్సి ఉంటుంది. లక్షణాలను తొలిదశలో గుర్తించి మందులు వాడితే దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చు. - డాక్టర్ వడ్లమూడి నరేంద్ర, రుమటాలజిస్ట్

# గడప వద్దకే వైద్యం

- అదే 'ఫ్యామిలీ డాక్టర్' లక్ష్యం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో డీఎంహెచ్‌వో సుహాసిని, ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుపై ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు సంపన్నవర్గాలు మాత్రమే ఉపయోగించుకుంటున్నాయన్నారు. పేద ప్రజలకు కూడా అంటువంటి సేవలను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విధానానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. నడవలేని స్థితిలో వైద్య సేవల కోసం ఆస్పత్రులకు చేరుకోలేని వారికి నేరుగా గడప వద్దకే వైద్య సేవలను అందించడమే ఫ్యామిలీ డాక్టర్ విధాన లక్ష్యమన్నారు.

- ఈ విధానం ద్వారా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులను ఏర్పాటు చేయనున్నామన్నారు.
- వారిలో ఒకరు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్యం అందిస్తారని, మరొకరు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తారన్నారు.
- జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.
- ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వైద్యులు, సిబ్బంది 104 వాహనం ద్వారా గ్రామాలలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు.
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తారన్నారు.
- అనంతరం గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య శ్రీ ద్వారా అందుకున్న సేవల వివరాలపై రోగుల నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికలను పొందుపరుస్తారని చెప్పారు.

**అవగాహన కల్పించాలి..**

నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ఫ్యామిలీ డాక్టర్ విధానంపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. సుహాసిని, డాక్టర్ నళినిదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ, డీఈవో సీవీ రేణుక, డీపీవో జె.సునీత పాల్గొన్నారు.

# 26 నుంచి కార్తిక మాసోత్సవాలు

**27న దుర్గమ్మకు గాజుల అలంకరణ**



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 23వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఉత్సవాలను బాలాలయంలో నిర్వహిస్తారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయం, నటరాజ స్వామి వారి ఆలయంలో సాయంత్రం వేళ ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సహస్ర లింగార్చన, సాయంత్రం 6 గంటలకు దీపోత్సవ సేవ నిర్వహిస్తారు.

- 25వ తేదీ సూర్య గ్రహణం నేపథ్యంలో ఉదయం 11 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల ద్వారాలను మూసివేస్తారు. 26న ఉదయం 6 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి దర్శనాలు ప్రారంభం అవుతాయి. 26వ తేదీ తెల్లవారు జామున నిర్వహించే అన్ని ఆర్జిత సేవలను దేవస్థానం రద్దు చేసింది. సాయంత్రం వేళ పంచహారతుల సేవ, పల్లకీ సేవలను మాత్రమే నిర్వహిస్తారు.

**గాజులతో ముస్తాబు..**

ఈ నెల 27వ తేదీ గురువారం దుర్గమ్మకు గాజులతో విశేషంగా అలంకరించనున్నారు. గాజుల ఉత్సవంలో భాగంగా దాతలు, భక్తులు సమర్పించిన గాజులను అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణాన్ని అలంకరిస్తారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లుగా కేవలం అమ్మవారి ప్రధాన ఆలయానికే పరిమితమైన ఈ ఉత్సవం ఈ ఏడాది వైభవంగా నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ఆలయ ఈవో భ్రమరాంబతో వైదిక కమిటీ మంగళవారం సమావేశమై చర్చించింది. ఉత్సవం ముగిసిన తర్వాత గాజులను అమ్మవారి ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేయనున్నారు. 29వ తేదీ నాగుల చవితిని పురస్కరించుకుని కొండపై సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**నవంబర్ 7న కోటి దీపోత్సవం**

నవంబర్ 7వ తేదీన కార్తిక పౌర్ణమి సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. మల్లికార్జున మహా మండపంతో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కోటి దీపాలను వెలిగిస్తారు. రాజగోపురం ఎదుట జ్వాలా తోరణాన్ని ఆలయ అర్చకులు వెలిగిస్తారు.

## రేపు స్పాట్ అడ్మిషన్లు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ డిప్లొమా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 13వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసినా, రాయకపోయినా ఈ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 12, 13 తేదీల్లో కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



విజయవాడ బందరురోడ్డులో వర్షం

## వరుణ విహారం

వరుణుడు వీర విహారం చేస్తున్నాడు. ఎడతెరిపి లేకుండా వర్షాన్ని కురిపిస్తున్నాడు. మధ్య మధ్యలో సూర్య భగవానుడు నేనూ ఉన్నా అంటూ ప్రకాశించేందుకు ప్రయత్నిస్తున్నా.. కరి మబ్బుల ముసుగు నుంచి బయటకు రాలేక మిన్నకుండిపోతున్నాడు. ఫలితంగా రెండు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం 9.08 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవగా.. అత్యధికంగా విజయవాడ ఈస్ట్‌లో 30.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కృష్ణా జిల్లాలో 9.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవగా, అత్యధికంగా బంటుమిల్లిలో 27.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఉయ్యూరులో 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

- చిలకలపూడి/గాంధీనగర్





# వాస్తవికత ప్రతిబింబించాలి

'గ్రామదర్శిని'పై అధికారులకు కలెక్టర్ రంజిత్ బాషా దిశా నిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో జేసీ మహేష్‌కుమార్, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామదర్శిని కార్యక్రమ నిర్వహణకు నియమితులైన అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి.. ఉన్నది ఉన్నట్లుగా వాస్తవ నివేదికలు ఇవ్వాలని కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గ్రామదర్శినిపై అధికారులతో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామదర్శిని కార్యక్రమానికి సంబంధించి జిల్లా యంత్రాంగం నుంచి అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 5గంటల్లోపు సంబంధిత అధికారులకు మెసేజ్ వస్తుందన్నారు. ఉదయం ఆ గ్రామానికి వెళ్లి ఇచ్చిన ప్రొఫార్మా ప్రకారం అన్ని అంశాలపై తనిఖీ చేయాలన్నారు. ఇందుకోసం 75 మంది అధికారులను నియమించామన్నారు. 14వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**ఏం చేయాలంటే..**

'అధికారులు గ్రామానికి వెళ్లి రహదారుల సౌకర్యం, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ తదితర అవసరాలను పరిశీలించాలి. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రపరుస్తున్నారో లేదో తనిఖీ చేయాలి. తాగునీటి వనరుల వద్ద నీటి పరీక్షలు నిర్వహించాలి. క్లాప్ మిత్రాలు ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ ఏ విధంగా జరుగుతుందో చూడాలి. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, పాఠశాలలు, సచివాలయం తనిఖీ చేయాలి. సంక్షేమ వసతిగృహాల్లో సిబ్బంది హాజరు పరిశీలించి, విద్యార్థులకు అందజేస్తున్న ఆహారపదార్థాలు మెనూ ప్రకారం ఉన్నదీ, లేనిదీ చూడాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులకు పౌష్టికాహారం అమలు తీరును పరిశీలించాలి' అని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు.

**యాప్‌లో అప్‌లోడ్..**

గ్రామాల్లో తనిఖీలు పూర్తయిన అనంతరం సమస్యలను ఫొటోలతో సహా గ్రామదర్శిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. వీటిని పరిశీలించిన సంబంధిత అధికారులు ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. తొలుత ఆయా శాఖల అధికారులు శాఖాపరంగా పరిశీలించాల్సిన అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, డీఆర్వో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో ఎంవీ నాగేశ్వర్‌నాయక్, డీఆర్డీఏ పీడీ వరప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, బీసీ సంక్షేమశాఖ డీడీ సీహెచ్ లక్ష్మీదుర్గ, హౌసింగ్ పీడీ శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): అర్హత కలిగిన దివ్యాంగులు మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్లలోపు ఉండి సదరం ధ్రువీకరణ పత్రంలో 70 శాతం అంతకంటే ఎక్కువ వికలాంగత్వంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. గతంలో సొంత వాహనం ఉండకూడదన్నారు. డిగ్రీ విద్యార్థినీ, విద్యార్థులు, 10వ తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి పథకం, వేతనం పొందుతూ కనీసం సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. మహిళలకు 50 శాతం, ఎస్సీలకు 16 శాతం, ఎస్టీలకు 7 శాతం చొప్పున వాహనాలు మంజూరు చేస్తారన్నారు. అర్హతలు ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత పత్రాలతో దరఖాస్తును మచిలీపట్నం కలెక్టరేట్ ఆవరణలోని కార్యాలయంలో అందజేయాల్సి ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం 08672–252637లో సంప్రదించాలని ఆయన కోరారు.

## గంజాయి సరఫరా చేసే ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**పెనమలూరు:** గంజాయి సరఫరా చేసి విక్రయించే ఇద్దరు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్న పెనమలూరుకు చెందిన షేక్ జానీబాషా, నందమూరుకు చెందిన బొర్రా చందును పెనమలూరు శివారులో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులు గత కొద్ది కాలంగా నర్సీపట్నం, మారేడుమిల్లి ప్రాంతాల నుంచి గంజాయి తీసుకు వచ్చి మండల పరిధిలో విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు.

## హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్టు

**గుణదల (విజయవాడ తూర్పు):** నిర్లక్ష్యంగా కారు నడిపి ఒకరి మృతికి కారణమైన నలుగురు నిందితులను విజయవాడ మాచవరం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఈ నెల 8వ తేదీన విజయవాడ క్రీస్తురాజపురంలో కంకణాల చొడేశ్వరరావు అనే వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా దేశి సురేష్‌ను కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. నిందితునితో పాటు కారులో ఉన్న క్రీస్తురాజపురం సున్నపు బట్టీల సెంటర్‌కు చెందిన పి.శ్రీనివాసరావు (30), మొగల్రాజపురం ప్రాంతానికి చెందిన కె.భాగ్యరాజు (29), గుణదల విజయనగర్ కాలనీకి చెందిన బి.అశోక్ లను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.

## భూ వివాదంపై రేపూడి వీఆర్‌ఓ సస్పెన్షన్

**ఎ.కొండూరు:** మండలంలోని రేపూడి వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న షేక్ నాగుల్‌మీరాను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సస్పెండ్ చేశారు. రేపూడి గ్రామానికి చెందిన బి.వెంకయ్య 40 సంవత్సరాల క్రితం పి.అప్పయ్య అనే వ్యక్తి నుంచి 1.03 సెంట్ల భూమిని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి తన భూమిని వెంకయ్య సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే వెంకయ్య కొనుగోలు చేసిన భూమిని అతనికి తెలియకుండా వేరే వారి పేర్లపై నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేయించడంతో వెంకయ్య మనస్తాపానికి గురై ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గంపలగూడెం మండలం రాజవరానికి జగనన్న భూహక్కు-సమగ్ర రీ సర్వే కార్యక్రమం పరిశీలించటానికి వచ్చిన కలెక్టర్ ఢిల్లీరావు రేపూడి భూ వివాదంపై ప్రాథమిక విచారణ చేసి, ముందుగా వీఆర్‌ఓను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆర్ఐ, తహసీల్దార్‌లపై విచారణకు జాయింట్ కలెక్టర్‌ను నియమించినట్లు తెలిపారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న టపాసులతో సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్‌ఐ దుర్గారావు

**కంకిపాడు:** అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి టపాసులను కంకిపాడు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్‌ఐ వై.దుర్గారావు కథనం మేరకు..మండలంలోని మంతెన గ్రామంలో చిమటా శివరామకృష్ణ ఇటీవల మంగళగిరి నుంచి టపాసులు కొనుగోలు చేసి అక్రమంగా గోదాములో నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు సంబంధిత గోదాముపై దాడి చేసి సుమారు రూ.3 లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్‌ఐ దుర్గారావు తెలిపారు.

# పక్షవాతం రోగులకు ప్రభుత్వాస్పత్రే బెస్ట్

- జీజీహెచ్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌కు ఆధునిక వైద్యం
- పది పడకలతో స్ట్రోక్ యూనిట్
- వారంలో మూడు రోజులు న్యూరాలజీ ఓపీ
- అవసరమైతే ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్


స్ట్రోక్ యూనిట్, యూనిట్‌లో రోగులకు పరీక్ష చేస్తున్న వైద్యుల బృందం

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** బ్రెయిన్‌స్ట్రోక్(పక్షవాతం) రోగులకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి పెద్దదిక్కులా మారింది. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన స్ట్రోక్ యూనిట్‌లో కార్పొరేట్‌కు మించిన స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన స్ట్రోక్ యూనిట్ పక్షవాతానికి గురైన రోగులకు వరప్రదాయినిలా మారింది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో 24/7 వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేకాదు స్ట్రోక్‌కు గురైన నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి వచ్చిన స్ట్రోక్ రోగులకు థ్రోంబలైసిస్ ఇంజక్షన్స్ ఇస్తూ, ఎలాంటి వైకల్యం లేకుండా చూస్తున్నారు. న్యూరాలజీ విభాగంలో రోగులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా, ఐదు సూపర్‌స్పెషాలిటీ సీట్లు కూడా మంజూరుకోసం నేషనల్ మెడికల్ కమిషన్‌కు దరఖాస్తు చేయడం గమనార్హం.

**వారంలో మూడు రోజుల ఓపీ**

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో నిర్వహిస్తున్న న్యూరాలజీ ఓపీ వారంలో మూడు రోజుల(మంగళ, గురు, శని) పాటు నిర్వహిస్తున్నారు. ఈ ఓపీకి వారానికి 900 నుంచి 1100 మంది వరకూ రోగులు వస్తుంటారు. వారిలో 300 మంది గతంలో బ్రెయిన్‌స్ట్రోక్‌తో మందులు వాడే వారు ఉంటారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారు రెగ్యులర్‌గా మందులు వాడాల్సి ఉన్నందున వారికి ప్రత్యేకంగా పరీక్షలు చేసి మందులు ఇస్తుంటారు.అవసరమైతే రిపీట్ ఎంఆర్ఐ, సీటీ స్కాన్ చేస్తుంటారు.

**10 పడకల స్ట్రోక్ యూనిట్**

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో 20 పడకలతో న్యూరాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో 10 పడకలతో న్యూరో ఐసీయూ(స్ట్రోక్‌యూనిట్)ను ఈ ఏడాది ఏప్రిల్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఆ యూనిట్‌లో బ్రెయిన్‌స్ట్రోక్(పక్షవాతం) రోగులకు మెరుగైన సేవలు అందిస్తారు. ఇక్కడ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణతో పాటు, వెంటిలేటర్లు, మల్టీపారామీటర్లు, సెంట్రల్ ఆక్సిజన్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు మించిన స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

**24/7 సేవలు**

బ్రెయిన్ స్ట్రోక్ రోగులు ఎప్పుడైనా ఆస్పత్రికి రావచ్చు. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి వస్తే, వారికి అవసరమైన సీటీ, ఎంఆర్ఐ స్కాన్ తీస్తారు. అందుకోసం 24 గంటలూ ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ అందుబాటులో ఉంటాయి. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌తో పాటు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలు అందిస్తున్నారు. నెలకు వంద మంది వరకూ న్యూరాలజీ వార్డులో చేరుతుంటే, వారిలో 50 మంది బ్రెయిన్‌స్ట్రోక్ రోగులు ఉంటున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఇక్కడకు వచ్చిన రోగికి పూర్తిగా స్వస్థత చేకూరుస్తూ వారికి భరోసా ఇస్తున్నారు.

### అత్యాధునిక సౌకర్యాలు



స్ట్రోక్ యూనిట్‌లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారు క్యాజువాలిటీకి వస్తే, అక్కడ లక్షణాలను గుర్తించి సీటీ, ఎంఆర్ఐ స్కాన్ చేస్తారు. అవసరమైతే స్ట్రోక్ యూనిట్‌లో అడ్మిట్ చేస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కూడా వారికి ఓపీలో ఫాలోఅప్ మెడిసిన్స్ అందిస్తున్నారు. ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ బి సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ జీజీహెచ్

### స్ట్రోక్‌పై అవగాహన పెరగాలి



బ్రెయిన్ స్ట్రోక్(పక్షవాతం)పై ప్రజల్లో అవగాహన పెరగాలి. స్ట్రోక్ లక్షణాలను గుర్తించి నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి చేరగలిగితే సత్వర వైద్యంతో వైకల్యం రాకుండా చూడవచ్చు. ఆస్పత్రిలో పది పడకలతో స్ట్రోక్ యూనిట్(న్యూరో ఐసీయూ) అందుబాటులో ఉండటంతో మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం.

– డాక్టర్ జి.ఇవాంజెలిన్ బ్లెస్సీ, న్యూరాలజిస్ట్

## ఎన్‌డీఆర్‌ఎఫ్ సౌత్, సౌత్ సెంట్రల్ జోన్ యోగా పోటీలు


ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ జాహిద్ ఖాన్

**గన్నవరం రూరల్:** విపత్తుల సమయంలో జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) నిర్వహించే పాత్ర అనిర్వచనీయమని 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్ ఖాన్ అన్నారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, సౌత్ సెంట్రల్ జోన్ యోగా, వన్ మినిట్ డ్రిల్ పోటీల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తుల నుంచి ప్రజలను రక్షించే సమయంలో జవాన్‌లలో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 3, 4, 5 బెటాలియన్‌ల జవాన్‌లతో పాటు 10వ బెటాలియన్ జవాన్‌లు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ముఖ్య అతిథి జాహిద్‌ఖాన్‌కు సైనిక వందనం చేశారు. ఈ పోటీల్లో యోగాసన, కళాత్మక యోగా, కళాత్మక యోగా జంటగా, రిథమిక్ యోగా, యోగా నృత్య పోటీలు జరుగుతాయని వివరించారు. వన్ మినిట్ డ్రిల్ పోటీల్లో 11 ఈవెంట్స్ నిర్వహిస్తామని, విపత్తుల సమయంలో ఉపయోగించే పరికరాలపై పోటీ ఉంటుందని తెలిపారు.

# శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి నాగేశ్వరరావు, చిత్రంలో డీఎం పెద్దిరాజు

**మచిలీపట్నంటౌన్:** ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వచ్చే కార్తిక మాసంలో శైవ క్షేత్రాల యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే కార్తిక మాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. బృందాలుగా వచ్చే భక్తులకు బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. శబరిమలైకు కూడా బృందాలుగా వచ్చే భక్తులకు ఐదు రోజుల ప్యాకేజీలో బస్సులను నడుపుతామన్నారు. బృందాలుగా వచ్చే వారికి ఏడు సీట్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రత్యేక బస్సు రేట్లనే వసూలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**బందరు, గుడివాడ బస్టాండుల అభివృద్ధి**

దసరా సందర్భంగా జిల్లా నుంచి 315 బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు 1.88 లక్షల కిలోమీటర్ల దూరం తిప్పామన్నారు. ఈ సర్వీసుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేశామన్నారు. ఈ సర్వీసుల ద్వారా రూ.67.30 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు మచిలీపట్నం, గుడివాడ బస్టాండ్ల అభివృద్ధికి శ్రీకారం చుడుతోందన్నారు. మచిలీపట్నం బస్టాండ్‌ను రూ.3.4 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. బస్టాండ్‌లోని ఆరు ప్లాట్‌ఫారాల అభివృద్ధి, కార్గోకు ప్రత్యేక భవనం, అధునాతన హంగులతో టాయిలెట్స్, వెయిటింగ్ హాలు నిర్మిస్తామన్నారు. గుడివాడ బస్టాండు గ్యారేజీ పనులు రూ.8 కోట్లతో జరుగుతున్నాయని నవంబరులో అందుబాటులోకి వస్తుందన్నారు. ఆ తరువాత బస్టాండ్ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జిల్లాకు కొత్తగా 43 బస్సులు మంజూరు కాగా వీటిలో 19 బస్సులు మొదటి విడతలో తిప్పుతున్నామని, రెండో విడతలో 24 బస్సులను తిప్పుతామన్నారు. ఆరు నాన్ ఏసీ స్లీపర్ బస్సులు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు నడుపుతామన్నారు. నవంబరులో 24 కొత్త బస్సులు జిల్లాకు వస్తాయన్నారు. పామర్రు బస్టాండ్ అభివృద్ధి కోసం రూ.98 లక్షల వ్యయం కలిగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. నిధులు రాబట్టేందుకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. మచిలీపట్నం బైపాస్ రోడ్డు ద్వారా నాన్‌స్టాప్‌లను తిప్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బస్సుల్లో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడటం, మాదకద్రవ్యాలు తీసుకోవటం వంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడి దుర్మరణం


మృతుడు హరికృష్ణ


**పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట):** పెనుగంచిప్రోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై నవాబుపేట క్రాస్‌రోడ్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్యపేటకు చెందిన గంధసాని హరికృష్ణ(37) ఆర్మీలో జవాన్‌గా పనిచేసి వీఆర్ తీసుకుని జగ్గయ్యపేట పట్టణంలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం నందిగామ వైపు నుంచి జగ్గయ్యపేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో గుండె నొప్పి రావటంతో వాహనాన్ని పక్కకు తీసే క్రమంలో డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైకు అదుపు తప్పి యువకుడు...


మృతుడు మోహన్‌రావు

**జి.కొండూరు:** బైకు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయిన ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.వివరాలలోకి వెళ్తే...మైలవరానికి చెందిన గోలి మోహన్‌రావు(30) మంగళవారం సాయంత్రం జి.కొండూరు మండల పరిధిలోని కందులపాడు వైపు నుంచి జి.కొండూరు వైపు తన బైకుపై వస్తుండగా ముత్యాలంపాడు గ్రామ శివారులోకి రాగానే బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు.ఈ ఘటనలో మోహన్‌రావు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న ఎస్‌ఐ ధర్మరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.మృతుడు మోహన్‌రావుకి వివాహమై భార్య ఉంది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


సుబ్బారావు మృతదేహం

**అవనిగడ్డ:** స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకోటిపురానికి చెందిన బడే సుబ్బారావు (62) మరణించిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం సుబ్బారావు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించుకుని సైకిల్‌పై ఆసుపత్రి గేటు నుంచి బయటకు వస్తుండగా నాగాయలంక వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు అక్కడికక్కడే మరణించారు. మృతుని కుమార్తె భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొర్రెల కాపరి అనుమానాస్పద మృతి

**మచిలీపట్నంటౌన్:** గొర్రెల కాపరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పూసల కృష్ణ అనే గొర్రెల కాపరి జీవాలను మేపటంతో పాటు అప్పుడప్పుడు పీతలు పడుతూ ఉంటాడు. వారం రోజుల క్రితం పీతలు పట్టేందుకు సముద్రపు ఒడ్డున ఉన్న మడ అడవుల మధ్యకు వెళ్లాడు. గొర్రెలు మేపేందుకు వెళ్లి వారం రోజులకు ఒకసారి ఇంటికి రావటం అలవాటు కావటంతో కుటుంబ సభ్యులు వస్తాడులే అని పట్టించుకోలేదు. అయితే గొర్రెల కాపరులు గొర్రెలను కాస్తూ పీతలు పట్టుకునేందుకు మడ అడవుల మధ్యకు వెళ్లగా కృష్ణ శవమై కనిపించాడు. దీంతో వారు కృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బందరు రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో బాలుడు...


మృతి చెందిన చాట్ల శశాంక్ దేవ్

**పాయకాపురం (విజయవాడ రూరల్):** వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌లో తండ్రితో కలసి ఉంటున్న చాట్ల శశాంక్ దేవ్(14) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు ఏసీపీ జీవీ రమణమూర్తి తెలిపారు. పాయకాపురం పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన బాలుని మృతికి సంబంధించి వివరాలను తెలియజేశారు. మృతి చెందిన బాలుడు శశాంక్ ఎత్తు నుంచి కిందికి పడటం వలన చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం జరిగి మృతి చెందినట్లు ప్రభుత్వాసుపత్రి పోస్టుమార్టం రిపోర్టు వచ్చిందన్నారు. మృతుని గుండె, ఊపిరితిత్తులు బలహీనంగా ఉన్నట్టు ఏసీపీ తెలియజేశారు. వాంబేకాలనీ హెచ్ బ్లాక్ నాల్గవ అంతస్తులో సీ ఎఫ్ పోర్షన్‌లో నివసిస్తున్న ప్రైవేటు ఆసుపత్రిలో డ్రైవర్‌గా పనిచేసే చాట్ల చక్రవర్తి భార్య ప్రియదర్శినితో ఏర్పడిన విభేదాల కారణంగా 2014వ సంవత్సరం నుంచి కొడుకు చాట్ల శశాంక్ దేవ్(14), కుమార్తె శాంతితో కలసి ఉంటున్నారు. శశాంక్ చైతన్య స్కూల్లో ఆరవ తరగతి చదువుతుండగా, కుమార్తె శాంతి 10వ తరగతి చదువుతున్నారు. ప్రియదర్శిని ఆర్టీసీ కండక్టర్‌గా గవర్నపేట 1 డిపోలో పనిచేస్తోంది. మృతుని తల్లి ప్రియదర్శిని ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, మృతుని తండ్రి చక్రవర్తిని విచారిస్తున్నామని చెప్పారు.

## క్లుప్తంగా

### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఐదో డివిజన్ పరిధిలోని క్రీస్తురాజపురంలో ఇటీవల మృతి చెందిన దేశి సురేష్ కుంటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సోదర భావంతో మెలిగే సురేష్ మరణం తీరని లోటన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ.2 లక్షల నగదును దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో నేతలు మట్టా ప్రసాద్, చిత్రం లోకేష్, లామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### అనాథలకు పండ్ల పంపిణీ



కృష్ణలంక(విజయవాడ తూర్పు): స్థానిక నిర్మల శిశుభవన్‌లోని అనాథలకు మంగళవారం కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు పండ్లు పంపిణీ చేశారు. అడపా శేషు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండు శ్రీను, ఎం.నాగేశ్వరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నిమ్మతోట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. శివాలయం వీధి, రావిచెట్టు సెంటర్, దాసరి లింగయ్య వీధి, ఇజ్జాడ అప్పలనాయుడు వీధి, ఆరో డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతం, బ్రహ్మానందరెడ్డి నగర్, నిమ్మతోట సెంటర్, రిలయన్స్ మార్ట్ ఏరియా, రామనాథం వీధి, కృష్ణారావు వీధి, కడియాల వారి వీధుల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



మధురానగర్(విజయవా సెంట్రల్): ఫిజిక్స్ అధ్యాపకుడు నాగేశ్వరరావు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆకాంక్షించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో మంగళవారం కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు నాగేశ్వరరావు డాక్టరేట్ సాధించిన సందర్భంగా అభినందన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్, సిబ్బంది.. నాగేశ్వరరావుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు శైలజ, రాంబాబు, కామేశ్వరి తదితరులు పాల్గొని ఆయన్ను అభినందించారు.

### ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

పెనమలూరు: గోసాలలో చీటీ సొమ్ము విషయమై తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీనిపై ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుతో పోలీసులు మంగళవారం కౌంటర్ కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల పుట్టరోడ్డులో చిట్టిబొమ్మ పార్వతీ కుమార్తె రాధాకుమారి హైదరాబాద్‌లో ఉంటూ ఆన్‌లైన్ వ్యాపారం చేస్తుంది. గత జూలైలో రూ.50 లక్షల చీటీల వ్యాపారం మొదలు పెట్టింది. చీటీలో సభ్యులుగా విజయనగరానికి చెందిన లాయర్ వడ్లేపల్లి శివానంద్ మరి కొందరు సొమ్ము కట్టారు. అయితే చీటీ పాడిన వారికి సొమ్ము ఇవ్వక పోవటంతో వివాదం మొదలైంది. చీటీ సొమ్ము కోసం లాయర్ శివానంద్, మరి కొందరు గోసాల రాధా కుమారి ఇంటికి వెళ్లగా గొడవ జరిగింది. శివానంద్‌పై రాధాకుమారి, వరప్రసాద్, శ్రీనివాసరావు, టి.సుబ్బారావు, టి.లక్ష్మికుమారి మరి కొందరు దాడి చేశారు. లాయర్ శివానంద్‌తో పాటు పలువురికి గాయలయ్యాయి. చీటీ సొమ్ము చెల్లించేందుకు గడువు కోరగా తమపై మోహన్, లాయర్ శివానంద్, మరి కొందరు అసభ్యంగా ప్రవర్తించి దాడి చేశారని చిట్టిబొమ్మ పార్వతీ ఫిర్యాదు చేసింది. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మహిళలకు సంక్షేమ పథకాలు వివరించే పత్రాన్ని అందజేస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల విజయనగర్ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలుచేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులు అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యాసంస్కరణలు ఆమోద యోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం రైతులకు బాసటగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందన్నారు. నగరం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని చెప్పారు. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని గతంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. దాని ప్రకారం రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతున్నాయని వివరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగుతూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను స్థానికులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, రాజు, విజయబాబు, యాసిన్, గణేష్ పాల్గొన్నారు.

## ఇంటి పన్ను చెల్లింపులో లోపాలను సరిచేస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురులో ఇంటి పన్నులు చెల్లింపులో ఉన్న లోపాలు సరి చేసి సకాలంలో పన్నులు కట్టించుకుంటున్నామని కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. యనమలకుదురులో మంగళవారం ఇంటి పన్నులు, ఇతర సమస్యలపై ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఇంటి పన్నులు ఆస్తి ఆధారిత విధానంతో నమోదు చేసి పన్నులు స్వీకరిస్తామన్నారు. పేరులో తప్పులు ఉన్నా, కొత్తగా గృహాలు కొనుగోలు చేసిన వారు దస్తావేజులు అందజేస్తే వివరాలు నమోదు చేసుకుని ఇంటి పన్నుల డిమాండ్లు ఇచ్చి పన్ను కట్టించుకుంటామని స్పష్టం చేశారు.

యనమలకుదురులో ఐదు గ్రామ సచివాలయాల పరిధిలో ఉంటున్నవారు ఇంటి పన్నులు చెల్లించే విషయంలో ఇబ్బందులు వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలువ కట్టలపై ఉన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉండనందున ఇళ్ల విక్రయాలు జరిగిన సమయంలో మారిన పేర్లు వివరాలు రశీదులో ఉండవన్నారు. గతంలో పోల్చితే కాల్వ కట్టల పై ఇంటి పన్నులు గణనీయంగా తగ్గాయన్నారు. చాలా మందికి కేవలం రూ.54 మాత్రమే ఏడాదికి ఇంటి పన్ను వేశామని, చెత్త పన్ను కూడా రూ.30 చేశామని తెలిపారు. కాగా గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు.

### ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కోస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కేక్ కోశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి విలువలు కలిగిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు గల్లా రవికుమార్, భీమిశెట్టి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### సెక్యూరిటీ గార్డుకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద బందరు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో సెక్యూరిటీ గారు గాయపడిన సంఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన ఇందుపల్లి జాన్సన్ కానూరు టైమ్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను సోమవారం రాత్రి డ్యూటీకి బస్సులో వచ్చాడు. అశోక్‌నగర్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. తలకు గాయాలు అవ్వటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీలో ఆటంకాలు పరిష్కరించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీ అమల్లో ఆటంకాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వస్తున్న గ్రీవెన్స్‌పై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలో ఎక్కడా పవర్ ఓవర్ లోడ్ సమస్య ఎదురుకాకుండా జాగ్రత్తలు పాటించాలని, అద్దెదారుల పేర్ల మీద ఉన్న విద్యుత్ మీటర్లను వీలైనంత త్వరగా డీలింక్ చేసి పెన్షనర్లకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పక్కకి ఒరిగి, కాల్వలు, ఇళ్లల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించాలని, మధ్యకట్ట, న్యూఆర్ఆర్‌పేటలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటుచేసి వీధి దీపాలు అమర్చాలని సూచించారు. ఉడాకాలనీ, శ్రీనగర్‌కాలనీ, జీవీఆర్ కాలనీ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈఈ బీవీ సుధాకర్, డీఈలు రవిచంద్ర, శ్రీధర్, బాలాజీ, ఏఈలు పాల్గొన్నారు.

### స్వయం ఉపాధిలో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి చూపడానికి ఈ నెల 13 నుంచి తమ సంస్థ ఆవరణలో శిక్షణ ఇవ్వనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, టూ, త్రీ వీలర్ మెకానిక్ హెల్పర్‌లుగా శిక్షణ ఇస్తామని, ఆసకిఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ 0866–2470420లో గానీ సంప్రదించాలని కోరారు.

# ఆడపిల్లల రక్షణ సామాజిక బాధ్యత



దుర్గాపురంలో అవగాహన ర్యాలీ

సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ఆడపిల్లలంటే సమాజంలో చులకన భావన పోవాలని, వారి రక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, మహిళలు తలచుకుంటే అసాధ్యమైనదేదీ లేదని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఐసీడీఎస్–1, న్యూరాజరాజేశ్వరీపేట అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని దేవినేని వెంకటరమణ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సృష్టికి మూలమే మహిళలపై వివక్ష చూపడం వెర్రితనమే అవుతుందన్నారు. రాష్ట్రంలో ఆడవారికి సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద అన్నయ్యలా, మేనమామలా ఉంటున్నారని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకంలోనూ మహిళలకే ప్రథమస్థానాన్ని ఇస్తున్నారని కొనియాడారు. బాలికల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నాకు కూడా ఇద్దరు ఆడపిల్లలు ... అయినా వారు మగవారికంటే ఎక్కువగా బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు.

డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ఆడవారికి సీఎం జగనన్న అనేక చట్టాలను అందుబాటులోకి తీసుకువచ్చారని, దిశ చట్టంతో బాలికలు, మహిళలకు క్షణాల్లో రక్షణ చర్యలు అందుతున్నాయన్నారు. కార్పొరేటర్ ఇసరపు దేవి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, బెజ్జం రవికుమార్, మల్లెల చెన్నకేశవరెడ్డి, ఇసరపు రాజు, నెల్లి గోవింద్ నాయుడు, చిట్టెమ్మ, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**దుర్గాపురంలో..**

ఆడపిల్లల రక్షణ సామాజిక బాధ్యతని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పిలుపునిచ్చారు. దుర్గాపురంలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ జరిగింది. ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళల రక్షణకు దిశ చట్టం తీసుకొచ్చిన ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేస్తోందన్నారు. అనంతరం దుర్గాపురం వీధుల్లో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని బాల్య వివాహాలు అరికడదాం, బాలికలను చదివిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది ఉమామహేశ్వరి, రవీన, ఉదయలక్ష్మిఊహ తదితరులు పాల్గొన్నారు.

## ● రోడ్లు జలమయం



ఏఎస్ రామారావు రోడ్డుపై వర్షం నీరు



జమ్మిచెట్టు సెంటర్‌లో డ్రెయినేజీ వద్ద పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

స్థానిక ప్రధాన, అంతర్గత రహదారులు మంగళవారం కురిసిన వర్షానికి జలమయంగా మారాయి. ఏఎస్ రామారావు రోడ్డు, నిమ్మతోట సెంటర్, విశాలాంధ్ర రోడ్డు, మధుచౌక్, జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, సిద్ధార్థ నగర్, గాయత్రీనగర్ రోడ్లపై వర్షం నీరు నిలిచింది. జమ్మిచెట్టు సెంటర్‌లో రోడ్డుపై నీటిని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు దగ్గర ఉండి సిబ్బందితో భూగర్భ డ్రైనేజీ ద్వారా వర్షం నీటిని రహదారిపై నుంచి మళ్లించారు.

–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)

# ఉపాధ్యాయులది నిర్మాణాత్మక పాత్ర

**పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి**





మాట్లాడుతున్న దేవానందరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో ఉపాధ్యాయులు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర పాఠశాలల పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యునైటెడ్ యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(యూవైడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. లబ్బీపేటలో సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దేవానందరెడ్డి పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ గురువులేని విద్య వ్యర్థం అని, ప్రతి ఒక్కరికీ రిటైర్‌మెంట్ ఉంటుంది కానీ, ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రం ఉండదన్నారు. వారిని సన్మానించుకోవడం మంచి పరిణామమన్నారు. ప్రతిభ సంస్థ డైరెక్టర్ జె. సుధాకర్, యూవైడబ్ల్యూఓ రాష్ట్ర అధ్యక్షుడు నీల సురేష్, నగర అధ్యక్షుడే పాగోలు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిశంకర్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిన్నింటి బాలకృష్ణ, ఆలపాటి శ్రీకాంత్, టి శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది ఉపాధ్యాయులను సత్కరించారు.

# కాల్వల్లో వ్యర్థాలు వేయొద్దు



ర్యాలీ ప్రారంభిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్**

పటమట(విజయవాడ తూర్పు): నగరంలో నుంచి వెళ్లే కాల్వల్లో చెత్త, వ్యర్థాలు వేయొద్దని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి నగరంలో జరుగుతున్న మిషన్ క్లీన్ కృష్ణ–గోదావరి కార్యక్రమాన్ని సాంబమూర్తి రోడ్డులో మున్సిపల్ సిబ్బందితో నిర్వహించారు.

ఈ నెల 31వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, జల కాలుష్యాన్ని నిరోధించాలని సూచించారు. నగరవాసులు నిత్యం వ్యర్థాలను కాల్వల్లో వేస్తే దిగువ ప్రాంత ప్రజల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు వినియోగించుకునే నీరు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వల్లో పూలు, వ్యర్థాలు, ప్లాస్టిక్, లిక్విడ్ నివాస, వాణిజ్య వ్యర్థాలను వేస్తే అనేక దుష్ఫలితాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రధానంగా కాల్వ వెంట నివసించే ప్రజలు వ్యర్థాలను వీఎంసీ ఏర్పాటు చేసిన డంపర్‌బిన్లలో వేయాలని సూచించారు. అలంకార్ సెంటర్ నుంచి డీ మార్టు వరకు నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వీఎంసీ అధికారులు, హాకర్లు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంతో వికాసం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రామసుబ్బారెడ్డి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సమాజంలో మానవుడు మానసిక ఆరోగ్యంతోనే సంపూర్ణ వికాసాన్ని సాధించగలరని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. కేబీఎన్ కళాశాల కౌన్సిలింగ్ అండ్ సైకలాజికల్ వెల్‌బీయింగ్ సెంటర్, యూజీసీ ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'జీవితంలో ఉన్నత శిఖరాలకు ఏ విధంగా చేరుకోవాలి' అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఐక్యూతో పాటుగా ఈక్యూ చాలా అవసరమన్నారు. జీవితంలో రాణించాలంటే సర్దుకుపోయేతత్వం, సహకరించేగుణం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆర్థిక వనరులు, హోదాలతో వచ్చే సుఖం శాశ్వతమైన సంతోషాన్ని అందించదన్నారు. వీటితో మానసిక సమస్యలు ఎదురవుతాయన్నారు. జీవితంలో రాణించడానికి అవసరమైన పలు ఉదాహరణలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, సీనియర్ అధ్యాపకులు సీహెచ్ శ్రీనివాసరెడ్డి, సైకాలజిస్ట్ కల్యాణి దేవిరెడ్డి, స్టడీస్ సెంటర్ కన్వీనర్ ఎంఎల్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## 350 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుజ్జి)

కంకిపాడు: ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుజ్జి) అన్నారు. వంశీ హార్ట్‌కేర్ సెంటరు ఆధ్వర్యంలో మండలంలోని కోలవెన్నులో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తుమ్మల చంద్రశేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో పాటుగా, దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో 350 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చోరగుడి సురేష్‌కుమార్, ఉప సర్పంచ్ కంచర్ల వెంకటరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి, ఆస్పత్రి ప్రతినిధి రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించండి

పి.నైనవరం (విజయవాడ రూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు తీసుకున్న లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ బి.భార్గవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పి.నైనవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో గృహనిర్మాణాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ భార్గవి మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు తీసుకున్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని, లేని ఎడల ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకొని రద్దు చేసే ప్రమాదం వుందని పేర్కొన్నారు. ఈ లోగా సీపీఎం మండల కార్యదర్శి మాతంగి ఆంజనేయులు మరికొంత మందిని వెంటపెట్టుకొచ్చి మా గ్రామంలోనే ఇళ్లస్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవోఆర్డీ బీవీ శేషగిరిరావు మాట్లాడుతూ వినతి పత్రం అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. సర్పంచి బట్టా సోమయ్య గ్రామస్థులకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మౌనిక తనకు ఇంటి స్థలం ఇవ్వాలని కోరింది. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తదితరులు పాలొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MANGALAGIRI- GUNTUR DISTRICT.
O S No: 59 / 2021.

Between:
Smt. Pamulapati Vijayalakshmi
And .... Plaintiff
M/s. SIGNUM DIGITAL NETWORK PRIVATE LIMITED, Represented by its Director Sri. Korapati Gouri Sankar .... Defendant

DEFENDANT ADDRESS:
M/s. SIGNUM DIGITAL NETWORK PRIVATE LIMITED. Represented by its Director Sri. Korapati Gouri Sankar, 40-13-[illegible], 5th Floor, Sri Rama Chandra Complex, Chandramouli Puram, Vijayawada-5200[illegible]0.

The above Suit is filed by Plaintiff before the Hon'ble Court against Defendant for recovery of money under Different Transactions. The Suit is posted for your appearance on 01/11/2022 at 10.30 AM. Defendant is advised to appear in person or with his Advocate for objections if any in the suit, failing which the Hon'ble Court may be, pass appropriate order against you. This notice is issued according to the Orders of this Hon'ble Court.

DATE OF ADJOURNMENT : 01/11/2022, AT 10.30 AM

YSV PRATAP, SPR KUMAR, Advocates, Rao & Rao Associates, Door No:24-28-6/5, FF-1, Nagendra Towers, Edupuganti Lakshmana Rao Street, Durgapuram, Vijayawada-520 003. Andhra Pradesh. PH: 85000 14509
AP/2135/1998

### హనుమత్ దీక్షా పీఠంలో ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో మంగళవారం స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అన్నప్రసాద వితరణ చేశారు. పీఠంలోని అభయాంజనేయుడికి మంగళవారం తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం తమల పాకులతో అర్చన జరిగింది.



అల్లూరి సీతారామరాజు జిల్లా కుంకుంపూడిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

# ఊరూరా అదే జోరు

**సాక్షి, నెట్‌వర్క్:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో మంగళవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలోని అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు వివరించారు.



ఏలూరు 44వ డివిజన్‌లో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.జగన్మోహనరావు

## గిరిజన సలహా మండలి పునర్నియామకం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలిని పునర్నియామకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి 2019లో సలహా మండలిని ఏర్పాటు చేసింది. మూడేళ్ల పదవీకాలం ముగియడంతో తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చైర్మన్‌గా, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్(కమిషనర్) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ సలహా మండలిలో రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు రాష్ట్రంలోని గిరిజన ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి(పాలకొండ), పాముల పుష్పశ్రీ వాణి(కురుపాం), చెట్టి ఫల్గుణ(అరకు), కె.భాగ్యలక్ష్మి(పాడేరు), నాగులపల్లి ధనలక్ష్మి(రంపచోడవరం), తెల్లం బాలరాజు(పోలవరం)లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.

## ఉద్యోగం ఊస్టింగ్ చేస్తే బుద్ధొస్తుంది..

### కీచక ఉపాధ్యాయులకు 'వాసిరెడ్డి పద్మ' హెచ్చరిక

**సాక్షి, అమరావతి:** గురువు స్థానంలో ఉండి బాలికలపై వికృత చేష్టలకు పాల్పడుతున్న కీచక ఉపాధ్యాయులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం ఏడోమైలు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినిని గర్భవతిని చేసిన వార్డెన్‌పై వాసిరెడ్డి పద్మ మంగళవారం ఓ ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఓసారి సస్పెండ్ అయినా బుద్ధి మార్చుకోకుండా అదే కీచకత్వానికి పాల్పడిన వార్డెన్ శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, పల్నాడు ఎస్పీలకు మహిళా కమిషన్ నుంచి లేఖలు పంపినట్లు తెలిపారు.

# ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడతారా?

**చింతకాయల విజయ్‌పై సీఐడీ కేసులో హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

**సాక్షి, అమరావతి:** సామాజిక మాధ్యమాల్లో ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడతారా అంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు పోస్టులు పెడుతున్నారని వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారానికి ఆ పార్టీ ఐటీ విభాగమైన ఐటీడీపీ బాధ్యతలు చూస్తున్న చింతకాయల విజయ్‌ని బాధ్యుడిగా చేస్తూ సీఐడీ నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలు నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో సీఐడీ దర్యాప్తుపై స్టే ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. విజయ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇవ్వాలని సీఐడీని ఆదేశించింది. సీఐడీ దర్యాప్తునకు సహకరించాలని విజయ్‌ను ఆదేశించింది. సీఐడీ కౌంటర్ దాఖలు చేసిన తరువాత మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామంది. ఇలాంటి కేసులో దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులను అడ్డుకునేందుకు నిర్దిష్ట యంత్రాంగం లేదన్న కారణంతో ఇష్టమొచ్చిన పోస్టులు పెడుతూ కొందరు చెలరేగిపోతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇందుకు హైకోర్టు న్యాయమూర్తులు సైతం బాధితులుగా మారారని తెలిపింది. ఇలాంటి పోస్టులు పెట్టే వారిపై కఠినంగా వ్యవహరించాలని, వీటిపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో దర్యాప్తు కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ విజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే సీఐడీ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఓ అనుబంధ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ జయసూర్య మంగళవారం విచారణ జరిపారు. విజయ్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. ఐటీడీపీ ట్విట్టర్ అకౌంట్‌తో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సీఐడీ కేసు నమోదు చేసిందని తెలిపారు. 41ఏ నోటీసు ఇవ్వడానికి పిటిషనర్ ఇంటికి వచ్చిన సీఐడీ అధికారులు భయానక వాతావరణం సృష్టించారన్నారు. పిటిషనర్‌కు మాత్రం నోటీసు ఇవ్వలేదన్నారు. సీఐడీ తరఫు న్యాయవాది వై.శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున, ఎలాంటి స్టే ఇవ్వొద్దని కోరారు. నోటీసు ఇచ్చేందుకే పోలీసులు పిటిషనర్ ఇంటికి వెళ్లారని చెప్పారు. పిటిషనర్‌పై పెట్టిన సెక్షన్లు ఏడేళ్ల లోపు శిక్ష పడేవేనని, అందువల్ల అరెస్ట్ చేసే అవకాశం లేదని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

## ఆధునిక సదుపాయాలతోనే క్రీడా రంగం అభివృద్ధి

- క్రీడా, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి వాణి మోహన్
- శాప్ చైర్మన్, ఎండీతో కలిసి గుజరాత్‌లో క్రీడా వసతుల పరిశీలన



గుజరాత్‌లోని స్టేడియాలను పరిశీలిస్తున్న వాణి మోహన్, సిద్ధార్థరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** క్రీడా రంగంలో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, ప్రోత్సాహంతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి వాణి మోహన్ అన్నారు. గుజరాత్‌లో జరుగుతున్న 36వ జాతీయ క్రీడలను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎండీ ప్రభాకర్ రెడ్డితో కలిసి తిలకించారు. అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్ పట్టణాల్లో పర్యటించి క్రీడా మైదానాలు, గ్యాలరీల నిర్మాణం, మల్టీ పర్పస్ స్టేడియాలు, శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. మహాత్మ మందిర్‌లో జూడో, బాక్సింగ్, ఐఐటీ గాంధీనగర్‌లో జరిగిన సాఫ్ట్ బాల్, సబర్మతి రివర్ ఫ్రోర్ట్‌లో జరిగిన కానాయింగ్, సాఫ్ట్ టెన్నిస్, మల్లకంబ్ క్రీడలను వీక్షించి, క్రీడాకారులను ప్రోత్సహించారు. ఏపీ ప్రభుత్వం క్రీడా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే ఏపీని అంతర్జాతీయ క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామని తెలిపారు. శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకు స్పోర్ట్స్ క్లబ్‌లను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. పలువురు జాతీయ పోటీల విజేతలకు మెడల్స్ బహూకరించారు.

## చౌళూరు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

- పారదర్శకంగా రామకృష్ణారెడ్డి హత్యకేసు దర్యాప్తు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- చౌళూరు కుటుంబానికి పరామర్శ



చౌళూరు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**హిందూపురం:** చౌళూరు రామకృష్ణారెడ్డి హత్యకేసు దర్యాప్తులో ఎలాంటి ఒత్తిళ్లకూ తావుండదని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఎవరైనా అలాచేస్తే ముఖ్యమంత్రి, తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. పోలీసులను మభ్యపెట్టి చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, ఈ కేసు పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. రామకృష్ణారెడ్డి కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హిందూపురం నియోజకవర్గం చౌళూరులో ఇటీవల హత్యకు గురైన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి కుటుంబసభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. తనకు, తన కుమారుడు మిథున్‌రెడ్డికి వ్యక్తిగతంగా కూడా కావాల్సిన వ్యక్తి రామకృష్ణారెడ్డి అని చెప్పారు. రామకృష్ణారెడ్డిని కోల్పోవడం పార్టీకి నష్టమని చెప్పారు. దోషులు ఎవరైనా వదిలేది లేదని, అందుకు తాను హామీ అని వారికి మంత్రి భరోసా ఇచ్చారు. రామకృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ ఉన్నారు.

## అక్కడ మైనింగ్ నిలిపివేయండి

**అధికారులకు హైకోర్టు ఆదేశం**

**సాక్షి, అమరావతి :** కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిక్కవరం గ్రామం పరిధిలో ఉన్న శ్రీ బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు మంగళవారం అధికారులను ఆదేశించింది. చెట్ల నరికివేతను, కొండపై కొత్తగా చేపట్టిన దేవస్థానం పనులను కూడా నిలిపేయాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 8కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

# కొనసాగుతున్న వర్షాలు

**శ్రీశైలానికి 1.28లక్షల క్యూసెక్కుల వరద**



విజయవాడ నగరంలో జోరున కురుస్తున్న వర్షం

**సాక్షి నెట్‌వర్క్ :** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కూడా వర్షాలు కురిశాయి. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ ఈస్ట్ మండలంలో అత్యధికంగా 30.2 మి.మీ. సెంట్రల్, నార్త్, వెస్ట్ మండలాల్లో 29.6 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే, విజయవాడ రూరల్‌లో 25.2మి.మీ. వర్షం కురిసింది. కృష్ణా జిల్లాలో 9.2.మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బంటుమిల్లిలో 27.2మి.మీ, అత్యల్పంగా ఉయ్యూరులో 1.8మి.మీ కురిసింది. అనంతపురం జిల్లాలోని 15 మండలాల్లో వర్షం కురిసింది. కుందుర్పిలో 60.2 మి.మీ., ఆత్మకూరులో 50.2 మి.మీ మేర భారీ వర్షం కురిసింది. కంబదూరు 37 మి.మీ, కూడేరు 32.2 మి.మీ, రాప్తాడు 20.2 మి.మీ. వర్షం కురిసింది.

**శ్రీశైలానికి పెరుగుతున్న వరద**

మరోవైపు.. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి లక్షా 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా మంగళవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 1,28,106 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. రెండు గేట్లను 10 అడుగుల మేర తెరచి 55,874 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 3 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 338 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. జలాశయంలో 213.8824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 884.70 అడుగులకు చేరుకుంది. అలాగే, సాగర్ జలాశయం నుంచి 10 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 80,690 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

# అతివకు అభయం

**అబలకు 'అభయం'**

- ఆటోల్లో అధునాతన భద్రత పరికరం
- డివైజ్‌ను ప్రెస్ చేస్తే వాహనం ఆగిపోతుంది
- క్షణాల్లో సమాచారం పోలీసులకు చేరుతుంది
- తొలిదశలో గుంటూరులో 18వేల ఆటోలకు అమరిక
- పల్నాడు జిల్లాలో 1,086 ఆటోల్లో బిగింపు



అభయం మిషన్ పనితీరును పరిశీలిస్తున్న డీటీసీ కరీం




అభయం మిషన్

**సాక్షి ప్రతినిధి, గుంటూరు/పట్నంబజారు/సత్తెనపల్లి:** విపత్కర పరిస్థితుల్లో అబలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన సర్కారు మరో అడుగు ముందుకేసింది. ప్రజా రవాణా వాహనాల్లో అభయం పేరుతో అధునాతన భద్రత పరికరాల ఏర్పాటుకు నడుంబిగించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఈ వినూత్న ప్రయోగం విజయవంతానికి రవాణాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

**ఏమిటీ 'అభయం'**

ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణించే మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. దీనిలోభాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసేప్రత్యేక పరికరాన్ని రవాణాశాఖ అధికారులు వాహనాల్లో అమర్చుతారు. ఇది జీపీఎస్‌తో అనుసంధానమై ఉంటుంది.

**ఎలా పనిచేస్తుంది**

అభయం పరికరాన్ని వాహనాల్లో ప్రయాణికులకు అందుబాటులో బిగిస్తారు. దీనిని ఇంజిన్, పెట్రోల్ పంపులకు అనుసంధానిస్తారు. డ్రైవర్‌గానీ, తోటి ప్రయాణికులుగానీ అసభ్యంగా ప్రవర్తించినా.. ఏదైనా ఇబ్బందులు ఎదురైనా ఈ పరికరంలోని ప్యానిక్ బటన్‌ను నొక్కితే వెంటనే వాహనం ఆగిపోతుంది. అంతేగాక సమాచారం క్షణాల్లో 'అభయం' కమాండ్ కంట్రోల్‌కు వెళ్తుంది. అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇస్తారు. ఫలితంగా పోలీసులు క్షణాల్లో ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలుస్తారు.

**క్యూఆర్ కోడ్ ఉంటుంది**

ఈ పరికరంపై క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. ఆటోను స్టార్ట్ చేసే సమయంలో డ్రైవర్ తన డ్రైవింగ్ లైసెన్స్‌ను స్కాన్‌చేస్తే అతని వివరాలన్నీ అందులో నిక్షిప్తమవుతాయి. స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రయాణికులు వాహనం ఎక్కాక అభయం యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినా లేదా వాహనం నంబరు నమోదు చేసినా ఆ డ్రైవర్ పేరు, ఫొటో, సెల్‌నంబర్ తదితర వివరాలన్నీ తెలుస్తాయి. ఆ యాప్‌లో వాహనం ఎటువైపు వెళ్తుంది.. ప్రస్తుతం ఎక్కడున్నదీ తెలుస్తుంది. ఈ వివరాలను మన సన్నిహితులకూ షేర్ చేసుకునే సౌలభ్యమూ ఉంది. అంతేగాక తెలియని ప్రదేశం అయితే గమ్యస్థానాన్ని నమోదు చేస్తే వెళ్లే దారులు కనిపిస్తాయి. వాహనం రాంగ్ రూట్‌లో వెళితే స్పష్టంగా కనిపిస్తుంది. వెంటనే అప్రమత్తమై భద్రత పరికరంలోని ప్యానిక్ బటన్‌ను నొక్కవచ్చు.

**స్వల్ప ఇబ్బందులు**

పరికరం పెద్దదిగా ఉందని, కూర్చున్న చోట అమర్చడం వల్ల పొరపాటున బటన్ ప్రెస్ అయితే వాహనం ఆగిపోతుందని కొంతమంది వాహన డ్రైవర్‌లు చెబుతున్నారు. అయితే డివైజ్ మీద కమాండ్ కంట్రోల్ నంబర్లు ఉంటాయని, ఫోన్ చేసి సమస్య తెలియజేస్తే పరిష్కరిస్తారని అధికారులు చెబుతున్నారు. అంతేగాక కమాండ్ కంట్రోల్ రూం నుంచి సమాచారం రాగానే పోలీసులు డ్రైవర్ నంబర్‌కు ఫోన్‌చేస్తారని, ఫోన్ ప్రయాణికులకు ఇవ్వాలని సూచిస్తారని, ప్రయాణికులు పొరపాటున నొక్కారా, కావాలనే నొక్కారా కనుక్కుంటారని, ఒక వేళ డ్రైవర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే తక్షణం ఘటనా స్థలానికి చేరుకుంటారని వివరిస్తున్నారు.

**మహిళలు, చిన్నారులకు భద్రత కోసమే**



అభయం యాప్, పరికరం మహిళలు, చిన్నారుల భద్రతకు ఉపయోగకరంగా ఉంటాయి. ఆపదలో అండగా నిలుస్తాయి. ప్రస్తుతం గుంటూరు నగరంలోని ఆటోల్లో పరికరాన్ని అమర్చుతున్నాం. 18వేల ఆటోల్లో బిగిస్తాం. పల్నాడు జిల్లాలోనూ 1,086 ఆటోల్లో అమర్చాం.

– షేక్ కరీం, డీటీసీ, ఉమ్మడి గుంటూరు జిల్లా

**తొలిదశలో గుంటూరులో..**

ఈ పరికరాన్ని తొలిదశలో గుంటూరు నగరంలోని ఆటోల్లో రవాణాశాఖ అధికారులు బిగిస్తున్నారు. పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. నగరంలో 18వేల ఆటోలకు మిషన్లు బిగించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 1100 ఆటోల్లో అమర్చారు. ఈ ప్రక్రియ వేగంగా సాగుతోంది. పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనూ ప్రస్తుతం పరికరాల అమరికను ప్రారంభించారు. పల్నాడు జిల్లాలో 1,086 వాహనాలకు మిషన్‌ను అమర్చారు.

# స్కాముల చంద్రన్న.. దోపిడీలకూ కేరాఫ్

- తెలుగుదేశం అంతర్ధానమవుతున్న పార్టీ
- మాజీమంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని



విలేకరులతో మాట్లాడుతున్న కొడాలి నాని

**గుడివాడ టౌన్:** తప్పుడు ఆరోపణలు చెయ్యడమే గాక.. తమ పేపర్లు, మీడియా చెప్పిందే వేదంలా ప్రజలు నమ్ముతారనే భ్రమలోనే ఇంకా చంద్రబాబు నాయుడు బతుకు వెళ్లదీస్తున్నాడని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) ఎద్దేవా చేశారు. తన హయాంలో ఎన్నో స్కాములకు సూత్రధారిగా నిలిచి..పలు దోపిడీలకు సైతం కేరాఫ్‌గా మారాడని విమర్శించారు.

త్వరలోనే తెలుగుదేశం పార్టీ అంతర్ధానమవడం ఖాయమన్నారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ విజయ్‌సాయిరెడ్డి లు స్థలాలు రేట్లు పెంచుకోవడానికే విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా చేస్తున్నారని చంద్రబాబు ఆయన అనుచరులు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. విశాఖపట్నం ఒక మహానగరం అని, అక్కడ భూములు కోట్ల రూపాయలు విలువ చేస్తాయన్నారు. అమరావతి పరిసర ప్రాంతాలోని రైతులు, పేదల నుంచి తక్కువ రేటుకు భూములు కొని రూ. కోట్లు గడించిన దుర్గార్గుడు చంద్రబాబునాయుడన్నారు. విశాఖలోని రుషికొండ ప్రభుత్వ భూమి అన్న సంగతి ఈ దొంగలకు, 420 బ్యాచ్‌కు తెలుసని, అక్కడ నిర్మిస్తున్న కట్టడాలన్నీ ప్రభుత్వ భవనాలని తెలిసినా.. నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. దస్‌పల్లా స్థలాల్లో రామోజీరావు ఈనాడు ప్రింటింగ్ యూనిట్, ఆంధ్రజ్యోతి స్టోరేజీ యూనిట్, ఇతర టీడీపీ నాయకులకు సంబంధించిన యూనిట్లున్నాయని అవి అన్నీ జగన్‌మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి బినామీ ఆస్తులని చెబుతారా, తెలుగుదేశం పార్టీ కార్యాలయం జగన్‌మోహన్‌రెడ్డి బినామీనా అని ప్రశ్నించారు.

**జూనియర్ ఎన్టీఆర్‌పై శాపనార్థాలా?**

ఎందుకూ పనికిరాని చచ్చు వెధవ లోకేష్‌ను రాజకీయంగా పైకి తేవాలని జూనియర్ ఎన్టీఆర్‌ను శపిస్తూ కామెంట్లు పెట్టడం దుర్మార్గం అని కొడాలి నాని అన్నారు. ఇటీవల టీడీపీ నాయకుల్లో కొందరు జూనియర్ ఎన్టీఆర్ చావాలని కోరుకుంటున్నామని కామెంట్లు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. పార్టీ స్థాపించిన ఎన్టీఆర్‌ను చంపిన ద్రోహులే ఈవిధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. నీచమైన ఆరోపణలు, నిందలు చేస్తున్న తెలుగుదేశానికి పతనం తప్పదని, చంద్రబాబు కుప్పంలో ఓడిపోవడం తథ్యమని హెచ్చరించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా లోకేష్ ముఖ్యమంత్రి కాలేడని నాని స్పష్టం చేశారు.

## విశాఖకు ఆర్టీసీ వెన్నెల ఏసీ స్లీపర్ బస్సు

**బస్టాండ్(విజయవాడ పశ్చిమ):** ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ నుంచి విశాఖపట్నంకు వెన్నెల ఏసీ స్లీపర్ బస్సును ప్రారంభించింది. ఈ బస్సును ఆర్టీసీ జోనల్ చైర్మన్, బోర్డు మెంబర్ తాతినేని పద్మావతి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలో ఈ బస్సు రాత్రి 11 గంటలకు పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి బయలుదేరి బెంజిసర్కిల్, పటమట, ఆటోనగర్, కామయ్యతోపు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ, ఎనికేపాడు మీదుగా ప్రయాణించి ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి రాత్రి విశాఖపట్నంలో 10.45 గంటలు బయలు దేరి మరుసరి రోజు ఉదయం 6.15 గంటకు విజయవాడ చేరుతుంది. ఈ బస్సు రాజమండ్రి, అన్నవరంలో మాత్రమే ఆగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు సర్వీసుల్లో ఛార్జీలను విజయవాడ నుంచి విశాఖపట్నంకు రూ.1220 గా అన్నవరానికి రూ.820 గాను నిర్ణయించినట్లు తెలిపారు.

# డిసెంబరు నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- కృష్ణా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా చిత్రంలో జేసీ మహేష్‌కుమార్

**చిలకలపూడి(మచిలీపట్నం):** ఈ ఏడాది డిసెంబరు నాటికి జగనన్న కాలనీల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ నుంచి మండలాధికారులతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు, రీ-సర్వే, ఈ-కేవైసీ, ఎండీయూ ఆపరేటర్ల ఖాళీల భర్తీ, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు మండల, ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ 100 శాతం అక్టోబరు 14 నాటికి పూర్తి చేయాలని సూచించారు. నవంబరు మొదటి వారం నుంచి జనవరి చివరి వరకు ధాన్యం సేకరణ ప్రక్రియ ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవటంలో వలంటీర్లు మార్గదర్శకులుగా ఉంటారన్నారు. ధాన్యం కొనుగోలు విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో గోనెసంచులు, తేమశాతం కొలిచే పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రాధాన్యత భవన నిర్మాణాలైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు తదితర భవన నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇసుక కొరత ఉంటే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ మహేష్‌కుమార్ రావిరాల, డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీవో ఐ.కిషోర్, హౌసింగ్ పీడీ శ్రీధర్‌బాబు, ఎస్ఈపీఆర్ ఈరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

**కృష్ణలంక (విజయవాడ తూర్పు):** ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర చైర్మన్‌గా ఆర్.వి.అప్పారావు, వైస్ చైర్మన్‌గా చక్కా రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడిగా వీరేంద్ర కుమార్, గౌరవాధ్యక్షుడుగా కె.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పీఎస్ఆర్ మూర్తి, గౌరవ సలహాదారుడుగా కోని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరేంద్ర కుమార్, పీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి నూతన కమిటీతో ముందుకు వెళ్తామన్నారు. ఏ ఒక్కరికీ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


రేఖారెడ్డి






# పూల ధ్యానం

**రంగురంగుల పూలు కంటికి హాయినిస్తాయి.**
**పూల అమరిక మనసుకు సాంత్వననిస్తుంది.**
**ఫ్లవర్‌వాజ్ ఇంటి ఆహ్లాదానికి చిరునామా.**
**భూమి... స్వర్గం... మధ్యలో మనిషి...**
**జీవిత తత్వానికి, జీవన సూత్రానికి ప్రతీక పువ్వు.**
**ఈ తాత్వికతకు ప్రతిబింబం ఇకబెనా పూల అమరిక.**



కళ... పాటలు పాడడం ఒక కళ. నాట్యం చేయడం ఒక కళ. చెట్టు మీద ఉండాల్సిన ఆకులు, పూలను... నేల మీదకు తెచ్చి రంగవల్లిక ఆవిష్కరించడం ఓ కళ... అలాగే కాన్వాస్ మీద ఆవిష్కరించడం మరో కళ. అదే పూలు, లతలను వస్త్రం మీద కుట్టడం ఓ కళ. తాజా పూలను కుండీలో అమర్చడమూ ఓ కళ. అన్ని కళలకు ఉన్నట్లే ఈ కళకు కూడా కొన్ని నియమాలున్నాయి. ఈ కళను సాధన చేయడం ధ్యానంతో సమానం అంటారు ఇకబెనా కళాకారిణి రేఖారెడ్డి. ఇకబెనా అనేది జపాన్‌కు చెందిన పూల అలంకరణ విధానం. జీవితానికి అన్వయిస్తూ సూత్రబద్ధంగా చేసే అమరిక. జపాన్ కళకు భారతీయ సొగసులద్ది విదేశాల్లో భారతీయతకు రాయబారిగా నిలుస్తున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న రేఖారెడ్డి. ఈ కళ పట్ల ఆసక్తి కలగడానికి నేపథ్యాన్ని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

**■ ప్రకృతికి ఆహ్వానం**

"ఇది బౌద్ధం నుంచి రూపుదిద్దుకున్న కళ. బుద్ధుని ప్రతిమ ఎదురుగా ఒక పాత్రలో నీటిని పెట్టి అందులో కొన్ని పూలను సమర్పించడం నుంచి ఆ పూల అమరిక మరి కొంత సూత్రబద్ధతను ఇముడ్చుకుంటూ ఎన్నో ఏళ్లకు ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్ అనే రూపం సంతరించుకుంది. పూలను చూస్తే మనసుకు ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రకృతి ఒడిలో జీవించడం అన్నివేళలా సాధ్యం కాదు, కాబట్టి ప్రకృతిని ఇంట్లోకి ఆహ్వానించడం అన్నమాట. అలా బౌద్ధ చైత్యాల నుంచి ఈ సంస్కృతి బౌద్ధావలంబకుల ఇళ్లలోకి వచ్చింది. ఈ పూల అలంకరణ ప్రకృతికి, మనిషి జీవితానికి మధ్య ఉండాల్సిన అనుబంధానికి ప్రతీక. ఒక త్రికోణాకారంలో పైన స్వర్గం, కింద భూమి, మధ్యలో మనిషి... ఈ మూడింటికి ప్రతిరూపంగా ఉంటుందీ అమరిక. మనిషి జీవన చక్రం ఇమిడి ఉంటుంది. పై నుంచి కిందకు... ఒకటి విచ్చుకోవాల్సిన మొగ్గ, ఒకటి అర విరిసిన పువ్వు, మరొకటి పూర్తిగా విచ్చుకున్న పువ్వు... ఈ మూడు పూలు భవిష్యత్తు, వర్తమానం, భూత కాలాలకు సూచికలన్నమాట. ఫ్లవర్ అరేంజ్‌మెంట్ ప్రాక్టీస్ ధ్యానం వంటిదే. రోజూ కొంత సమయం ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లో గడిపితే ధ్యానం తర్వాత కలిగే ప్రశాంతత కలుగుతుంది. ఇక నాకు ఈ ఆర్ట్ మీద ఆసక్తి ఎలా కలిగింది... అంటే ఈ కళ మా ఇంట్లో నేను పుట్టకముందే విచ్చుకుంది.

**■ ఆకట్టుకున్న జపాన్**

మా నాన్న పిల్లల డాక్టర్. కెనడాకు వెళ్లే ప్రయాణంలో మధ్యలో నాలుగు రోజులు జపాన్‌లో ఉన్నారు. నాన్నతోపాటు అమ్మ కూడా వెళ్లిందప్పుడు. ఆమెకు స్వతహాగా ఇంటిని పూలతో అలంకరించడం ఇష్టం. ఫ్లవర్‌వాజ్‌లో తాజా పూలను అమర్చేది. జపాన్‌లో ఉన్న నాలుగు రోజుల్లో ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్ ఆమెను బాగా ఆకర్షించింది. కొన్నేళ్ల తర్వాత హైదరాబాద్‌లో మీనా అనంత నారాయణ్ గారి దగ్గర కోర్సు చేసింది అమ్మ. సిటీలో అనేక పోటీల్లో పాల్గొని ప్రైజ్‌లు తెచ్చుకునేది. ఇదంతా చూస్తూ పెరిగినా కూడా నాకు అప్పట్లో పెద్దగా ఆసక్తి కలగలేదు. కానీ అవగాహన మాత్రం ఉండేది. కాలేజ్ పోటీలప్పుడు ఫ్లవర్‌వేజ్‌లో తాజా పూలను చక్కగా అలంకరించి ప్రైజ్‌లు తెచ్చుకోవడం వరకే ఇంటరెస్ట్. నా కెరీర్ ప్లాన్స్ అన్నీ న్యూట్రిషన్‌లోనే ఉండేవి. ఎన్.జి. రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ హోమ్‌సైన్స్‌లో న్యూట్రిషన్ చేశాను, యూనివర్సిటీ టాపర్‌ని. పీహెచ్‌డీ చేసి ప్రపంచంలో అనేక దేశాల్లో పిల్లలు పోషకాహారలోపంతో బాధపడడానికి కారణాలను, నివారించడానికి చర్యల మీద పరిశోధనలు చేయాలనుకున్నాను. అలాంటిది హఠాత్తుగా నాన్న పోవడం, నాకు పెళ్లి చేసి తన బాధ్యత పూర్తి చేసుకోవాలని అమ్మ అనుకోవడం... నా న్యూట్రిషన్ కెరీర్ కల కలగానే ఉండిపోయింది. నా పెళ్లి, ఇద్దరు పిల్లలు, కుటుంబంతో గృహిణిగా కొనసాగుతున్న సమయంలో కాలక్షేపం కోసం ఫ్లవర్ అరేంజ్‌మెంట్ మొదలుపెట్టాను. ఒక్కో డౌట్ అమ్మను అడుగుతూ పూలను అమర్చేదాన్ని. అప్పుడు అమ్మ సూచన మేరకు ఆమె టీచర్ దగ్గరే నేను కూడా ఇకబెనా కోర్సు చేశాను. ఇది ముప్పైఏడేళ్ల నాటి సంగతి. ఇందులో ఇంట్రడక్టరీ నుంచి టీచింగ్ వరకు ఉన్న దశలన్నీ పూర్తిచేసి 1995 నుంచి ఇకబెనా టీచింగ్ మొదలు పెట్టాను. ఇన్నేళ్లలో వందలాది మందికి నేర్పించాను. నా స్టూడెంట్స్‌లో చాలామంది టీచర్లయ్యారు. మా యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు నన్ను చూసి ఓసారి 'గోల్డ్ మెడలిస్ట్‌వి. న్యూట్రిషన్ కోసం చాలా సర్వీస్ ఇస్తావని ఊహించాం. ఇలా పూల డెకరేషన్ చేసుకుంటున్నావా' అని నొచ్చుకున్నారు. మనను నడిపించే ఓ శక్తి మన గమనాన్ని నిర్ణయిస్తుందని నమ్ముతాను. ఇకబెనా కోసం పని చేయడాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇందులోనే ప్రయోగాలు చేస్తున్నాను. నేను విదేశాలకు వెళ్లినప్పుడు భారతీయతకు ప్రాతినిధ్యం వహించినట్లే, కాబట్టి మన వస్త్రధారణనే పాటిస్తాను. ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లో భారతీయత ప్రతిబింబించేటట్లు మన పసుపు, కుంకుమను థీమ్ ప్రకారం చేరుస్తాను. ఈ ప్రయోగం నాకు గర్వంగా ఉంటోంది కూడా.

'బ్లూమ్స్ అండ్ లూమ్స్' అనే పుస్తకం ద్వారా జపాన్ ఇకబెనాను భారతీయ చేనేతతో సమ్మిళితం చేశాను. అలాగే 'మిశ్రణం' పుస్తకంలో మన ఆహారంలో ఉండే న్యూట్రిషన్ వాల్యూస్‌కి- జపాన్ పూల అలంకరణను మమేకం చేశాను. సంస్కృతుల సమ్మేళనంగా నేను చేసిన ఈ ప్రయోగాలే నన్ను 'జపాన్ ఫారిన్ మినిస్టర్స్ కమెండేషన్ అవార్డు' ఎంపిక చేశాయనుకుంటున్నాను. ఈ పురస్కారాన్ని ఈ నెలలో చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ తగా మసాయుకి అందిస్తారు'' అని తన ఇకబెనా ప్రయాణాన్ని వివరించారు రేఖారెడ్డి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి




ఇంట్లో నేనే చిన్నదాన్ని. అన్న, అక్క ఉన్నత విద్య కోసం హాస్టల్ కెళ్లిపోయిన తరవాత నన్ను కూడా హాస్టల్‌కి పంపించడానికి అమ్మానాన్న ఇష్టపడలేదు. అలా ఢిల్లీలోని లేడీ ఇర్విన్ కాలేజీలో సీటు వదులుకున్నాను. న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ సీటు వచ్చినా చేయలేకపోయాను. నేను హాబీగా మొదలు పెట్టిన ఇకబెనా కోసం విస్తృతంగా పని చేస్తున్నాను.

**సమాజ హితం కోసం పాఠాలు**

మనదేశంలో దాదాపుగా పది రాష్ట్రాల్లో, పన్నాలుగు దేశాల్లో వర్క్‌షాప్‌లు, డెమోలలో పాల్గొన్నాను. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నా విద్యార్థుల పరిధి ఖండాలు దాటింది. లిథువేనియా స్టూడెంట్స్‌కి కూడా నేర్పించాను. పిల్లల ఆరోగ్యం కోసం పని చేసే రుగుటి ఫౌండేషన్ ఫండ్ రైజింగ్ ప్రోగ్రామ్ కోసం ఇకబెనా పాఠాలు చెప్పాను. రష్యా- ఉక్రెయిన్ వార్ రిలీఫ్ ఫండ్ కోసం కూడా ఇకబెనా పాఠాలు చెప్పాను. ఈ జర్నీ నాకు సంతృప్తిగా ఉంది.

**- రేఖారెడ్డి,** ఇకబెనా ఆర్టిస్ట్

**కిచెన్‌టిప్స్**



- పల్లీలు వేయించేటప్పుడు రెండు టీస్పూన్లు నీళ్లు చల్లి వేయించాలి. నీళ్లు చల్లడం వల్ల పల్లీలు త్వరగా వేగడంతోపాటు, పొట్టు సులభంగా వస్తుంది.



- కళ్లజోడు అద్దాల మీద కొద్దిగా టూత్ పేస్టు వేసి టిష్యూ పేపర్‌తో తుడిస్తే జిడ్డంతా పోయి చక్కగా కనిపిస్తాయి.



- గ్యాస్ బర్నర్, స్టాండ్స్‌పైన పేరుకుపోయిన జిడ్డు, కూర మరకలు పోవాలంటే వంటసోడాలో కొద్దిగా డిష్ వాష్ లిక్విడ్ కలిపి బర్నర్, స్టాండ్‌లపై టూత్‌బ్రష్‌తో రాయాలి. పది నిమిషాలు నానాక స్టీల్ స్క్రబ్బర్‌తో రుద్దితే జిడ్డు, మురికి పూర్తిగా తొలగిపోతాయి.

**బ్యూటిప్**

## మొటిమలా..? పుదీనాతో పరిష్కారం

పదిహేను పుదీనా ఆకుల్ని తీసుకుని మెత్తగా నూరాలి. దీనిలో రెండు టీస్పూన్ల ఓట్స్, రెండు టీస్పూన్ల కీరా రసం, టీస్పూను తేనె వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మొటిమలపై పూతలా వేసుకుని ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు పోతాయి.

పుదీనా ఆకుల పేస్టులో తేనె, రోజ్‌వాటర్ వేసి కలిపి మొటిమల పైన పూతలా వేసుకుంటే మొటిమలు, వాటి తాలూకు మచ్చలు పోతాయి.



● న్యూస్‌మేకర్

# మానవహక్కుల దూతగా తొలి దళిత యువతి

**ఐక్యరాజ్య సమితి**
**మానవ హక్కుల కౌన్సిల్ (యుఎన్‌హెచ్‌ఆర్‌సి)**
**తన ప్రత్యేక దూతగా**
**తొలిసారిగా ఒక భారతీయురాలిని,**
**అందునా దళిత యువతిని నియమించింది.**
**ఆ మేరకు చరిత్ర సృష్టించిన**
**ఆ యువతి పేరు అశ్విని కె.పి.**
**బెంగళూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న**
**36 ఏళ్ల అశ్విని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు**
**ప్రత్యేక దూతగా ఉంటూ... దాని కార్యకలాపాలను**
**నమోదు చేయడమే కాకుండా**
**జాతి వివక్ష, జాత్యహంకారం, విదేశీయుల పట్ల ద్వేషం**
**గురించి వివిధ దేశాల్లో పెచ్చరిల్లుతున్న ధోరణులను**
**స్వతంత్రస్థాయిలో నివేదిస్తుంది.**
**'స్త్రీగా, దళిత స్త్రీగా నేను ఈ అవకాశం పొందడం**
**చాలా ప్రాముఖ్యమైన సంగతి' అంటోంది అశ్విని.**


అశ్విని కె.పి.

జెనీవాలో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ సమావేశాలలో కీలకమైన నిర్ణయం వెలువడింది. జాతి వివక్షను నివేదించేందుకు స్వతంత్ర్య నిపుణురాలిగా (ప్రత్యేక దూతగా) మొదటిసారి ఒక భారతీయురాలి ఎంపిక జరిగింది. బెంగళూరులో పొలిటికల్ సైన్స్ బోధించే అధ్యాపకురాలు, దళిత్ యాక్టివిస్టు అశ్విని కె.పి.ని కౌన్సిల్‌లోని 47 మంది సభ్యుల బాడీ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. ఈ పదవిలోకి వచ్చిన తొలి ఆసియా మహిళగా, తొలి భారతీయురాలిగా, తొలి దళితురాలిగా ఆ మేరకు అశ్విని చరిత్ర సృష్టించింది. ఇంతకుముందు ఈ పదవిలో జాంబియాకు చెందిన మహిళ ఇ.తెందాయి ఉంది. అమెరికాలో ఇటీవల భారతీయ సముదాయంలో 'కుల వివక్ష' ధోరణి ఉందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకం జరగడం గమనార్హం. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ నిర్వహించే కార్యకలాపాలను నమోదు చేయడం, ఆయా దేశాలలో నెలకొన్న అసహనం, జాతి వివక్ష, జాత్యహంకారం, విదేశీయుల పట్ల అకారణ ద్వేషం స్థూలంగా, దేశాన్ని బట్టి ఏ విధంగా ఉన్నాయో కౌన్సిల్‌కు నివేదించడం అశ్విని బాధ్యతలుగా ఉంటాయి. ఈ పదవిలో అశ్విని మూడేళ్లు ఉంటుంది. ఈ సందర్భంగా అశ్విని ఇలా అంది–

'భారతదేశంలో అంబేద్కర్ కులవివక్షని, జాతి వివక్షని ఎలా ఎదుర్కొవాలో చెప్పారు. మన దేశంలో అంటరానితనం ఎంతటి ఘోరమైన కులవివక్షకు కారణమైందో తెలుసు. అది చూసే అంబేద్కర్ ప్రతిఘటన మార్గాలు చెప్పారు. అయితే అవి భారతదేశానికే కాదు... ప్రపంచం మొత్తానికి ఉపయోగపడతాయి. జాతి వివక్ష గురించి నాకున్న దృష్టికోణం ఆయన నుంచి పొందినదే. ఒక స్త్రీగా, దళితురాలిగా కూడా నాకు ఈ పదవి రావడం వల్ల మార్జినలైజ్డ్ సమూహాలు ఎదుర్కొనే వివక్షను మరింత బాగా అర్థం చేసుకునే వీలు ఉంది.'

'భారత్– నేపాల్‌లలో దళిత మానవ హక్కులు ఎలా ఉన్నాయో అన్న అంశం మీద జె.ఎన్.యూ.లో నేను పీహెచ్‌డీ చేశాను. ఆ సమయంలో ఎందరో దళిత యాక్టివిస్టులను కలిశాను. వారంతా ఐక్యరాజ్య సమితికి సంబంధించిన వివిధ వేదికలలో పని చేస్తున్నారు. అలాగే నేను ఆమ్నెస్టీకి చెందిన సీనియర్ బృందాలతో కలిసి పని చేశాను. ఆ పనిలో భాగంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలోని ఆదివాసుల హక్కుల హరణం తెలుసుకున్నాను. ఆదివాసులు, దళితులు వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ అవగాహనలన్నీ ఇప్పుడు వచ్చిన ఈ పదవిని మరింత అర్థవంతంగా నిర్వహించడానికి ఉపయోగపడతాయి'

'రకరకాల వివక్షల వల్ల కోట్లాది మంది బాధ పడుతున్నారు. ఈ వివక్షలను దాటి ముందుకు నడవడానికి ప్రతి ఒక్కరూ చేతనైన చైతన్యం కలిగించాలి. కల్పించుకోవాలి'. ●

యూత్ పల్స్

# లవ్ యూ బంగారం


ఫోటోగ్రాఫ్ ప్రతీకాత్మక చిత్రం

**అక్షయ తృతీయ, ధనత్రయోదశి రోజులలో బంగారం కొంటే మంచిది అనే సెంటిమెంట్ గురించి వీరికి పెద్దగా తెలిసి ఉండకపోవచ్చు. 'హాల్‌మార్క్ సింబల్ ఏం తెలియజేస్తుంది?' అనేదాని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి లేకపోవచ్చు. అయితే ఇది ఒకప్పటి విషయం. ఇప్పుడు యూత్ 'లవ్ యూ బంగారం' అనడం మాత్రమే కాదు గోల్డ్ గురించి బోలెడు విషయాలు తెలుసుకొని మరీ కొనుగోలు చేస్తోంది...**

ఆరోజుల్లో ఒకరోజు...తన బర్త్‌డేకు ఫ్రెండ్‌ని 'గోల్డ్ రింగ్'ని గిఫ్ట్‌గా అడిగింది ఆమె. 'నువ్వే 50 కేజీల బంగారం. నీకు బంగారం ఎందుకు బంగారం!' అని ఆ ఫ్రెండ్ అన్నాడట. అయితే ఈ మిలీనియల్స్ జమానాలో అలాంటి డైలాగులతో తప్పించుకోవడం అసాధ్యం. అప్పుడూ, ఇప్పుడూ బంగారం అంటే బంగారమే!

ఒకప్పుడంటే... బంగారం కొనుగోలు అనేది వివాహాది శుభకార్యాలలో పెద్దల వ్యవహారం. అయితే గత కొంత కాలంగా యూత్‌లో చిన్న మొత్తంలో అయినా బంగారం కొనుగోలు చేయడాన్ని ఇష్టపడే ధోరణి పెరుగుతోంది. 18–క్యారెట్ల వేర్/ఫ్యాషన్ జ్యువెలరీ ఆన్‌లైన్ షాపింగ్‌లో మిలీనియల్స్ చురుగ్గా ఉన్నట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసి) రిపోర్ట్ తెలియజేస్తుంది.

మిలీనియల్స్ నుంచి కూడా డిమాండ్ ఏర్పడడంతో ఇండియన్ జ్యువెలరీ ఆన్‌లైన్ మార్కెట్ వేగం పెరిగింది. పెద్ద సంస్థలు యూత్‌ని దృష్టిలో పెట్టుకొని తేలికపాటి బరువుతో, స్టైలిష్‌గా ఉండే సబ్-బ్రాండ్స్‌ను లాంచ్ చేశాయి. అమ్మాయిలలో ఎక్కువమంది గోల్డ్ ఇయర్ రింగ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. బరువును పెద్దగా పట్టించుకోవడం లేదు. యూత్‌ని దృష్టిలో పెట్టుకొని కొత్త మార్కెటింగ్, ఎడ్వర్‌టైజింగ్ స్ట్రాటజీలు మొదలయ్యాయి.

'కష్టకాలంలో అక్కరకొస్తుంది' అనే భావనతో కాస్తో,కూస్తో బంగారం కొనుగోలు చేయడం అనేది పెద్దల సంప్రదాయం. కానీ ఈతరంలో ఎక్కువమందికి ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లాగే గోల్డ్ అనేది లగ్జరీ ఫ్యాషన్.

'గోల్డ్ అంటే మా దృష్టిలో లగ్జరీ ఫ్యాషన్ మాత్రమే' అనే స్టేట్‌మెంట్‌కు యువతరంలో కొద్దిమంది మినహాయింపు. దీనికి ఒక ఉదాహరణ చెన్నైకి చెందిన సచిత. 'గతంలో స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి ఉండేది. ఆసక్తి మాత్రమే ఉంటే సరిపోదు. చాలా విషయాలు తెలిసి ఉండాలి అనేది తెలుసుకున్నాక గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఆసక్తి పెరిగింది' అంటోంది సచిత.

తమ ఫైనాన్షియల్ ప్లానింగ్‌ను దృష్టిలో పెట్టుకొని గోల్డ్‌ను సేఫెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌గా చూస్తున్న సచితలాంటి వాళ్లు యువతరంలో ఎంతోమంది ఉన్నారు. ●



## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో లక్ష్య సేన్

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ లక్ష్య సేన్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన లక్ష్య సేన్ ఒక స్థానం ఎగబాకి 75,574 పాయింట్లతో కెరీర్ బెస్ట్ ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 21 ఏళ్ల లక్ష్య సేన్ ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించాడు. అంతేకాకుండా భారత జట్టు తొలిసారి థామస్ కప్ చాంపియన్‌గా నిలువడంలోనూ కీలకపాత్ర పోషించాడు.



## ఫిన్ అలెన్ మెరుపులు... న్యూజిలాండ్ ఘనవిజయం

ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా క్రైస్ట్‌చర్చ్‌లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొమ్మిది వికెట్లతో నెగ్గింది. పాక్ నిర్దేశించిన 131 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 16.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (42 బంతుల్లో 62; 1 ఫోర్, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కాన్వే (46 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు)తో కలిసి తొలి వికెట్‌కు అలెన్ 117 పరుగులు జోడించాడు. అంతకుముందు పాక్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 130 పరుగులు చేసింది.

## భారత్ 0 అమెరికా 8



**భువనేశ్వర్:** ప్రపంచ అండర్–17 మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆతిథ్య భారత్ పరాజయంతో ప్రారంభించింది. మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0–8 గోల్స్ తేడాతో 2008 రన్నరప్ అమెరికా చేతిలో ఓటమి చవిచూసింది. అమెరికా తరఫున మెలీనా రెబింబాస్ (9వ, 31వ ని.లో) రెండు గోల్స్ చేయగా... చార్లోటి కోలెర్ (15వ ని.లో), ఒన్‌యెకా గమెరో (23వ ని.లో), గిసెలీ థాంప్సన్ (39వ ని.లో), ఎల్లా ఇమ్రి (51వ ని.లో), టేలర్ స్వారెజ్ (59వ ని.లో), మియా భుటా (62వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మరో మ్యాచ్‌లో బ్రెజిల్ 1–0తో మొరాకోపై నెగ్గింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను 14న మొరాకోతో ఆడుతుంది.

## తెలుగు టైటాన్స్ బోణీ



**బెంగళూరు:** ప్రో కబడ్డీ లీగ్‌లో వరుసగా రెండు పరాజయాల తర్వాత తెలుగు టైటాన్స్ జట్టు గెలుపు బోణీ చేసింది. మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 30–21తో నెగ్గింది. టైటాన్స్ తరఫున మోనూ గోయట్ 10 పాయింట్లు, సిద్ధార్థ్ దేశాయ్ 7 పాయింట్లు, సుర్జీత్ సింగ్ 4 పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 27–22తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

## ఫైనల్లో హుసాముద్దీన్

**అహ్మదాబాద్:** జాతీయ క్రీడల్లో సర్వీసెస్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ 57 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరాడు. సెమీఫైనల్లో హుసాముద్దీన్ 5–0తో లాలామామ్‌మా (మిజోరం)పై గెలిచాడు. నేడు జరిగే ఫైనల్లో సచిన్ సివాచ్ (హరియాణా)తో హుసాముద్దీన్ తలపడతాడు.



# భారత్ 'ఫినిషింగ్ టచ్'

- చివరి వన్డేలో దక్షిణాఫ్రికా 99 ఆలౌట్
- ఏడు వికెట్లతో టీమిండియా విజయం
- 2–1తో సిరీస్ సొంతం



**న్యూఢిల్లీ:** స్టార్లు లేకున్నా తమ రిజర్వ్ బెంచీ కూడా ఎంత బలమైందో భారత జట్టు మరోసారి నిరూపించింది. దక్షిణాఫ్రికాతో గత రెండు వన్డేల్లో హోరాహోరీగా తలపడిన అనంతరం చివరి పోరులో ప్రత్యర్థిపై టీమిండియా పూర్తి ఆధిపత్యం చలాయించింది. బౌలర్ల జోరుతో సఫారీని వంద పరుగుల లోపే కట్టిపడేసి ఇరవై ఓవర్ల లోపే అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌ను 2–1తో చేజిక్కించుకుంది. మంగళవారం జరిగిన చివరి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 99 పరుగులకే కుప్పకూలింది. భారత్‌పై సఫారీ టీమ్‌కు వన్డేల్లో ఇదే అత్యల్ప స్కోరు. హెన్రిచ్ క్లాసెన్ (42 బంతుల్లో 34; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, మరో ఇద్దరు మలాన్ (15), జాన్సెన్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్ (4/18) లోయర్ ఆర్డర్‌ను పడగొట్టగా... సుందర్, సిరాజ్, షహబాజ్ తలా 2 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. అనంతరం భారత్ 19.1 ఓవర్లలోనే 3 వికెట్లకు 105 పరుగులు చేసి విజయాన్నందుకుంది. శుబ్‌మన్ గిల్ (57 బంతుల్లో 49; 8 ఫోర్లు) రాణించగా, శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) చివరి వరకు క్రీజ్‌లో నిలిచాడు. భారత్‌కు ఇది వరుసగా ఐదో వన్డే సిరీస్ విజయం. 3 మ్యాచ్‌లలో 20.80 సగటుతో 5 వికెట్లు తీసిన హైదరాబాదీ పేసర్ సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

**టపటపా...**

టి20 సిరీస్‌తో పాటు తొలి రెండు వన్డేల్లో చెప్పుకోదగ్గ ప్రదర్శనే కనబర్చిన దక్షిణాఫ్రికా పర్యటనలో ఆఖరి పోరుకు వచ్చేసరికి పూర్తిగా చతికిలపడింది. ముగ్గురు స్పిన్నర్లతో పాటు భారత బౌలింగ్ ముందు జట్టు బ్యాటర్లు తేలిపోయారు. 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన తర్వాత కోలుకోలేకపోయిన దక్షిణాఫ్రికా 33 పరుగుల వ్యవధిలో కేవలం 50 బంతుల్లోనే తమ చివరి 6 వికెట్లు చేజార్చుకుంది. స్పిన్నర్ సుందర్‌తో బౌలింగ్ ప్రారంభించిన భారత్ మూడో ఓవర్లోనే ఫలితం సాధించింది. డికాక్ (6)ను సుందర్ అవుట్ చేయగా, బౌన్సర్లతో చెలరేగిన సిరాజ్... మరో ఇద్దరు కీలక బ్యాటర్లు మలాన్, హెన్‌డ్రిక్స్‌లను పెవిలియన్ పంపించాడు. దాంతో తొలి 10 ఓవర్లలో దక్షిణాఫ్రికా 26 పరుగులకే పరిమితమైంది. ఆపై మరింత చెలరేగిన ముగ్గురు స్పిన్నర్లు తర్వాతి 7 వికెట్లను తమ ఖాతాలో వేసుకున్నారు. వారి జోరుకు సఫారీ బ్యాటర్ల వద్ద ఎలాంటి సమాధానం లేకపోయింది. కుల్దీప్ ధాటికి చివరి వరుస ఆటగాళ్లు చేతులెత్తేయడంతో స్కోరు 100 పరుగులకు కూడా చేరలేకపోయింది.

**రాణించిన గిల్...**

ఛేదనలో భారత్ వేగంగా పరుగులు సాధించింది. అయితే ఒక ఎండ్‌లో గిల్ ధాటిగా ఆడగా, ధావన్ (8) వైఫల్యం మాత్రం కొనసాగింది. తొలి వికెట్‌కు వీరిద్దరు 37 బంతుల్లోనే 42 పరుగులు జోడించగా, గిల్ ఒక్కడే 30 పరుగులు చేశాడు. గత మ్యాచ్‌లో చెలరేగిన ఇషాన్ కిషన్ (10) ఈసారి ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో గిల్, శ్రేయస్ అలవోకగా పరుగులు సాధిస్తూ జట్టును విజయం దిశగా తీసుకెళ్లారు. గెలుపునకు 3 పరుగుల దూరంలో అవుటై గిల్ అర్ధ సెంచరీ చేజార్చుకోగా... జాన్సెన్ బౌలింగ్‌లో నేరుగా సిక్స్ కొట్టి శ్రేయస్ మ్యాచ్‌ను ముగించాడు. 3 మ్యాచ్‌లలో 191 పరుగులతో శ్రేయస్ ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.


### స్కోరు వివరాలు

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** మలాన్ (సి) అవేశ్ (బి) సిరాజ్ 15; డికాక్ (సి) అవేశ్ (బి) సుందర్ 6; హెన్‌డ్రిక్స్ (సి) (సబ్) రవి బిష్ణోయ్ (బి) సిరాజ్ 3; మార్క్‌రమ్ (సి) సామ్సన్ (బి) షహబాజ్ 9; క్లాసెన్ (బి) షహబాజ్ 34; మిల్లర్ (బి) సుందర్ 7; ఫెలుక్‌వాయో (బి) కుల్దీప్ 5; జాన్సెన్ (సి) అవేశ్ (బి) కుల్దీప్ 14; ఫార్చ్యూన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 1; నోర్జే (బి) కుల్దీప్ 0; ఇన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (27.1 ఓవర్లలో ఆలౌట్) 99. **వికెట్ల పతనం:** 1–7, 2–25, 3–26, 4–43, 5–66, 6–71, 7–93, 8–94, 9–94, 10–99. **బౌలింగ్:** సుందర్ 4–0–15–2, సిరాజ్ 5–0–17–2, అవేశ్ 5–1–8–0, షహబాజ్ 7–0–32–2, శార్దుల్ 2–0–8–0, కుల్దీప్ 4.1–1–18–4.


**భారత్ ఇన్నింగ్స్:** ధావన్ (రనౌట్) 8; గిల్ (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 49; ఇషాన్ కిషన్ (సి) డికాక్ (బి) ఫార్చ్యూన్ 10; అయ్యర్ (నాటౌట్) 28; సామ్సన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 105. వికెట్ల పతనం:** 1–42, 2–58, 3–97. **బౌలింగ్:** జాన్సెన్ 5.1–0–43–0, ఇన్‌గిడి 5–0–21–1, నోర్జే 5–1–15–0, ఫార్చ్యూన్ 4–1–20–1.

# గంగూలీ అవుట్

**బీసీసీఐలో అనూహ్య పరిణామం**
**బోర్డు కొత్త అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ!**
**కార్యదర్శిగా మళ్లీ జై షానే**



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి కొత్త అధ్యక్షుడు రానున్నాడు. పాత అధ్యక్షుడు సౌరవ్ గంగూలీని సాగనంపేందుకే బోర్డు పెద్దలు నిర్ణయించారు. ఇది ఎవరూ ఊహించని అనూహ్య పరిణామం! ఎందుకంటే బోర్డు అధ్యక్ష స్థానం కోసమే గంగూలీ సుప్రీం కోర్టు మెట్లెక్కాడు. పదవుల మధ్య విరామం (కూలింగ్ ఆఫ్ పీరియడ్) మినహాయింపు కోసం న్యాయపోరాటం చేసి విజయం సాధించాడు. కానీ బోర్డు కార్యవర్గంలో మాత్రం తన మాట నెగ్గించుకున్నట్లు లేదు. అందుకే తెరపైకి రోజర్ బిన్నీ వచ్చారు. భారత్ తొలి వన్డే ప్రపంచకప్ (1983) విజేత జట్టు సభ్యుడైన బిన్నీకే బీసీసీఐ పెద్దలు జైకొట్టడంతో అనూహ్యంగా మంగళవారం 67 ఏళ్ల ఈ మాజీ క్రికెటర్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. నేటితో నామినేషన్ల గడువు ముగుస్తుంది. కార్యదర్శిగా మళ్లీ జై షా కొనసాగేందుకు రంగం సిద్ధమైంది. అతను కూడా ఆ పదవికి నామినేషన్ దాఖలు చేశాడు. ఈనెల 18న బీసీసీఐ ఎన్నికలు జరుగుతాయి.



రోజర్ బిన్నీ

**ఐపీఎల్ కమిషనర్ పదవి తిరస్కరణ**

కొన్ని రోజులుగా ఢిల్లీలోనే తిష్టవేసిన 'దాదా' మళ్లీ అధ్యక్షుడయ్యేందుకు బోర్డు ఉన్నతాధికారులతో మంతనాలు జరిపాడు. వచ్చే ఏడాది భారత్‌లో వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో గంగూలీ తన పదవిని అట్టిపెట్టుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశాడు. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు జై షా కనుసన్నల్లోని బోర్డు వర్గాలు గంగూలీని కొనసాగించేందుకు సుముఖంగా లేవు. ఈ నేపథ్యంలో ఉన్నపళంగా బిన్నీని తెరపైకి తెచ్చారు. గంగూలీని ఐపీఎల్ కమిషనర్ పదవి తీసుకోమన్నారు. కానీ బోర్డులో అధ్యక్షుడిగా పనిచేసిన 'దాదా' ఓ సబ్ కమిటీకి చీఫ్ అయ్యేందుకు నిరాకరించారని బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో కమిషనర్ బ్రిజేశ్ పటేల్ స్థానంలో ప్రస్తుత కోశాధికారి, కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ సోదరుడైన అరుణ్ ధుమాల్‌ను ఐపీఎల్ కమిషనర్‌గా నియమించే అవకాశాలున్నాయి. మహారాష్ట్ర బీజేపీ నేత, ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) అధ్యక్షుడు ఆశిష్ షెలార్ ఇకపై బోర్డు కోశాధికారిగా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మకు అత్యంత సన్నిహితుడు దేవజిత్ సైకియా సంయుక్త కార్యదర్శిగా ఖరారయ్యారు. ఉపాధ్యక్ష పదవి మాత్రం రాజీవ్ శుక్లా నుంచి మారడం లేదు. కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడైన రాజీవ్ శుక్లా మరోసారి ఆ పదవిలో కొనసాగనున్నారు. ఐసీసీలో కీలక పదవికి గంగూలీని నామినేట్ చేసే అంశం అసలు బోర్డులో చర్చకే రాలేదని పూర్తిగా బోర్డు పదవులపైనే ఢిల్లీలో మంతనాలు జరుగుతున్నట్లు తెలిసింది.

## హైదరాబాద్ ఓటమి

**జైపూర్:** ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ ఎలైట్ గ్రూప్ 'బి'లో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 59 పరుగుల తేడాతో ఓడిపోయింది. ముందుగా పంజాబ్ 4 వికెట్లకు 174 పరుగులు చేసింది. అనంతరం 175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ (50; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. హైదరాబాద్ జట్టులో నలుగురు బ్యాటర్లు (తన్మయ్, ప్రజ్ఞయ్, చరణ్, ప్రతీక్) 'డకౌట్' కావడం గమనార్హం. మరోవైపు ఇండోర్‌లో ఆంధ్ర, సౌరాష్ట్ర జట్ల మధ్య ఎలైట్ గ్రూప్ 'డి' మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

# సినిమా



అల్లు అర్జున్

## తగ్గేదే లే...!

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రైజ్'పై మరింత దృష్టి పెట్టింది టీమ్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల 20న ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తగ్గేదే లే అంటూ.. నాన్‌స్టాప్‌గా షూటింగ్ చేయడానికి టీమ్ ప్లాన్ చేసిందని సమాచారం. ఈ షెడ్యూల్‌లోనే హీరో హీరోయిన్లు అల్లు అర్జున్, రష్మికా మందన్నాలు కూడా పాల్గొంటారని తెలిసింది. ఇందులో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీ వల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఫాహద్ ఫాజిల్, ధనుంజయ, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



కార్తీ

## చెడు మాయం చేసేస్తా..

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మించిన తమిళ చిత్రం 'సర్దార్'. ఈ చిత్రంలో రాశీఖన్నా హీరోయిన్‌గా నటించగా, రజీషా విజయ్, చుంకీ పాండే, లైలా కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 21న రిలీజ్ కానుంది. అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'సేనాపతి నేనే.. అరె సాయం అందిస్తానే.. స్వాహా శక్తి నాదే.. చెడు మాయం చేసేస్తానే' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ జానపద పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరకర్త.

## ఫైనల్‌కి రెడీ



కల్యాణ్ రామ్

కల్యాణ్‌రామ్ హీరోగా రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ''రీసెంట్‌గా జరిగిన గోవా షెడ్యూల్‌తో షూటింగ్ దాదాపు పూర్తయింది. ఫైనల్ షెడ్యూల్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌తో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. బ్రహ్మాజీ, సప్తగిరి, మాథ్యూ వర్గీస్, రాజీవ్ పిళ్లై, రవి ప్రకాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: ఎస్. సౌందర్‌రాజన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల (హేమంత్).

## సీటీగొట్టి.. సీటీగొట్టి...!

'పాపతో పైలం' అంటూ స్పెషల్ సాంగ్‌లో అదిరిపోయే స్టెప్పులు వేస్తున్నారు హీరో సుధీర్‌బాబు. మహేశ్ దర్శకత్వంలో సుధీర్ బాబు, శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హంట్'. వి. ఆనందప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ 'పాపతో పైలం' లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో సుధీర్‌బాబుతో కలిసి స్టెప్పులేశారు అప్సరా రాణి. ''సీటీగొట్టి సిటీగొట్టి మిట్ట సూత్తారే..' అంటు మొదలయ్యే ఈ పాట ఆ తర్వాత 'పైలం పాపతో పైలం.. జర పైలం షేపుతో పైలం' అని సాగుతుంది. జిబ్రాన్ సంగీత సారథ్యంలో యశ్ మాస్టర్ కొరియోగ్రఫీ వహించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, నకాష్ అజీజ్ పాడారు. ''ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం''అని చిత్ర యూనిట్ పేర్కొంది.



సుధీర్‌బాబు, అప్సరా రాణి

## చూపు తిప్పకోకుండా కాంతారా చూశాను - అల్లు అరవింద్



అల్లు అరవింద్, రిషబ్ శెట్టి, సప్తమి

''హోంబలే ఫిల్మ్స్ సంస్థ మంచి కథలను ఎంచుకుంటూ సినిమాలు తీస్తోంది. 'కాంతారా' సినిమా చూసిన తర్వాత ఇన్ని సినిమాలు తీసిన నేను కూడా వారి దగ్గర నుంచి కొంత నేర్చుకోవాలని అనిపించింది. విభిన్నమైన సినిమాలు కావాలనుకునేవారికి 'కాంతారా' కచ్చితంగా నచ్చుతుంది'' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. కన్నడ నటుడు, రచయిత, దర్శకుడు రిషబ్ శెట్టి నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతారా'. ఈ చిత్రంలో సప్తమి గౌడ, కిశోర్ కుమార్, అచ్యుత్ కుమార్, ప్రమోద్ శెట్టి, ప్రకాష్ తుమినాడు కీలక పాత్రలు పోషించారు. 'కేజీఎఫ్' ఫేమ్ విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 30న విడుదలైంది. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ గీతా ఫిలింస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 15న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ – ''అడవి నేపథ్యంలో వచ్చిన 'పుష్ప' చూసి ప్రేక్షకులు ఎంతగా ఇష్టపడ్డారో.. అదే నేపథ్యంలో వస్తున్న 'కాంతారా'ను కూడా అంతే ఇష్టపడతారు. 'కాంతారా'లో ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ మాత్రమే కాదు.. విష్ణు తత్వాన్ని కూడా చెప్పడం జరిగింది. రీసెంట్‌గా వచ్చిన ఈ తరహా సినిమాలు సూపర్ హిట్టయ్యాయి. 'కాంతారా'ను రిషబ్ శెట్టి ఎంత అద్భుతంగా డైరెక్ట్ చేశారో అంతే బాగా యాక్ట్ చేశారు. సుమారు 40 నిమిషాల వరకు చూపు తిప్పుకోకుండా ఈ సినిమాను చూశాను. హీరోయిన్ సప్తమి డీ గ్లామరస్ రోల్‌ను బాగా చేసింది'' అని అన్నారు. రిషబ్ శెట్టి మాట్లాడుతూ– ''భారతీయ చిత్ర పరిశ్రమలోనే తెలుగు చలన చిత్ర పరిశ్రమ అగ్రస్థానంలో ఉంది. ఫారెస్ట్ మిస్టరీతో పాటు అగ్రికల్చర్ ల్యాండ్, ఎమోషన్స్ చుట్టూ ఈ సినిమా కథ సాగుతుంది. యూనివర్సల్ కథతో వస్తున్న 'కాంతారా' ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని చెప్పగలను. అగ్ర నిర్మాత అల్లు అరవింద్‌గారి గీతా ఫిలింస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా 'కాంతారా' రిలీజ్ అవుతున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''రిషబ్ శెట్టితో నేను చేసిన మూడో సినిమా ఇది. 'కాంతారా'లో ఆరు పాటలు రాసే అవకాశాన్ని ఇచ్చిన హనుమాన్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు రచయిత రాంబాబు గోశాల.

## మిస్టరీ లవ్‌స్టోరీ



సతీష్, సోనాల్, జైద్ ఖాన్

జైద్ ఖాన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బనారస్'. కన్నడ హిట్ 'బెల్‌బాటమ్' ఫేమ్ జయతీర్థ ఈ పాన్ ఇండియా ఫిల్మ్‌కు దర్శకుడు. సోనాల్ మోంటారో కథానాయిక. తిలకరాజ్ బల్లాల్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 4న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. తెలుగు వెర్షన్‌ను 'నాంది' ఫేమ్ నిర్మాత సతీష్ వర్మ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో జైద్ ఖాన్ మాట్లాడుతూ– ''బనారస్ సిటీ (వారణాసి) నేపథ్యంలో సాగే మిస్టీరియస్ అండ్ మెచ్యూర్డ్ లవ్‌స్టోరీ మూవీ ఇది. యాక్షన్, కామెడీ, సస్పెన్స్, థ్రిల్, ఫ్యామిలీ అంశాలు.. ఇలా అన్ని ఎలిమెంట్స్ మా సినిమాలో ఉన్నాయి. ఇందులో ఓ వినూత్న ప్రయోగం చేశాం. ఇది ప్రేక్షకులు గుర్తు పెట్టుకునేలా ఉంటుంది. సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న సతీష్‌గారికి ధన్యవాదాలు'' అని అన్నారు. ''ప్రేక్షకులందరూ కనెక్ట్ అయ్యే పాత్రను ఇందులో చేశాను'' అన్నారు సోనాల్. ''బనారస్'లో బలమైన కంటెంట్ ఉంది. నవంబరు 4న రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు సతీష్ వర్మ.

## మూడు యుగాల కథలో...!



కృతీ శెట్టి, టోవినో థామస్

తొలి చిత్రం 'ఉప్పెన'తోనే తెలుగులో క్రేజీ హీరోయిన్‌గా మారిపోయిన కృతీ శెట్టి మాలీవుడ్‌కి హాయ్ చెబుతున్నారు. టోవినో థామస్ హీరోగా మలయాళంలో 'అజయంటే రండం మోషణం' అనే పాన్ ఇండియా ఫిల్మ్ తెరకెక్కుతోంది. ఈ సినిమాలోనే కృతీ శెట్టి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాతో జితిన్ లాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మీ కూడా కథానాయికలుగా కనిపిస్తారు. ''మూడు యుగాల కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో టోవినో థామస్ మూడు పాత్రల్లో కనిపిస్తారు. మణియన్, అజయన్, కుంజికే పాత్రలు పోషిస్తున్నారాయన. కథ రీత్యా కేరళలోని కలరి మార్షల్ ఆర్ట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. దీంతో కలరి విద్యలో టోవినో ప్రత్యేక శిక్షణ తీసుకోవడం జరిగింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

## హీరోయే విలన్! - ఫణి కృష్ణ



ఆది సాయికుమార్ హీరోగా ఫణికృష్ణ సిరికి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'క్రేజీ ఫెలో'. దిగంగనా సూర్యవన్షీ, మిర్నా మీనన్ హీరోయిన్లుగా నటించారు. కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఫణికృష్ణ మాట్లాడుతూ– ''పదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. కొన్ని షార్ట్ ఫిల్మ్స్, యాడ్ ఫిల్మ్స్ చేశాను. దర్శకుడు కల్యాణ్ కృష్ణగారి దగ్గర రచనా విభాగంలో చేశాను. ఆ తర్వాత రాధామోహన్‌గారికి 'క్రేజీ ఫెలో' కథ వినిపించడం జరిగింది. హీరో క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్ ఇది. కొత్త ఆదిగారిని చూస్తారు. చెప్పిన మాట పూర్తిగా వినకపోతే వచ్చే సమస్యలను హిలేరియస్‌గా చూపించాం. ఇందులో విలన్ కూడా హీరోయే. ఎందుకో సినిమాలో చూడాల్సిందే. ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్ ఉన్నాయి. 'క్రేజీ ఫెలో' చూశాక ఆడియన్స్ నవ్వుతూ బయటకు వస్తారని చెప్పగలను'' అన్నారు.

## ప్రేమ ఓడిపోదు



హేమలతా రెడ్డి

శ్రీకాంత్ గుర్రం, బుజ్జి (హేమలతా రెడ్డి), జంటగా కె. గోవర్ధన రావు దర్శకత్వంలో పోతిరెడ్డి హేమలతా రెడ్డి నిర్మించిన చిత్రం 'నిన్నే చూస్తు'. ఈ చిత్రం ఆడియోను ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ విడుదల చేశారు. ''సంగీతదర్శకుడు రమస్ రాథోడ్ ఇచ్చిన ఉన్న ఆరు పాటలు భిన్నంగా ఉంటాయి. ప్రేమ ఎప్పుడూ ఓడిపోకూడదనే ఆలోచనతో పెద్దలకు, ప్రేమికులకు అర్థమయ్యే రీతిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ నెలాఖరున సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు హేమలతా రెడ్డి. ''ప్రేమించే మనుషులు, మనసులు ఉన్నంత వరకు ప్రేమ ఓడిపోదని చెప్పే ప్రేమకథా చిత్రం ఇది'' అన్నారు కె. గోవర్ధనరావు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▼ 844 | 57,147 |
| నిఫ్టీ ▼ 257 | 16,984 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 10,563 | ▲ | 22 |
| డోజోన్స్ | 29,524 | ▲ | 322 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,885 | ▼ | 74 |
| డాక్స్ | 12,220 | ▼ | 53 |
| షాంఘై | 2,980 | ▲ | 6 |
| నికాయ్ | 26,401 | ▼ | 715 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్



## భారత్‌లో బీవైడీ అటో-3

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ.. భారత్‌లో తాజాగా ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ అటో-3 ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్‌తో 521 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 7 ఎయిర్‌బ్యాగ్స్ పొందుపరిచారు. ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్, లేన్-కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, రెండు వైపులా కొలిషన్ వార్నింగ్, ఏబీఎస్, ఈఎస్‌సీ, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్లను జోడించారు. ధరను ఇంకా ప్రకటించాల్సి ఉంది. రూ.50,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు 2023 జనవరి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే బీవైడీ భారత్‌లో మల్టీ పర్పస్ ఎలక్ట్రిక్ వెహి



కిల్ ఈ6ను విక్రయిస్తోంది. 2030 నాటికి భారత ఎలక్ట్రిక్ వాహన విపణి 55 లక్షల యూనిట్లకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయని బీవైడీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్ తెలిపారు. ఆ సమయానికి 30 శాతం వాటా లక్ష్యంగా చేసుకున్నట్టు వెల్లడించారు. చెన్నై ప్లాంటులో ఎస్‌యూవీని అసెంబుల్ చేస్తామన్నారు. మార్కెట్ డిమాండ్‌నుబట్టి తయారీ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. బీవైడీ తయారీ 800లకుపైగా ఎలక్ట్రిక్ బస్సులు భారత్‌లో 11 నగరాల్లో పరుగెడుతున్నాయని వివరించారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 12-10-2022 | |
|---|---|
| విశాఖ | 435-00 |
| చిత్తూరు | 443-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 435-00 |
| విజయవాడ | 435-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **11-10-2022 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 412-00 |
| వరంగల్ | 414-00 |
| రిటైల్ ధర | 4.70 |

**బులియన్** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 50,736 | ▼ 384 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 50,533 | ▼ 382 |
| వెండి (కిలో) | 57,614 | ▼ 1,335 |

## టయోటా ఫ్లెక్స్ ఫ్యూయల్ ఈవీ

న్యూఢిల్లీ: కార్ల తయారీలో ఉన్న జపాన్ సంస్థ టయోటా ఓ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఫ్లెక్స్ ఫ్యూయల్-స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్‌ను అభివృద్ధి చేయనుంది. బ్యాటరీతోపాటు 100 శాతం ఇథనాల్‌తో ఇది పరుగెడుతుంది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ ప్రాజెక్టును మంగళవారం ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్ట్ కోసం బ్రెజిల్ నుంచి తెప్పించిన టయోటా కరోలా ఆల్టిస్ ఫ్లెక్స్ ఫ్యూయల్-స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ వాహనానికి ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజన్‌తోపాటు ఎలక్ట్రిక్ పవర్‌ట్రెయిన్ పొందుపరిచారు. ఫ్లెక్స్-ఫ్యూయల్ అనుకూల కార్లు ఒకటి కంటే ఎక్కువ రకాల ఇంధనం లేదా మిశ్రమంతో కూడా నడుస్తాయి. సాధారణంగా పెట్రోల్‌తోపాటు ఇథనాల్ లేదా మిథనాల్ మిశ్రమం ఉపయోగిస్తారు. 20 నుంచి 100 శాతం వరకు ఇథనాల్‌ను వినియోగించవచ్చు. ఇటువంటి వాహనాలు బ్రెజిల్, యూఎస్‌ఏ, కెనడాలో



ప్రస్తుతం వాడకంలో ఉన్నాయి. దేశంలో కాలుష్యం పెద్ద ఆందోళన కలిగిస్తోందని మంత్రి అన్నారు. రవాణా రంగం కాలుష్యానికి దోహదపడుతోందని చెప్పారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్‌తోపాటు ఇథనాల్, మిథనాల్ వంటి జీవ ఇంధనాలతో నడిచే వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. భారతదేశం అతి తక్కువ సమయంలో 10 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించిందని టయోటా కిర్లోస్కర్ వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ అన్నారు. 2025 నాటికి ఇది 20 శాతానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారత్ వృద్ధికి ఐఎంఎఫ్ రెండో కోత

- 2022-23 అంచనాలు 6.8 శాతానికి డౌన్
- జనవరిలో తొలి అంచనా 8.2 శాతం
- జూలైలో 7.4 శాతానికి తగ్గింపు

వాషింగ్టన్: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతమని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తన తాజా అవుట్‌లుక్‌లో పేర్కొంది. భారత్ వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ తగ్గించడం ఇది వరుసగా రెండోసారి. తొలుత ఈ ఏడాది జనవరిలో 2022-23లో వృద్ధి అంచనాలను 8.2 శాతంగా వెలువరించింది. అయితే జూలైలో దీనిని 7.4 శాతానికి కుదించింది. అంతర్జాతీయంగా అనిశ్చిత ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు వంటి అంశాల నేపథ్యంలో రేటు అంచనాలను మరింతగా 6.8 శాతానికి ఐఎంఎఫ్



కుదించింది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వార్షిక సమావేశాల నేపథ్యంలో ఈ అవుట్‌లుక్ విడుదలైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)సహా పలు జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఆర్థిక, విశ్లేషణా సంస్థలు 2022-23 భారత్ వృద్ధి అంచనాలను కుదిస్తున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ, ప్రపంచంలోనే వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుండడం గమనార్హం. 2021-22లో భారత్ వృద్ధి రేటు 8.2 శాతం. ఐఎంఎఫ్ మంగళవారం విడుదల చేసిన వార్షిక 'వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్'లో ఈ విషయాలను వెల్లడించింది. మొదటి త్రైమాసికంతో పోల్చితే రెండవ త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) భారత్ ఆర్థిక వ్యవస్థలో క్రియాశీలత తగ్గిందని విశ్లేషించింది. అంతర్జాతీయ డిమాండ్ తగ్గడం కూడా ప్రతికూల ప్రభావానికి దారితీస్తోందని వివరించింది.

**ప్రపంచ వృద్ధి 3.2 శాతమే...**

2021లో ప్రపంచ వృద్ధి 6 శాతం ఉంటే, 2022లో ఇది 3.2 శాతానికి పడిపోతుందని ఐఎంఎఫ్ అంచనావేసింది. 2023లో ఈ రేటు మరింతగా 2.7 శాతానికి పడిపోతుందని అవుట్‌లుక్ అంచనావేసింది. 2001 తర్వాత ప్రపంచ వృద్ధి ఈ స్థాయిలో బలహీనపడటం (అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, కోవిడ్-19 తీవ్ర స్థాయి కాలాలతో పోల్చితే) ఇదే తొలిసారి. అవుట్‌లుక్ ప్రకారం, అమెరికా జీడీపీ 2022 తొలి భాగంలో క్షీణతలోకి జారింది. 2023లో ఒక శాతం వృద్ధి నమోదుకావచ్చు.

## 17 వేల దిగువకు నిఫ్టీ

- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 844 పాయింట్లు
- సూచీలకు మూడోరోజూ నష్టాలే

ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలతో దేశీ స్టాక్ సూచీలు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 844 పాయింట్లు పతనమై 57,147 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 257 పాయింట్లు క్షీణించి కీలకమైన 17వేల స్థాయి దిగువన 16,984 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లకు గానూ యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పేయింట్స్ మాత్రమే స్వల్ప లాభంతో గట్టెక్కాయి. అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మెటల్, ఐటీ, కన్జూమర్ షేర్లలో పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.61%, 1.47 శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4612 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2431 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా మార్కెట్లు 2-3%, యూరప్ సూచీలు ఒకశాతం నష్టపోయాయి.

**రోజంతా నష్టాల్లోనే..**

సెన్సెక్స్ 13 పాయింట్ల లాభంతో 58,004 వద్ద, నిఫ్టీ 15 పాయింట్లు పెరిగి 17,256 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ఇన్వెస్టర్లు అమ్మకాలకే



మొగ్గుచూపడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాలకు మొగ్గుచూపాయి. ఒక దశలో సెన్సెక్స్ 941 పాయింట్లు పతనమై 57,050 వద్ద నిఫ్టీ 291 పాయింట్లు క్షీణించి 16,950 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి.

**నష్టాలు ఎందుకంటే...**

ఆరునెలల్లో ఆర్థిక మాంద్యం తప్పదని జేపీ మోర్గాన్ సీఈఓ వ్యాఖ్యలు మార్కెట్ వర్గాలను కలవరపెట్టాయి. దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్లు నికర అమ్మకందారులుగా నిలవడంతో సెంటిమెంట్ దెబ్బతింది. రష్యా - ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల బాటపట్టాయి. డాలర్ ఇండెక్స్ 113 స్థాయి పైకి చేరుకోవడంతో భారత కరెన్సీ బలహీనపడటం ఈక్విటీలపై మరింత ఒత్తిడి పెరిగింది.

''అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఉన్న అస్థిరతలకు తాజాగా ఉక్రెయిన్ ఉద్రిక్తతలు తోడవ్వడంతో ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకొనేందుకు వెనుకాడారు. ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు, యూఎస్ ఫెడ్ మినిట్స్ విడుదల ముందు అప్రమత్తత చోటుచేసుకొనే అవకాశం ఉన్నందున మార్కెట్లు కొంతకాలం ఒత్తిళ్లకు లోనుకావచ్చు'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.

### మార్కెట్లో మరిన్ని సంగతులు

- క్యూ2 మెరుగైన ప్రదర్శన కనబరిచినప్పటికీ.., ఐటీ దిగ్గజం టీసీఎస్ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోయి రూ.3,069 వద్ద ముగిసింది.
- బీఎస్‌ఈలో నమోదిత కంపెనీలకు 4.3 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ.270 లక్షల కోట్ల దిగువకు చేరింది.
- అమెరికా ఆధారిత రూట్ వన్ హెడ్జ్ ఫండ్ మంగళవారం ఇండస్ ఇండ్‌కు చెందిన 1.20 కోట్ల ఈక్విటీ షేర్లను(1.54% వాటా) ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించింది. ఈ లావాదేవీ విలువ రూ. 1,401 కోట్లుగా ఉంది. ఇండస్ ఇండ్ షేరు 4% నష్టపోయి రూ.1,165 వద్ద స్థిరపడింది.

## డబ్ల్యూఈఎఫ్ లైట్‌హౌస్ నెట్‌వర్క్‌లో డాక్టర్ రెడ్డీస్ ప్లాంటు

### శ్రీ సిటీలోని మాండెలీజ్ ఫ్యాక్టరీకీ చోటు

న్యూఢిల్లీ: గ్లోబల్ లైట్‌హౌస్ నెట్‌వర్క్ (జీఎల్‌ఎన్)లో కొత్తగా 11 ఫ్యాక్టరీలు, పారిశ్రామిక సైట్లను చేర్చినట్లు వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) వెల్లడించింది. ఈ జాబితాలో భారత్ నుంచి దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) హైదరాబాద్ ప్లాంటు, శ్రీసిటీలోని మాండెలీజ్ ఫ్యాక్టరీ, ఇండోర్‌లోని సిప్లా ప్లాంటు ఉన్నాయి. నాలుగో పారిశ్రామిక విప్లవంలో భాగమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3డీ ప్రింటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి విప్లవాత్మకమైన సాంకేతికతలను ఉపయోగించడంలో ముందుంటున్న 100 పైగా తయారీ సంస్థలు జీఎల్‌ఎన్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు మారిపోతున్న నాణ్యత ప్రమాణాల అంచనాలను అందుకునేందుకు డీఆర్‌ఎల్ హైదరాబాద్ ప్లాంటు భారీ స్థాయిలో డిజిటలీకరణ చేపట్టినట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. తయారీ వ్యయాలను 43 శాతం మేర తగ్గించుకున్నట్లు పేర్కొంది.





పాతికేళ్ల హైదరాబాద్ ప్లాంటుకు డిజిటల్ లైట్‌హౌస్ ఫ్యాక్టరీ హోదా దక్కడం గర్వకారణమని డీఆర్‌ఎల్ గ్లోబల్ హెడ్ (తయారీ విభాగం) సంజయ్ శర్మ తెలిపారు. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ ఆటోమేషన్స్ మొదలైన వాటితో శ్రీ సిటీలోని ప్లాంటులో మాండెలీజ్ సంస్థ తయారీ వ్యయాలను 38 శాతం తగ్గించుకుందని, కార్మికుల ఉత్పాదకతను 89 శాతం మేర పెంచుకుందని డబ్ల్యూఈఎఫ్ వివరించింది. అంతర్జాతీయంగా మాండెలీజ్‌కు ఉన్న ఫ్యాక్టరీలకు ఈ ప్లాంటు ప్రామాణికంగా మారిందని తెలిపింది. లైట్‌హౌస్ నెట్‌వర్క్‌లోని నాలుగు సంస్థలకు అత్యుత్తమమైన సస్టెయినబిలిటీ లైట్‌హౌస్‌ల హోదా ఇచ్చినట్లు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది.

## మహీంద్రా ఈ-ఎస్‌యూవీలకు జియో-బీపీ చార్జింగ్ నెట్‌వర్క్

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) ప్రవేశపెట్టబోయే ఎలక్ట్రిక్ ఎస్‌యూవీల కోసం చార్జింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జియో-బీపీ వెల్లడించింది. ముందుగా 16 నగరాల్లో ఎంఅండ్‌ఎం డీలర్‌షిప్ నెట్‌వర్క్‌లు, వర్క్‌షాప్‌లలో డీసీ ఫాస్ట్ చార్జర్లను ఇన్‌స్టాల్ చేయనున్నట్లు తెలిపింది. ఎంఅండ్‌ఎం ఇటీవలే తమ తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ - ఎక్స్‌యూవీ400ను ఆవిష్కరించింది. త్వరలో మరిన్ని వాహనాలను ప్రవేశపెట్టనుంది. దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్-బ్రిటన్‌కు చెందిన బీపీ కలిసి ఇంధనాల రిటైలింగ్ కోసం జాయింట్ వెంచర్‌గా జియో-బీపీని ఏర్పాటు చేశాయి.



---

## భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

డైలీ కరెంట్ అఫైర్స్
అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## జాబ్ పాయింట్

### సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్‌లో 83 టెక్నీషియన్‌లు

హైదరాబాద్‌లోని సైఫాబాద్‌కు చెందిన సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్.. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 83
- » పోస్టుల వివరాలు: జూనియర్ టెక్నీషియన్, ఫైర్‌మ్యాన్.
- » విభాగాలు: ప్రింటింగ్/కంట్రోల్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రికల్ తదితరాలు.

**అర్హతలు**

- » జూనియర్ టెక్నీషియన్: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఫైర్‌మ్యాన్: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2022
- » వెబ్‌సైట్: http://spphyderabad.spcil.com

### ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీలో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

గుంటూరులోని లామ్‌లో ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 02
- » అర్హత: ఎంఎస్సీ(అగ్రికల్చరల్ ఎకనామిక్స్/అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులవ్వాలి.
- » వయసు: పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు.
- » వేతనం: నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- » దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: carp@angrau.ac.in
- » దరఖాస్తులకు చివరితేది: 15.10.2022
- » వెబ్‌సైట్: https://angrau.ac.in

### బీడీఎల్, హైదరాబాద్‌లో 37 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్.. మేనేజ్‌మెంట్ ట్రైనీ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 37
- » పోస్టుల వివరాలు: ఎంటీ(మెకానికల్)-10, ఎంటీ(ఎలక్ట్రానిక్స్)-12, ఎంటీ(ఎలక్ట్రికల్)-03, ఎంటీ(మెటలర్జీ)-02, ఎంటీ(కంప్యూటర్ సైన్స్)-02, ఎంటీ(ఆప్టిక్స్)-01, ఎంటీ(బిజినెస్ డెవలప్‌మెంట్)-01, ఎంటీ(ఫైనాన్స్)-03, ఎంటీ(హ్యూమన్ రీసోర్సెస్)-03.
- » అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » వేతనం: నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 చెల్లిస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 29.10.2022
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.11.2022
- » వెబ్‌సైట్: https://bdl-india.in

### ఐఐటీ తిరుపతిలో 39 ఉద్యోగాలు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 39
- » పోస్టుల వివరాలు: అసిస్టెంట్ రిజిస్ట్రార్,జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్,జూనియర్ లైబ్రరీ టెక్నీషియన్ తదితరాలు.
- » విభాగాలు: సివిల్, కంప్యూటర్ సెంటర్ సిస్టమ్, కెమికల్ ఇంజనీరింగ్, వర్క్‌షాప్, ఫిజిక్స్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎస్ఎస్ఎల్‌సీ /ఐటీఐ/బ్యాచిలర్స్ డిగ్రీ/బీఎస్సీ/బీసీఏ/బీఈ/బీటెక్/డిప్లొమా/ఎంఎస్సీ/ఎంసీఏ /పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- » ఎంపిక విధానం: స్క్రీనింగ్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.11.2022
- » వెబ్‌సైట్: https://iittp.ac.in

### సదరన్ రైల్వేలో 3134 అప్రెంటిస్‌లు

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన సదరన్ రైల్వే అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 3134
- » విభాగాలు: ఫిట్టర్, వెల్డర్, పెయింటర్,ఎంఎల్‌టీ, కార్పెంటర్,మెషినిస్ట్,వైర్‌మెన్ తదితరాలు.
- » అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 15 నుంచి 22 ఏళ్లు ఉండాలి.
- » స్టైపెండ్: నెలకు రూ.5500 నుంచి రూ.7000 చెల్లిస్తారు.
- » ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, అకడమిక్ మెరిట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2022
- » వెబ్‌సైట్: sr.indianrailways.gov.in

## కోడింగ్.. కొలువులు

ఫ్లోకస్ టెక్



- » టెక్ జాబ్ ప్రొఫైల్స్‌లో కోడింగ్ స్కిల్స్‌కు ప్రాధాన్యం
- » కోర్ ఐటీ మొదలు సర్వీస్ సెక్టార్ వరకు ఇదే ధోరణి
- » సంస్థలు ఆన్‌లైన్ బాట పట్టడమే కారణం అంటున్న నిపుణులు
- » కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలతోనే ఉజ్వల కెరీర్

**నేటి యువతలో ఎక్కువ మంది లక్ష్యం.. ఐటీలో కొలువు. లక్షల్లో వేతనం. అకడమిక్ డొమైన్‌తో సంబంధం లేకుండా.. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, సైన్స్, కామర్స్, సోషల్ స్టడీస్.. ఇలా విభాగం ఏదైనా అధికశాతం మంది విద్యార్థుల దృష్టి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపైనే ఉంటోంది. కంపెనీలు మాత్రం అభ్యర్థుల్లో కోడింగ్ నైపుణ్యాలుంటేనే కొలువు అంటున్నాయి. అంటే.. కోడింగ్ స్కిల్స్‌లో కింగ్ అనిపించుకుంటేనే ఐటీ జాబ్ ఆఫర్!! ఈ నేపథ్యంలో.. ఐటీ జాబ్ మార్కెట్ ట్రెండ్స్, కోడింగ్ స్కిల్స్‌కు పెరుగుతున్న డిమాండ్, నైపుణ్యాలు పెంచుకోవడానికి మార్గాలపై ప్రత్యేక కథనం...**

నేడు అన్ని రంగాలు, సంస్థల్లో డిజిటలైజేషన్ ఊపందుకుంది. వినియోగదారులను ఆకట్టుకోవాలంటే.. డిజిటల్ టెక్నాలజీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి. ఇలాంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను రూపొందించాలంటే.. కోడింగ్, ప్రోగ్రామింగ్ స్కిల్స్ కీలకం. అందుకే డిజిటల్ ఆధారిత సేవలందించే సంస్థలన్నీ కోడింగ్ నైపుణ్యాలున్న వారికి పెద్ద పీట వేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**అన్ని రంగాల్లో ఐటీ**

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఐటీ ఆధారిత సేవలు విస్తృతమవుతున్న విషయం తెలిసిందే. దీంతో సంస్థలు తమ ఆన్‌లైన్ సేవలు మెరుగుపరచుకునేందుకు కోడింగ్ ప్రధాన మార్గంగా మారింది. కోర్ ఐటీతోపాటు ఎడ్ టెక్, హెల్త్‌కేర్, ఫిన్‌టెక్, ఈ-కామర్స్ సంస్థల్లోనూ కోడింగ్ నిపుణుల అవసరం పెరిగింది.

**కోడింగ్ ప్రొఫైల్స్‌లోనే**

ప్రస్తుతం అధికశాతం కొలువులు కోడింగ్ ప్రొఫైల్‌లోనే ఉంటున్నాయి. పలు రిక్రూటింగ్, స్టాఫింగ్ సంస్థల అంచనాల ప్రకారం-ఐటీ రంగంలో దాదాపు 80 శాతం మేర కోడింగ్ ప్రొఫైల్స్‌లోనే నియామకాలు జరుగుతున్నాయి. వీరికి ఇచ్చే వేతనాలు కూడా లక్షల్లో ఉంటున్నాయి. లింక్డ్ఇన్, టీమ్ లీజ్, ఇండీడ్ వంటి సంస్థల సర్వేల ప్రకారం-ఐటీ కొలువుల్లో మోస్ట్ డిమాండింగ్ స్కిల్‌గా కోడింగ్ నిలిచింది. ఈ ఏడాది టాప్-5 బెస్ట్ పేయింగ్ జాబ్స్‌లో.. కోడింగ్, ప్రోగ్రామింగ్ డెవలపర్ ప్రొఫైల్స్ చోటు సాధించాయి.

**క్యాంపస్ డ్రైవ్స్‌లోనూ కోడింగ్‌కే**

ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోనూ కంపెనీలు కోడింగ్ స్కిల్స్ ఉన్న వారికే పెద్ద పీట వేస్తున్నాయి. విద్యార్థుల కోడింగ్ నైపుణ్యాలు తెలుసుకునేలా పరీక్షలు సైతం నిర్వహిస్తున్నాయి. వాటిలో చూపిన ప్రతిభ ఆధారంగా కొలువులు ఖరారు చేస్తున్నాయి. ఇలా ఆఫర్ అందుకున్న వారికి రూ.15 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తోంది.

**లభించే జాబ్ ప్రొఫైల్స్**

కోడింగ్ స్కిల్స్‌తో ఉద్యోగాలు సొంతం చేసుకున్న వారికి ప్రస్తుతం ఆయా సంస్థల్లో కోడింగ్ ప్రోగ్రామర్, ఎగ్జిక్యూటివ్, స్క్రిప్ట్ రైటర్, ప్రోగ్రామింగ్ టీమ్ లీడర్, డిజైన్ ఇంజనీర్, డిజైన్ ఎగ్జిక్యూటివ్ వంటి జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ఫ్రెషర్స్‌కు ఎంట్రీ లెవల్‌లో ఎగ్జిక్యూటివ్స్‌గా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వేతనం, పని అనుభవం ఉన్న వారికి రూ.8 లక్షల వరకు వేతనం లభిస్తుంది.

**కోడింగ్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా**

నైపుణ్యాలుంటే.. కోడింగ్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా ఫ్రీలాన్సింగ్ విధానంలోనూ ఉపాధి పొందే అవకాశం లభిస్తోంది. పలు ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థలు, అదే విధంగా స్కిల్ అప్‌గ్రేడ్ దిశగా అడుగులు వేస్తున్న సంస్థలు.. కోడింగ్ విభాగంలో నైపుణ్యం పొందిన వారిని పార్ట్ టైమ్ లేదా ఫ్రీలాన్సింగ్ విధానంలో నియమించుకుంటున్నాయి.

### మేటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్

కోడింగ్.. కంప్యూటర్ చేయాల్సిన పనిని నిర్దేశిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. కంప్యూటర్‌కు నిర్దేశిత సూచనలు ఇవ్వడమే కోడింగ్. కోడింగ్‌నే కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అంటారు. కోడింగ్ లేదా ప్రోగ్రామింగ్ కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు మధ్య అనుసంధాన కర్తగా నిలుస్తుంది. కోడింగ్ నైపుణ్యాలు సొంతం చేసుకోవడానికి సీ, సీ++, జావా, ఆర్, పీహెచ్‌పీ, పైథాన్ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధించాల్సి ఉంటుంది. వీటితోపాటు హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, ఎస్క్యూఎల్ వంటివి కూడా కొలువుల సాధనలో కీలకంగా నిలుస్తున్నాయి.

**పైథాన్**

అంతర్జాతీయ స్థాయిలో అత్యధికంగా వినియోగంలో ఉన్న,విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ప్రోగ్రామింగ్/కోడింగ్ లాంగ్వేజ్ ఇది. పలు జాబ్ సెర్చ్ పోర్టల్స్ అంచనాల ప్రకారం-అంతర్జాతీయ స్థాయిలో టాప్-3 స్కిల్స్ జాబితాలో నిలుస్తోంది. డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్‌లో పైథాన్ కీలకంగా మారుతోంది. ఈ లాంగ్వేజ్ నేర్చుకున్న వారికి డెవలపర్స్, డిజైనర్స్‌గా రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వేతనం లభిస్తోంది.

**జావా**

చాలాకాలంగా వాడుకలో ఉన్న లాంగ్వేజ్.. జావా. బిగ్ డేటా అప్లికేషన్స్, డెస్క్‌టాప్ అప్లికేషన్స్, వెబ్ అప్లికేషన్స్ రూపకల్పనలో కీలకంగా నిలుస్తోంది. అందుకే ఐటీ దిగ్గజ సంస్థలు జావా నిపుణులకు జాబ్ ఆఫర్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. ఈ నైపుణ్యాలున్న వారికి జావా ఈఈ డెవలపర్, జావా డెవలపర్, జావా ఆండ్రాయిడ్ డెవలపర్ వంటి కొలువులు లభిస్తున్నాయి. ప్రారంభంలో సగటు వేతనం రూ.4 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఉంటోంది.

**ఆర్**

కొత్త ఆలోచన రూపకల్పన, గణాంక విశ్లేషణకు ఉపయోగపడుతున్న లాంగ్వేజ్ ఆర్. డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, స్టాటిస్టికల్ కంప్యూటింగ్, గ్రాఫిక్స్ విభాగాల్లో ఆర్ లాంగ్వేజ్ నిపుణులకు కొలువులు లభిస్తున్నాయి. నైపుణ్యాలుంటే.. ప్రారంభంలోనే సగటున రూ.అయిదు లక్షల వార్షిక వేతనం అందుతోంది.

**పీహెచ్‌పీ**

ఓపెన్ సోర్స్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌గా పేర్కొనే పీహెచ్‌పీ డెవలపర్స్‌కూ డిమాండ్ నెలకొంది. వాస్తవానికి 1990లలోనే ఇది వెలుగులోకి వచ్చినా.. నేటికీ ఇది ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తోంది. ముఖ్యంగా వెబ్‌సైట్స్ రూపకల్పనలో ఎక్కువగా పీహెచ్‌పీ లాంగ్వేజ్‌పైనే ఆధారపడుతున్నారు. సగటున రూ. ఆరు లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.

**స్విఫ్ట్**

ఓపెన్ సోర్స్ జనరల్ పర్పస్ లాంగ్వేజ్‌గా యాపిల్ సంస్థ రూపొందించిన స్విఫ్ట్ లాంగ్వేజ్‌ను కూడా ఇప్పుడు కంపెనీల్లో వినియోగిస్తున్నారు. ఈ లాంగ్వేజ్ స్కిల్స్ సొంతం చేసుకున్న వారికి స్విఫ్ట్ డెవలపర్స్‌గా సగటున రూ.8 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

### నేర్చుకునే మార్గాలివే

ప్రస్తుతం కోడింగ్, ప్రోగ్రామింగ్ నేర్చుకునేందుకు పలు మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. జావా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, రెడ్ హ్యాట్, ఐబీఎం వంటి సంస్థలు ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌లో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తున్నాయి.

**ఆన్‌లైన్‌లోనూ**

కోడింగ్ నైపుణ్యాలను పెంచుకునేందుకు ఆన్‌లైన్ వేదికలు చక్కటి మార్గంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా యూట్యూబ్, వర్చువల్ క్లాస్ రూమ్స్, లైవ్ లెక్చర్స్,వర్చువల్ లేబొరేటరీస్‌ను విద్యార్థులు వినియోగించుకోవచ్చు. ఫలితంగా రియల్‌టైం ఎన్విరాన్‌మెంట్‌లో అభ్యసించిన భావన కలుగుతుంది. ముఖ్యంగా ద్వితీయ,తృతీయ శ్రేణి కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఇవి అనుకూలంగా మారుతున్నాయి.

**అకడమిక్ కోర్సులు**

ప్రస్తుతం అకడమిక్ స్థాయిలో కోడింగ్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌ను నేర్చుకునే అవకాశం ఉంది. బీటెక్ స్థాయిలోనే ఏఐ-ఎంఎల్,ఐఓటీ బ్రాంచ్‌లతో పూర్తి స్థాయి కోర్సులను అందిస్తున్నారు. 2020 విద్యా సంవత్సరం నుంచి ఈ బ్రాంచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ఎలక్టివ్స్, మైనర్ కోర్సెస్‌గా ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ కూడా ఉన్నాయి.

### కోడింగ్ స్కిల్స్.. ముఖ్యాంశాలు

- ఐటీ, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో దాదాపు 70 శాతం మేర కోడింగ్ విభాగాల్లోనే ఉద్యోగాలు.
- లింక్డ్ఇన్, టీమ్‌లీజ్, మాన్‌స్టర్ డాట్ కామ్, ఇండీడ్ వంటి సంస్థల అంచనాల ప్రకారం-2022లో అత్యధిక వేతనాలు పొందే ఉద్యోగాల్లో టాప్-5లో నిలుస్తున్న కోడింగ్, ప్రోగ్రామింగ్ జాబ్ ప్రొఫైల్స్.
- నైపుణ్యాలుంటే కనిష్టంగా రూ.అయిదు లక్షల వేతనంతో కెరీర్ ప్రారంభించే అవకాశం.
- ఐబీఎం, సిస్కో, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్.
- అకడమిక్‌గానూ బీటెక్ స్థాయిలో ఏఐ-ఎంఎల్, ఐఓటీ బ్రాంచ్‌లలో మైనర్ సబ్జెక్ట్‌లుగా కోడింగ్, ప్రోగ్రామింగ్.

**బేసిక్, డిమాండింగ్ స్కిల్**

సాఫ్ట్‌వేర్ విభాగంలో కొలువులు కోరుకునే వారికి కోడింగ్ అనేది ఒక బేసిక్, డిమాండింగ్ స్కిల్. కాబట్టి కంప్యూటర్ సైన్స్, ఐటీ బ్రాంచ్‌ల విద్యార్థులు కోడింగ్ నైపుణ్యాలను తప్పనిసరిగా సొంతం చేసుకోవాలి. విద్యార్థులు తమకు వీలైన రీతిలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) కోడింగ్, ప్రోగ్రామింగ్ స్కిల్స్ నేర్చుకునే ప్రయత్నం చేయాలి.

-ప్రొ॥ కృష్ణ మోహన్, డీన్, కెరీర్ సర్వీసెస్, ఐఐటీ - హైదరాబాద్

## క్లుప్తంగా

### 14లోపు రైతులు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్**

**సాక్షి, అమరావతి:** రైతులు ఈ నెల 14 లోపు రైతు భరోసా కేంద్రాల్లో తమ పంట వివరాలను సరిచూసుకుని వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు కోటి పది లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, వంద శాతం ఈ-పంట నమోదు పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ-పంట వివరాలను వీఏఏ, వీఆర్వోలు 99.5శాతం ధ్రువీకరిస్తూ వేలిముద్రలు వేశారని తెలిపారు. అయితే, రైతుల ఈ-కేవైసీ మాత్రం ఇంకా పూర్తి కాలేదని వివరించారు. పంట ఉత్పత్తుల కొనుగోలుతోపాటు పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. తక్షణమే రైతులు తమ సమీప ఆర్బీకేలకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తయిన వారి సెల్‌ఫోన్‌లకు మాత్రమే ఎస్ఎంఎస్‌తోపాటు పంట వివరాలతో కూడిన ధ్రువీకరణపత్రం (రశీదు)లు వస్తాయని తెలిపారు. ఈ-కేవైసీ పూర్తయిన రైతుల జాబితాను మాత్రమే ఈ నెల 17వ తేదీ నుంచి సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

### వ్యవసాయ రంగంపై పరిశోధనలు

**వెస్టర్న్ ఆస్ట్రేలియా వర్సిటీ తెలుగు విద్యార్థులతో మంత్రి కాకాణి**



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం బలోపేతమయ్యేలా పరిశోధనలు సాగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా పెర్త్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా(యూడబ్ల్యూఏ)లో తెలుగు విద్యార్థులతో మంగళవారం మంత్రి కాకాణి భేటీ అయ్యారు. ఏపీ ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం - యూడబ్ల్యూఏ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ కలిసి పని చేసే దిశగా ఓ అవగాహనా ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఏపీలో వ్యవసాయ పీజీ, పీహెచ్‌డీ చదివే విద్యార్థులకు మరింత సౌలభ్యం ఉంటుందని చెప్పారు.



గండికోటలో పర్యటిస్తున్న ఒబెరాయ్ సీఈవో అర్జున్‌సింగ్, స్థానిక అధికారులు

# గండికోటలో ఒబెరాయ్ హోటల్స్..

**స్థలాలు పరిశీలించిన సీఈవో, ప్రతినిధులు**

**జమ్మలమడుగు:** వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సీఈవో అర్జున్‌సింగ్ ఒబెరాయ్ తమ బృందంతో కలసి పర్యటించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన కడప నుంచి ప్రత్యేక వాహనాల్లో గండికోటకు చేరుకున్నారు. ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం కోసం గండికోట, కొట్టాలపల్లి, కోట లోపలతో పాటు జమ్మలమడుగు రహదారిలో ఉన్న మరికొన్ని ప్రభుత్వ స్థలాలను స్థానిక అధికారులు వారికి చూపించారు. వీరివెంట కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఆర్డీవో జి.శ్రీనివాసులు ఉన్నారు.

### 50 ఎకరాల స్థలాన్ని కేటాయించిన ప్రభుత్వం..

గండికోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో గండికోట అభివృద్ధికి సత్వర చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం కోసం 50 ఎకరాల భూమిని 99 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ యాజమాన్యం రూ.250 కోట్లతో 120 విల్లాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రతినిధులు రాజమాన్ శంకర్, వినోద్ గోస్వామి, సమూర్ నాయర్ మహినర్ తుఖర్ గండికోటను సందర్శించిన వారిలో ఉన్నారు. కాగా, ఒబెరాయ్ బృందానికి గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

### నేడు ఇథియోపియా ప్రతినిధి బృందం రాక

- గన్నవరం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, ఆర్బీకే చానల్, కంకిపాడు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ సందర్శన
- సీఎం వైఎస్ జగన్‌తో భేటీ

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) పనితీరును పరిశీలించడానికి ఆఫ్రికా దేశమైన ఇథియోపియా ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్రంలో పర్యటించనుంది. ఇప్పటికే ఆ దేశ వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ మెలెస్ మెకోనెన్ యిమెర్ నేతృత్వంలో పది మంది వ్యవసాయ ఉన్నతాధికారుల బృందం రాష్ట్రానికి చేరుకుంది. ఈ బృందం ఆర్బీకేలు కేంద్రంగా ల్యాబ్ టూ ల్యాండ్ విధానంలో గ్రామ స్థాయిలో రైతులకు అందిస్తున్న సేవలపై అధ్యయనం చేయనుంది. ఆర్బీకేల టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు వాటి సేవలను పరిశీలించనుంది. ఆ దేశ వ్యవసాయ మంత్రి డాక్టర్ మెలెస్ మెకోనెన్ యిమెర్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందంలో ఆ దేశ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రపంచ బ్యాంక్ కన్సల్టెంట్ కలిసి మొత్తం పది మంది ఉన్నారు. కాగా బృందం బుధవారం ఉదయం 9 గంటలకు గన్నవరంలోని ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌తోపాటు ఆర్బీకే చానల్‌ను సందర్శిస్తుంది. అక్కడ నుంచి 10.30 గంటలకు ఉయ్యూరు మండలం గండిగుంట చేరుకొని ఆర్బీకే కేంద్రంలో అందిస్తున్న సేవలను తెలుసుకుంటుంది. అక్కడే రైతులతో ప్రతినిధి బృందం భేటీ కానుంది. తర్వాత కంకిపాడులో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను సందర్శిస్తుంది. అనంతరం విజయవాడ చేరుకొని వ్యవసాయ అనుబంధ శాఖాధికారులతో సమావేశమవుతుంది. మధ్యాహ్నం 3.30 గంటలకు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎంతో భేటీ అవుతుంది.



17 నుంచి వైద్యుల నియామకానికి

# ఇంటర్వ్యూలు

**304 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 150 సీఏఎస్ఎస్ పోస్టులను భర్తీ చేయనున్న వైద్య శాఖ**

**సాక్షి, అమరావతి:** వైద్య శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ)లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి ఈ నెల 17, 18, 19 తేదీల్లో వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని వైద్య శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు తావుండకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 40 వేలకు పైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్లలో భర్తీ చేసింది. ఇటీవల ఏపీవీవీపీలో 351 సీఏఎస్ఎస్, డీఎంఈలో 622 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో సీఏఎస్ఎస్ పోస్టులు 240, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 304 భర్తీ అయ్యాయి. కొన్ని స్పెషాలిటీలు, సూపర్ స్పెషాలిటీల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇతర నియామక నిబంధనలకు లోబడి అభ్యర్థులు లేకపోవడంతో మిగిలిన పోస్టులు భర్తీ అవ్వలేదు. అలాగే గతంలో భర్తీ కాకుండా కొన్ని మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో డీఎంఈలో మిగిలిపోయిన 304 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏపీవీవీపీలో 150 సీఏఎస్ఎస్ పోస్టులకు వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎంపికైన అభ్యర్థులను శాశ్వత ప్రాతిపదికన లేదా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించనున్నారు. కాగా ఏపీవీవీపీలో వైద్యుల వినతి మేరకు బదిలీలకు ఇటీవల ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇందుకు 135 మంది వైద్యులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి బుధవారం బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

**అన్ని పోస్టుల భర్తీకి చర్యలు**



ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులు ఒక్కటి కూడా ఖాళీగా ఉండకూడదని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఈ మేరకు పోస్టులన్నీ భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే స్పెషలిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టుల భర్తీకి వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాం. ఈ అవకాశాన్ని వైద్యులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వినోద్ కుమార్, కమిషనర్, ఏపీవీవీపీ, ఇన్‌చార్జి డీఎంఈ

### బిగ్‌బాస్ షోలో ఏముందో తెలుసుకుంటాం

- ఆ షోను స్వయంగా చూస్తాం
- పూర్తి వివరాలు సమర్పించండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 27కి వాయిదా

**సాక్షి, అమరావతి :** బిగ్‌బాస్ రియాలిటీ షోపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అసలు అందులో ఏముందో తెలుసుకునేందుకు తామూ రెండు మూడు ఎపిసోడ్లు చూస్తామని హైకోర్టు తెలిపింది. ఎలాంటి సెన్సార్‌షిప్ లేకుండా ఈ షో ప్రసారమవుతోందని పిటిషనర్ ఆరోపిస్తున్నందున, ఈ షో పూర్తి వివరాలను తమ ముందుంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అశ్లీల, అనైతిక, హింసాత్మక చర్యలను ప్రోత్సహిస్తున్న బిగ్‌బాస్ షో ప్రసారాన్ని నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి 2019లో, ఇటీవల దాఖలు చేసిన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఇటీవల నెగెటివ్ ప్రచారం (నిర్వాహకులే ప్రచారం కోసం వివాదం సృష్టించడం) చేసుకోవడం ఎక్కువైందని, ఈ వ్యాజ్యం కూడా అందులో భాగమే అనిపిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించగా.. అలాంటిదేమీ లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఎలాంటి సెన్సార్‌షిప్ లేకుండా బిగ్‌బాస్ షో ప్రసారం అవుతోందన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను పరిశీలించాలని కోరారు. ఈ పోటీలో పాల్గొనే మహిళలకు ప్రెగ్నెన్సీ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఈ షోలో ఏముందో తెలుసుకునేందుకు తాము కూడా రెండు మూడు ఎపిసోడ్లు చూస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది.

### 27న విజయవాడలో బీసీ ఆత్మగౌరవ సభ

**సాక్షి, అమరావతి/పటమట(విజయవాడ తూర్పు):** ఈ నెల 27న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నారు. ఈ సభ ఏర్పాట్లపై చర్చించేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హైదరాబాద్‌లో నాయకులతో సమావేశం నిర్వహించారు. బీసీ ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సమావేశ వివరాలను ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేష్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను సన్మానించి బీసీల సత్తా చాటేలా ఆత్మగౌరవ సభను నిర్వహించాలని కృష్ణయ్య సూచించారని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీలంతా ఏకమై పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీ బీసీ సం ఘ మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి పాల్గొన్నారు. అనంతరం బీసీ సంఘ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా మల్లి అప్పారావు, ఉత్తరాంధ్ర కన్వీనర్‌గా సనపాల లక్ష్మీనరసింహ, ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా వెంకటాచార్యులు, రాష్ట్ర కన్వీనర్‌గా తన్నీరు సుబ్బారావు, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాధవికి కృష్ణయ్య నియామకపత్రాలు అందించారు.



బీసీ ఆత్మగౌరవ సదస్సు పోస్టర్ విడుదల చేస్తున్న కృష్ణయ్య, మారేష్, బేబీరాణి తదితరులు

### ములాయంకు చంద్రబాబు నివాళి

**సాక్షి, అమరావతి:** రాజకీయ దిగ్గజం, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ పార్థివదేహానికి టీడీపీ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు నివాళులర్పించారు. మంగళవారం లక్నో వెళ్లిన ఆయన ములాయం కుమారుడు అఖిలేష్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్రకుమార్, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు ఉన్నారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.